ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం 13.11.2025 | సంపుటి :12 సంచిక : 113 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370


సామాన్యుని స్వరం
JANAMSAKSHI TV
జనంసాక్షి tv JANAMSAKSHI

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## సివిల్స్ (మెయిన్) ఫలితాల్లో తెలంగాణ సత్తా

**రాష్ట్రం నుంచి 43 మంది ఇంటర్వ్యూలకు ఎంపిక**

హైదరాబాద్(జనంసాక్షి):అఖిల భారత సర్వీసుల్లో పలు ఉద్యోగాల భర్తీకి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన సివిల్ సర్వీసెస్ (మెయిన్) పరీక్షా ఫలితాలు విడుదలైన విషయం తెలిసిందే. దేశవ్యాప్తంగా ఆగస్టు 22 నుంచి 31 వరకు జరిగిన మెయిన్ పరీక్షల్లో మొత్తంగా 2,736 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూ లేదా పర్సనాలిటీ టెస్ట్ రౌండ్‌కు ఎంపికైనట్లు యూపీఎస్సీ ప్రకటించింది. ఈ మేరకు మెయిన్ రాత పరీక్షలో క్వాలిఫై అయిన విద్యార్థుల రోల్ నంబర్లు, పేర్లతో వేర్వేరుగా జాబితాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. సివిల్స్ మెయిన్ ఫలితాల్లో తెలంగాణ అభ్యర్థులు సత్తా చాటారు. ఈ ఇంటర్వ్యూలకు మిగతా 2లో..




## సివిల్స్ (మెయిన్)కు ఎంపికైన అభ్యర్థులకు సీఎం రేవంత్ అభినందనలు



హైదరాబాద్(జనంసాక్షి):రాష్ట్రం నుంచి సివిల్స్ మెయిన్స్ ఫలితాల్లో విజయం సాధించిన అభ్యర్థులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. యూపీఎస్సీ మెయిన్స్ 2025 ఫలితాల్లో తెలంగాణ అభ్యర్థులు సత్తా చాటారు. రాష్ట్రం నుంచి సివిల్స్ మిగతా 2లో..

## యువత కలలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం



**సివిల్స్ ఇంటర్వ్యూకు తెలంగాణ నుంచి 43 మంది ఎంపిక అభినందనీయం**

**అభ్యర్థులకు రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం ఆర్థిక ప్రోత్సాహం**

**ఇప్పటివరకు 342 అభ్యర్థులకు 3.61 కోట్ల ఆర్థిక సాయం: భట్టి విక్రమార్క**

హైదరాబాద్(జనంసాక్షి):సివిల్స్ అభ్యర్థులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకం ద్వారా లబ్ధి పొందిన 43 మంది మెయిన్స్‌కు మిగతా 2లో..



# ఢిల్లీ పేలుళ్ల క్షతగాత్రులకు మోడీ పరామర్శ

**నిందితుల్ని చట్టం ముందు ప్రవేశపెడతాం**

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఢిల్లీ పేలుడు ఘటనలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారంనాడు పరామర్శించారు. రెండ్రోజుల భూటాన్ పర్యటన ముగించుకుని వచ్చిన ప్రధాని ఆ వెంటనే లోక్‌నాయక్ జయప్రకాష్ ఆసుపత్రికి వెళ్లారు. బాధితులతో నేరుగా మాట్లాడి త్వరగా కోలుకోవాలని అభిలషించారు. వైద్యులు, అధికారులతో మాట్లాడారు. బాధితుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రధాని రాక కోసం ఆసుపత్రి ప్రధాన ద్వారం వద్ద మీడియా వేచి ఉండటంతో ఆయన ఆసుపత్రిలో వెనుక వైపునున్న ప్రత్యేక గేటు ద్వారా లోపలకు వెళ్లారు. ఢిల్లీలో పేలుడుకు బాధ్యులైన వారిని విడిచిపెట్టే ప్రసక్తే లేదని, వారిని చట్టం ముందు ఉంచుతామని పేలుడు ఘటన అనంతరం మోదీ స్పష్టం చేశారు. ఢిల్లీ పేలుడు దుర్ఘటనలో 12 మంది ప్రాణాలు కోల్పోగా, 20 మందికి పైగా గాయపడ్డారు. ఈ ఘటనపై ఎన్‌ఐఏ దర్యాప్తు చేపట్టింది. ఈ క్రమంలో ఆసుపత్రికి చేరుకున్న వెంటనే చికిత్స పొందుతున్న వారిని నేరుగా పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పారు. బాంబు దాడి కుట్రదారులను ఎట్టిపరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని భూటాన్ పర్యటన సందర్భంగానూ ప్రధాని మోదీ హెచ్చరించిన విషయం తెలిసిందే. కేంద్ర సంస్థలు ఈ ఘటనపై దర్యాప్తును ముమ్మరం చేశాయని, దాడికి కారణాలను అధికారులు త్వరలో వెల్లడిస్తారని తెలిపారు. పేలుడులో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సంతాపం తెలిపారు.



- ఉగ్రవాదంపై పోరు కొనసాగుతుంది
- ఘటనపై కేంద్ర కేబినెట్ ఉన్నతస్థాయి సమీక్ష
- ఎగుమతి ప్రోత్సాహక మిషన్‌కు సమావేశం ఆమోదం

వార్త 2లో

## ఢిల్లీ పేలుడు కిరాతక ఉగ్రఘాతుకం

# కాళేశ్వరం పునరుద్ధరిస్తాం

**ఖర్చు గుత్తేదారులే భరించాలి**

- ఆనకట్టల పునరుద్ధరణకు శాస్త్రీయ, సాంకేతిక విధానంలో కసరత్తు జరుగుతోంది
- ఎలా ముందుకు వెళ్లాలన్న దానిపై చర్చలు జరుగుతున్నాయి
- అధికారులతో మంత్రి ఉత్తమ్ సమీక్ష



హైదరాబాద్(జనంసాక్షి): కాళేశ్వరం పునరుద్ధరణపై శాస్త్రీయ విధానంలో చేపట్టేందుకు కసరత్తు చేస్తున్నామని నీటిపారు దలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. భారీ వ్యయంతో నిర్మించిన ఆనకట్టల పునరుద్ధ రణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. అయితే ఎలా ముందుకు వెళ్లాలన్న దానిపై కసర్తతు జరుగుతోందన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టల పునరుద్ధరణకు శా స్త్రీయ, సాంకేతిక విధానంలో కసరత్తు జరుగు తోందని మంత్రి ఉత్తమ్ తెలిపారు. ఆనకట్టల పునరుద్ధరణ సహా నీటిపారుదలశాఖకు సంబంధించిన వివిధ అంశాలపై ఉన్నతాధికారులు, ఇంజనీర్లతో మంత్రి సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. గత బిఆర్ఎస్ హయాంలో భారీ వ్యయంతో నిర్మించిన ఆనకట్టల పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. మేడిగడ్డ ఆనకట్ట దెబ్బతినడానికి.. అన్నారం, సుందిళ్ల ఆనకట్టలో లీకేజీలకు గల కారణాలు, వైఫల్యాలను విజిలెన్స్, ఎన్డీఎస్ఏ, జ్యుడీషి యల్ కమిషన్ నివేదికలు పేర్కొన్నాయని తెలిపారు. డిజైన్లు – నిర్మాణం నిర్వహణలో లోపాలు, సరైన నమూనా అధ్యయనాలు లేకపోవడాన్ని ఎన్డీఎస్ఏ నివేదిక ప్రధానంగా ప్రస్తావించిందని.. మిగతా 2లో..

## పేదల కడుపు నింపేందుకే సన్న బియ్యం పంపిణీ

- అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ నూతన రేషన్ కార్డులు అందిస్తాం
- రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

2లో

## మేడారం అభివృద్ధి పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలి

- నాణ్యతతో రాజీపడేది లేదు
- తేడా వచ్చినా ఉపేక్షించేది లేదు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

ములుగు ప్రతినిధి,నవంబర్ 12(జనంసాక్షి): సమ్మక్క సారలమ్మ దేవాలయం అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టి ఎట్టి పరిస్థితుల్లోనూ డిసెంబర్ 20 లోగా పూర్తి చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు.బుధవారం ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారం కు హెలికాప్టర్ లో 11 గంటల 30 నిముషాలకు చేరుకున్న మంత్రులు పొంగులేటి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్, చీఫ్ మినిస్టర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ కేఎస్ శ్రీనివాసరాజు లకు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎస్పీ శబరిష్ పుష్ప గుచ్ఛాలు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు సమ్మక్క సారలమ్మ అమ్మవార్లను, దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవాలయం అభివృద్ధి పనులను మంత్రులు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. మంత్రులు మిగతా 2లో..




## కేబినెట్ సమావేశం 15కు వాయిదా

హైదరాబాద్(జనంసాక్షి): బుధవారంజరగాల్సిన తెలంగాణ కేబినెట్ సమావేశం మళ్లీ వాయిదా పడింది. ఈ నెల 15వ తేదీకి వాయిదా పడింది. శనివారం సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగే కేబినెట్ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు బీసీ రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. ఈ మంత్రివర్గ సమావేశానికి మంత్రులు, ఉన్నతాధికారులు హాజరు కానున్నారు. వాస్తవానికి తెలంగాణ కేబినెట్ సమావేశం ఈ నెల 7వ తేదీన జరగాల్సి ఉండే. కానీ సమావేశాన్ని 12వ తేదీకి వాయిదా వేశారు. మళ్లీ ఇవాళ వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. జూబ్లీహిల్స్ ఫలితం తేలిన మరుసటి రోజున కేబినెట్ సమావేశం నిర్వహించాలని నిర్ణయించినట్లు సమాచారం. మిగతా 2లో..

## నటుడు నాగార్జునపై నా వ్యాఖ్యలు వెనక్కి తీసుకుంటున్నా


మంత్రి కొండా సురేఖ 2లో

# 26/11 తరహా పేలుళ్లకు కుట్ర

- అక్టోబర్29న కారును కొన్న డాక్టర్ నబీ
- గత 11 రోజులుగా అండర్ గ్రౌండ్‌లో కారు
- ఆత్మాహుతి దాడిలో మరో కారు గుర్తింపు
- పేలుడు తర్వాత కనిపించకుండా పోయిన అల్-ఫలాహ్ యూనివర్సిటీ వైద్యుడు ప్రొఫెసర్ డాక్టర్ నిసార్ ఉల్ హసన్
- ఢిల్లీ ఎర్రకోట పేలుడుతో తవ్వుతున్నకొద్దీ పలు కీలక విషయాలు వెలుగులోకి...
- వెలుగులోకి వచ్చిన పేలుళ్ల సిసి టివి దృశ్యాలు

**200 ఐఈడీ బాంబులు, భారీగా పేలుడు పదార్థాలు సిద్ధం చేసే పనిలో ఉగ్రవాదులు**

న్యూఢిల్లీ(జనంసాక్షి):దిల్లీలోని ఎర్రకోట వద్ద పేలుడు ఘటనలో తవ్వే కొద్దీ సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. 26/11 ముంబయి దాడుల తరహాలో దేశ రాజధానిలో వరుస పేలుళ్లకు ఉగ్రవాదులు కుట్ర పన్నినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. వీరిలో టార్గెట్ లిస్ట్‌లో ఎర్రకోటతో పాటు ఇండియా గేట్ వంటి ఇతర ప్రముఖ కట్టడాలు ఉన్నట్లు దర్యాప్తు వర్గాలను ఉటంకిస్తూ ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. ఇందుకోసం భారీగా బాంబులను కూడా తయారుచేస్తున్నట్లు పేర్కొన్నాయి. ఎర్రకోట వద్ద పేలుడు ఘటనపై ముమ్మరంగా దర్యాప్తు కొనసాగుతోంది. ఇందులోభాగంగానే పలు అనుమానితులు, నిందితులను విచారించి వారి నుంచి కూపీ లాగుతున్నారు. పేలుడుకు కారణమైన వైద్యుల టెర్రర్ మాడ్యూల్ వెనక పాక్ కేంద్రంగా పనిచేస్తోన్న జైషే మహ్మద్ ఉగ్రముఠా ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. దిల్లీలో వరుస పేలుళ్ల కోసం ఉగ్రవాదులు జనవరి నుంచి పథక రచన చేస్తున్నట్లు విచారణలో తేలినట్లు సమాచారం. ఈ టెర్రర్ మాడ్యూల్ అత్యంత శక్తిమంతమైన 200 ఐఈడీలను సిద్ధం చేసే పనిలో ఉన్నట్లు దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి. దిల్లీలోని ఎర్రకోట, ఇండియా గేట్, కాన్‌స్టిట్యూషన్ క్లబ్, గౌరీశంకర్ ఆలయం సహా దేశవ్యాప్తంగా పలు రైల్వేస్టేషన్లు, షాపింగ్ మాల్స్ వద్ద పేలుళ్లకు పాల్పడాలని వీరు కుట్ర పన్నుతున్నట్లు తెలిపాయి. మిగతా 2లో..



ఆత్మాహుతి దాడిలో వినియోగించినట్టుగా గుర్తించ బడ్డ మరో కారు

## ఫరీదాబాద్ ఉగ్రకుట్రలో భాగస్వాములందరూ వైద్యులే

- టెర్రర్ మాడ్యూల్ వెనక ఇమామ్ ఇర్ఫాన్ అహ్మద్
- పోలీసుల అదుపులో కాశ్మీర్‌కు చెందిన అహ్మద్

2లో..

## భారత్‌కు అండగా ఉంటాం

**అవసరమైన సాయం చేస్తాం : ప్రధాని నెతన్యాహు**

## బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలి

**అందులో అందరి భాగస్వామ్యం ఉండాలి**

**అలా అయితేనే బంగ్లాదేశ్‌కు తిరిగొస్తా: షేక్ హసీనా**



న్యూఢిల్లీ(జనంసాక్షి):తాను స్వదేశానికి తిరిగి రావాలంటే బంగ్లాదేశ్‌లో అందరి భాగస్వామ్యం ఉండేలా ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలని భారత్‌లో ఆశ్రయం పొందుతున్న ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా ఆ దేశానికి షరతు పెట్టారు. బంగ్లాలో అవామీ లీగ్ పార్టీపై నిషేధం ఎత్తివేత, స్వేచ్ఛాయుతమైన, న్యాయమైన ఎన్నికలను నిర్వహించినప్పుడే తాను తిరిగివెళ్తానని అన్నారు. అటువంటి పరిస్థితులనే అక్కడి ప్రజలు కూడా కోరుకుంటున్నారన్నారు. పీటీఐకి ఇచ్చిన ఈమెయిల్ ఇంటర్వ్యూలో ఆమె మిగతా 9లో..

# అమెరికాకు వలస కార్మికులు కావాలి



- మా దేశ పారిశ్రామిక, రక్షణ రంగాల అభివృద్ధికి విదేశీ కార్మికులు అవసరం
- తొలిసారిగా సానుకూల దృక్పథంతో మాట్లాడిన ట్రంప్

వాషింగ్టన్(జనంసాక్షి):ట్రంప్ వలస కార్మికులపై తొలిసారిగా పాజిటివ్‌గా స్పందించారు. అమెరికా పారిశ్రామిక, రక్షణ రంగాలలో అభివృద్ధి సాధించాలంటే ఇతర దేశాల నుంచి నైపుణ్యత గల కార్మికులను తమ దేశానికి తీసుకురావాలన్నారు. అయితే, అది పరిమిత స్థాయిలో ఉండాలని ట్రంప్ స్పష్టం చేశారు.ట్రంప్ ఎప్పుడు ఏ నిర్ణయం తో ఎవరిని ఇబ్బందిపెడతారో అని ఆలోచిస్తున్నాయి. అధికారం లోకి వచ్చిన నాటి నుంచి తన తొందరపాటు నిర్ణయాలతో ప్రపంచ దేశాలను ఇబ్బంది పెట్టిన ట్రంప్.. హెచ్–1బీ వీసాలపై కూడా తన మార్క్ చూపించారు. హెచ్–1బీ వీసా దరఖాస్తు రుసుమును లక్ష డాలర్లు కు పెంచి అమెరికాలో స్థిరపడాలనుకొనే ఉద్యోగస్థుల ఆశలపై నీళ్లు చల్లారు. వీసాల విషయంలో కఠిన నిబంధనలను కూడా తెరపైకి తెచ్చారు. అయితే, తాజాగా ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాత్రం వలస కార్మికులపై ట్రంప్ పాజిటివ్‌గా మాట్లాడారు. మ్యానుఫ్యా క్చరింగ్ సెక్టార్‌తోపాటు, రక్షణ రంగంలో నైపుణ్యత గలిగిన వలస కార్మికులను నియమించుకోవాలని, ఆ రంగాలలో అమెరికన్లకు నైపుణ్యత లేదన్నారు. తమ దేశంలో ఎంతో ప్రతిభ గల యువకులున్నారని తమ ప్రభుత్వ విధానాలతో అమెరికన్లకు వేతనాలు పెరిగే అవకాశముందని ట్రంప్ తన చర్యలను సమర్థించారు. దేశ యువత స్కిల్స్ నేర్చుకోవాలని అలా చేస్తే వారితో మిస్సైల్స్ తయారు చేయిస్తానని, దేశంలో నిరుద్యోగం లేకుండా చేయవచ్చని అధ్యక్షుడు ట్రంప్ తేల్చిచెప్పా రు.ఇదిలా ఉండగా.. ట్రంప్ తీసుకున్న నిర్ణయాలతో అమెరికా మ్యాను ఫ్యాక్చరింగ్ సెక్టార్ తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటుంది. నైపుణ్య త గల కార్మికులను అక్రమ వలసలు పేరుతో తొలగిం చడం ద్వారా తయరీ రంగంలో కార్మికుల కొరత ఏర్పడిందని పలు నివేదికలు తెలుపుతున్నాయి.పరిస్థితులు మరింత దిగజారగ ముందే ఇలా మాట్లాడినట్టు సమాచారం.

## అమెరికాలో భారతీయ విద్యార్థులకు మరిన్ని అవస్థలు

**ఓపీటీ ప్రోగ్రామ్‌పై కీలక ప్రతిపాదన..**

2లో..

## రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు

- రాష్ట్రవ్యాప్తంగా 33 ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్స్
- రాష్ట్ర స్థాయిలో 3 ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు: మంత్రి పొన్నం



12లో..

## యువత కొత్త ఆలోచనలతో రావాలి

**స్టార్టప్‌లు పెట్టేవారికి ప్రోత్సాహం: మంత్రి శ్రీధర్‌బాబు**



హైదరాబాద్(జనంసాక్షి):యువత సరికొత్త ఆలోచనలతో ముందుకు రావాలని మంత్రి శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని అన్నారు. ఎన్నో అవకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకోవాలన్నారు. రాయదుర్గం టీ హబ్‌లో నిర్వహించిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. సాహసాలు చేసినప్పుడే విజయం దక్కుతుందని పేర్కొన్నారు. ఉన్నత స్థానానికి చేరుకోవాలనే లక్ష్యం పెట్టుకుని ఆ దిశగా కష్టపడాలన్నారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమలను మిగతా 2లో..

## కాళేశ్వరంపై విచారణ జనవరికి వాయిదా

2లో..

## గగన్‌యాన్ మరో అడుగు ముందుకు

**ఇంటిగ్రేటెడ్ మెయిన్ పారాచూట్ ఎయిర్‌డ్రాప్ టెస్ట్ పూర్తి**

# ఢిల్లీ పేలుడు కిరాతక ఉగ్ర ఘాతుకం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**దిల్లీ కారు పేలుడు ఘటన నేపథ్యంలో ప్రధాని మోదీ నేతృత్వంలో కేంద్ర కేబినెట్ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించింది. దర్యాప్తు కొనసాగుతున్న తీరు, భద్రతా చర్యలు, ఆయా సంస్థల మధ్య సమన్వయంపై దృష్టి సారించినట్లు సమాచారం. ఈ సందర్భంగా ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపంగా రెండు నిమిషాల పాటు కేంద్ర కేబినెట్ మౌనం పాటించింది. ప్రధాని నివాసంలో జరిగిన ఈ సమీక్షా సమావేశంలో కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, తదితరులు పాల్గొన్నారు.దిల్లీ పేలుడు ఘటనను ఖండించిన కేంద్ర కేబినెట్.. ఇది కిరాతక ఉగ్ర ఘాతుకంగా పేర్కొంది. ఉగ్రవాదంపై పోరు కొనసాగించాలని నిర్ణయించింది. ఈ ఘటనకు కారకులైన వారిని చట్టం ముందు నిలబెడతామని ఉద్ఘాటించింది. ఇందుకు సంబంధించిన తీర్మానాన్ని కేంద్ర కేబినెట్ ఆమోదించినట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.ఎగుమతి ప్రోత్సాహక మిషన్‌కు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీలో దీనికి ఆమోద ముద్ర వేసింది. దీని ద్వారా ఆరేళ్లపాటు రూ.25,060 కోట్లు కేటాయించనున్నారు. ఎగుమతుల ఎకో సిస్టమ్ బలోపేతానికే ఈ మిషన్‌ను తీసుకొచ్చారు. ఎగుమతిదారుల కోసం క్రెడిట్ గ్యారంటీ పథకం విస్తరణకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది.

## సివిల్స్ (మెయిన్)లో సత్తా ఫలితాల్లో తెలంగాణ సత్తా

ఎంపికైన వారిలో 43మంది అభ్యర్థులు తెలంగాణ నుంచి ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. యువతకు సాధికారత కల్పించేందుకు సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న కృషిలో భాగంగా చేపట్టిన రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకం కింద సహాయం పొందిన వారిలో 43మంది సివిల్స్‌లో ఇంటర్వ్యూలకు ఎంపికైనట్లు పేర్కొంది. గతేడాది ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన 140 మంది అభ్యర్థులు రూ.లక్ష చొప్పున రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం పొందగా.. 20మంది మెయిన్ పరీక్షలో క్వాలిఫై అయ్యారు. ఈ ఏడాది 202 మందికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించగా.. వారిలో 43మంది ఇంటర్వ్యూ దశకు చేరడం విశేషం. ఈ 43 మంది అభ్యర్థులకు త్వరలోనే మరో రూ.లక్ష చొప్పున ఆర్థిక ప్రోత్సాహకాన్ని సీఎం రేవంత్ రెడ్డి అందించనున్నట్లు అధికారులు తెలిపారు. సీనియర్ సివిల్ సర్వీసెస్ అధికారులతో మాక్ ఇంటర్వ్యూలు ఏర్పాటు చేయడంతో పాటు ఇంటర్వ్యూ సమయంలో దిల్లీలో ఉచిత వసతి అందిస్తామని పేర్కొన్నారు.

## సివిల్స్ (మెయిన్)కు ఎంపికైన అభ్యర్థులకు సీఎం రేవంత్ అభినందనలు

మెయిన్స్ పరీక్షలకు హాజరైన అభ్యర్థులకు ప్రభుత్వం రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించింది. సివిల్స్ సాధించే లక్ష్యంతో ప్రిపేరయ్యే పేద కుటుంబీకులకు అండగా నిలిచేందుకు గత ఏడాది రాజీవ్ సివిల్స్ అభయ హస్తం పథకాన్ని ప్రారంభించింది. ఈ ఏడాది కూడా ఈ పథకం కింద సింగరేణి సంస్థ అధ్వర్యంలో 202 మందికి రూ. లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించింది. రాజీవ్ సివిల్స్ అభయ హస్తం సాయం అందుకున్న అభ్యర్థు ల్లో 43 మంది తాజాగా యూపీఎస్సీ మెయిన్స్ ఫలితాల్లోనూ విజేతలుగా నిలిచారు. వీరందరికీ గతేడాది మాదిరిగా ఈసారి కూడా ఇంటర్వ్యూలకు సన్నద్ధం అయ్యేందుకు మరో లక్ష రూపాయల ప్రోత్సాహకం అందించనున్నారు.

## నిరుద్యోగ యువత కలలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం


ఎంపిక కావడం అభినందనీయమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. గత ఏడాది ఈ పథకాన్ని ప్రారంభించగా ఇప్పటివరకు ఈ పథకం ద్వారా 342 మంది తెలంగాణ యువత 3.62 కోట్ల రూపాయల ఆర్థిక సహాయాన్ని సింగరేణి సంస్థ ద్వారా పొందారని తెలిపారు.నిరుద్యోగ యువత కలలను సాకారం చేయడంలో భాగంగా సివిల్స్ మెయిన్స్, ఇంటర్వ్యూలకు ఎంపికిన వారికి రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం పథకాన్ని ప్రారంభించి ప్రతి దశలో లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందిస్తోంది అన్నారు. ఈ పథకం కింద ఈ సంవత్సరం మెయిన్స్ కు ఎంపికైన 202 మంది సివిల్స్ విద్యార్థులకు ప్రతి ఒక్కరికి లక్ష రూపాయల చొప్పున ఆర్థిక ప్రోత్సహాన్ని అందించాం అన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని అందులో 43 మంది విద్యార్థులు సివిల్స్ లక్ష్యానికి చేరువ కావడం అభినందనీయం అన్నారు. ఆ 43 మంది ఇంటర్వ్యూకు ఎంపిక కావడం ఆనందాన్ని కలిగిస్తోంది, ఇంటర్వ్యూ కు ఎంపికైన 43 మంది విద్యార్థులకు మరో లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందిస్తాము. ఆర్థిక సహాయంతో పాటు ఢిల్లీలో వారికి వసతి సౌకర్యాలు కల్పిస్తాం అన్నారు. నిరుద్యోగ యువత కలలను సాకారం చేయడానికి ప్రజా ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తుందని సివిల్స్ మెయిన్స్ ఫలితాల సందర్భంగా మరోమారు నిరూపితమైంది అన్నారు. ఫైనల్ ఇంటర్వ్యూలకు ఎంపికైన విజేతలకు అభినందనలు తెలియజేస్తున్నాం. ఇంటర్వ్యూలలోనూ సత్తా చాటి తెలంగాణ ప్రతిష్టను దేశవ్యాప్తం చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అన్నారు.గొప్ప సంకల్పంతో 20 24 లో రాజీవ్ గాంధీ సివిల్స్ అభయాసం పథకాన్ని ప్రారంభించగా మొదటి సంవత్సరం 140 మంది మెయిన్స్ కు ఎంపికయ్యారు, 20 మంది ఇంటర్వ్యూకు ఎంపిక కాగా అందులో ఏడుగురు సివిల్ సర్వీసెస్ సాధించి వివిధ హెూదాల్లో స్థిరపడడం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, ఆర్థిక సహకారం అందించిన సింగరేణి, గర్వకారణం గా భావిస్తున్నాయి అన్నారు. రెండవ సంవత్సరంలో భాగంగా మెయిన్స్ కు ఎంపికైన 202 మందికి ఆర్థిక సహకారం అందించగా అందులో 43 మంది ఇంటర్వ్యూకు ఎంపికయ్యారని వివరించారు. ఇప్పటివరకు ఈ పథకం కింద 3.62 కోట్ల రూపాయల ఆర్థిక సాయం తెలంగాణ యువతకు అందించామని తెలిపారు.

# మరో అడుగు ముందుకు గగన్‌యాన్

**- ఇంటిగ్రేటెడ్ మెయిన్ పారాచూట్ ఎయిర్‌డ్రాప్ టెస్ట్ పూర్తి**

**- తెరుచుకున్న పేలోడ్ పారాచూట్లు**

**శ్రీహరికోట(జనంసాక్షి):**మానవ సహిత అంతరిక్ష ప్రయోగం దిశగా ఇస్రో మరో కీలక ముందడుగు వేసింది. గగన్‌యాన్ సన్నాహక పరీక్షల్లో భాగంగా ఈ నెల 3న నిర్వహించిన.. ఇంటిగ్రేటెడ్ మెయిన్ పారాచూట్ ఎయిర్‌డ్రాప్ టెస్ట్ (ఐఎంఏటీ) విజయవంతమైంది. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం ఝూన్సీలోని



బబీనా ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్ (బీఎఫ్‌ఎఫ్‌ఆర్)లో ఈ పరీక్షలను నిర్వహించినట్లు ఇస్రో మంగళవారం ఓ వీడియో విడుదల చేసింది. ఐఎంఏటీలో భాగంగా తొలుత వైమానిక దళానికి చెందిన ఐఎల్-76 విమానం నుంచి క్రూ మాడ్యూల్ బరువుకు సమానమైన ఆరు టన్నుల పేలోడ్‌ను 2.5 కి.మీ. ఎత్తు నుంచి జారవిడిచారు. పారాచూట్ వ్యవస్థ సక్రమంగా పనిచేయడంతో పేలోడ్ సురక్షితంగా ల్యాండ్ అయింది. విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ (వీఎస్ఎస్సీ), డీఆర్డీవోకు చెందిన ఏరియల్ డెలివరీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ (ఏడీఆర్డీఈ), ఎయిర్‌ఫోర్స్, ఆర్మీ క్రియాశీలకంగా వ్యవహరించాయి. తెరుచుకోవడం ఆలస్యమైతే..?: గగన్‌యాన్ క్రూ మాడ్యూల్ సురక్షిత ల్యాండింగ్ కోసం మొత్తం నాలుగు రకాలైన పది పారాచూట్లు ఉంటాయి. ఇందులో ఉండే మూడు ప్రధాన పారాచూట్లు క్రూ మాడ్యూల్‌ను సురక్షితంగా భూమిపైకి తీసుకురావడంలో కీలకంగా వ్యవహరిస్తాయి. వాస్తవానికి సురక్షిత ల్యాండింగ్‌కు రెండు ప్రధాన పారాచూట్లు సరిపోతాయి. తాజా పరీక్షలో ఇవి రెండూ తెరుచుకోవడం ఆలస్యమైతే మాడ్యూల్ ల్యాండింగ్ వ్యవస్థ ఎలా పనిచేస్తోంది, వేగంలో నియంత్రణ ఏ మేరకు ఉందనే అంశాలను పరిశీలించారు.

# 26/11 తరహా పేలుళ్లకు కుట్ర



ప్రొఫెసర్ డాక్టర్ నిసార్ ఉల్ హసన్



ఈ టెర్రర్ మాడ్యూల్‌పై ఇటీవల జమ్మూకశ్మీర్, హరియాణా, ఉత్తర్‌ప్రదేశ్, కేంద్ర ఏజెన్సీలు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో అమ్మోనియం నైట్రేట్, పొటాషియం నైట్రేట్ సహా సల్ఫర్‌తో కూడిన 2,900 కిలోల పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. ఇక, దిల్లీలో పేలుడు జరిగిన ప్రాంతం నుంచి 40 నమూనాలను ఫోరెన్సిక్ అధికారులు సేకరించారు. ఇందులో కూడా అమ్మోనియం నైట్రేట్ ఆనవాళ్లతో పాటు అత్యంత శక్తిమంతమైన మరో పేలుడు పదార్థం కూడా ఉన్నట్లు అనుమానిస్తున్నారు.దిల్లీ పేలుడు కేసును ఎన్ఐఏ దర్యాప్తు చేస్తోంది. ఇందుకోసం 10 మంది సభ్యులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేసింది. జమ్మూకశ్మీర్, దిల్లీ, హరియాణా పోలీసుల నుంచి కేసు డైరీలను తీసుకొని అన్ని కోణాల్లో దర్యాప్తు చేపడుతోంది. నిందితుల కార్యకలాపాలు, వారికి అందిన ఆర్థిక సహకారం గురించి ఆరా తీస్తోంది. బుధవారం సాయంత్రం ఇంటెలిజెన్స్ బ్యూరో చీఫ్‌తో ఎన్ఐఏ డీజీతో కీలక భేటీ నిర్వహించనున్నారు. గత 11 రోజులుగా అండర్ గ్రౌండ్‌లో కారు దిల్లీ పేలుడు ఘటనపై ముమ్మర దర్యాప్తు జరుగుతోంది. ఎర్రకోటకు అతి సమీపంలో పేలిన ఐ20 కారును డాక్టర్ ఉమర్ నబీ.. బ్లాస్ట్‌కు పది రోజుల ముందు కొనుగోలు చేశాడని దర్యాప్తు చేస్తున్న వర్గాలు వెల్లడించాయి. అక్టోబర్ 29న దానిని కొనుగోలు చేసిన అతడు.. వెంటనే దానికి కాలుష్య నియంత్రణ ధ్రువపత్రాన్ని తీసుకున్నాడు. ఆ తర్వాత అతడు అండర్‌గ్రౌండ్‌కు వెళ్లిపోయాడని, అప్పటినుంచి కారు ఎక్కడ ఉందో కచ్చితంగా తెలియడం లేదు. సోషల్ మీడియాలో మాత్రం అల్ ఫలాహ్ విశ్వవిద్యాలయం వద్ద ఉన్నట్లు ప్రచారం జరిగింది. కానీ, ఫరీదాబాద్ పోలీసుల వాదన దీనికి భిన్నంగా ఉంది. కారు గత 10-11 రోజులుగా అక్కడలేదని వారు చెబుతున్నారు. ఇక కాలుష్య నియంత్రణ ధ్రువీకరణపత్రం తీసుకునే సమయంలో ముగ్గురు వ్యక్తులు కారు నుంచి బయటకు వచ్చారు. వారు ఎవరనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. మరోవైపు, వరుసగా తన సహచరులను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో ఆందోళనకు గురైన ఉమర్ నవంబర్ 10న ఆ కారు తీసుకొని, దిల్లీ వైపు వెళ్లాడని ఆ వర్గాలు పేర్కొన్నాయి. జాతీయ దర్యాప్తు సంస్థ, నేషనల్ సెక్యూరిటీ గార్డ్ సహా పలు సంస్థలు ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నాయి.

### కనిపించకుండా పోయిన వైద్యుడు డాక్టర్ నిసార్ ఉల్ హసన్

ఎర్రకోట పేలుడు ఘటన తర్వాత హరియాణాలో ఫరీదాబాద్‌లోని అల్-ఫలాహ్ యూనివర్సిటీ వార్తల్లో నిలిచింది. ఇప్పుడు ఆ విద్యాసంస్థకు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ నిసార్ ఉల్ హసన్ కనిపించకుండాపోయాడు. గతంలో అతడిపై ఉగ్ర ఆరోపణలు ఉండటం గమనార్హం. జాతీయ మీడియా కథనాల ప్రకారం..దిల్లీ పేలుడు తర్వాత అల్-ఫలాహ్ యూనివర్సిటీదర్యాప్తు అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. పలువురిని ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ విద్యాసంస్థలో నిసార్ పనిచేస్తున్నట్లు గుర్తించారని తెలుస్తోంది. 2023లో అతడిని లెఫ్టినెంట్ గవర్నర్ ఉద్యోగం నుంచి తొలగించారు. అప్పుడు అతడు కశ్మీర్‌లోని ఎస్ఎంహెచ్ఎస్ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసేవాడు. ఉగ్రముఠాలతో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలతో ఆర్టికల్ 311(2) కింద ఉద్యోగం నుంచి తీసేశారు. భద్రతకు సంబంధించిన కేసుల్లో శాఖాపరమైన విచారణ లేకుండానే సదరు ఉద్యోగిని విధుల నుంచి తప్పించేందుకు ప్రభుత్వానికి వీలు ఉంటుంది. ఆ తర్వాత అతడికి యూనివర్సిటీలో మెడిసిన్ విభాగంలో ప్రొఫెసర్‌గా ఉద్యోగం లభించినట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇక నవంబర్ 10 పేలుడు తర్వాత అతడు కనిపించకుండా పోయాడని అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం అతడి జాడ కోసం గాలిస్తున్నారు.ఇదిలా ఉంటే.. అల్-ఫలాహ్ విశ్వవిద్యాలయం చుట్టూ వినిపిస్తోన్న కథనాల వేళ ఆ విద్యాసంస్థ స్పందించింది. "మా సంస్థలో విద్యనభ్యసించి, పట్టభద్రులైన వారు భారత్, విదేశాల్లో ప్రముఖ ఆసుపత్రులు, సంస్థల్లో బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నారు. ప్రస్తుతం జరుగుతోన్న దురదృష్టకర పరిణామాలు మమ్మల్ని బాధించాయి వాటిని మేం ఖండిస్తున్నాం. యూనివర్సిటీ ప్రతిష్టను దెబ్బతీసేలా కొన్ని ఆన్‌లైన్ సంస్థలు నిరాధార కథనాలు వ్యాప్తి చేయడంపై ఆందోళన చెందుతున్నాం." అని ఒక ప్రకటనలో పేర్కొంది.

### వెలుగులోకి వచ్చిన పేలుళ్ల సిసి టివి దృశ్యాలు

ఎర్రకోట ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర కారు బ్లాస్ట్‌కు సంబంధించిన సిసి టివి దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. సోమవారం సాయంత్రం 6:50 గంటల ప్రాంతంలో ఎర్రకోట మెట్రో స్టేషన్ గేట్ నెంబర్-1 సమీపంలో ట్రాఫిక్ సిగ్నల్ ఉంది. దీంతో వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. ఇందులో హ్యుందాయ్ ఐ20 కారు ఒక్కసారిగా పేలిపోయింది. అధిక తీవ్రతతో కూడిన పేలుడు సంభవించింది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సీసీటీవీ ఫుటేజ్‌లో రికార్డు అయ్యింది. ఇదిలా ఉంటే ఫరీదాబాద్‌లో అరెస్టైన డాక్టర్ ముజమ్మిల్ నుంచి కీలక విషయాలను రాబట్టాయి. ఎర్రకోట దగ్గర జరిగిన దాడి దీపావళి నాడు ప్లాన్ చేసినట్లుగా వర్గాలు పేర్కొన్నాయి. దీపావళి నాడు రద్దీగా ఉన్న ప్రాంతాల్లో దాడి చేయాలని ప్లాన్ చేశామని.. అనంతరం ఆ ప్లాన్ రద్దు చేసుకున్నట్లుగా ముజమ్మిల్ దర్యాప్తు అధికారులకు చెప్పినట్లుగా సమాచారం.

### ఆత్మాహుతి దాడిలో మరో కారు గుర్తింపు

ఎర్రకోట దగ్గర పేలుడు ఘటనపై దర్యాప్తు ముమ్మరమైంది. ఈ ఆత్మాహుతి దాడి ఘటనలో ముష్కరులు మరో కారును కూడా ఉపయోగించినట్టు నిఘా సంస్థలు కనిపెట్టాయి. వీరు ఉపయోగించినట్టు భావిస్తున్న ఎరుపురంగు ఎకోస్పోర్ట్ కారు కోసం పోలీసులు ప్రస్తుతం గాలిస్తున్నారు. ఈ కారు డాక్టర్ ఉమర్ పేరుతో రిజిస్టర్ అయిందని, కారు నెంబర్ డిఎల్ 10సికె 0458 అని నిఘా సంస్థలు గుర్తించాయి. దీంతో అన్ని పోలీస్ స్టేషన్లు, పోలీస్ పోస్టులు, బోర్డర్ చెక్‌పాయింట్లను పోలీసులు అప్రమత్తం చేశారు. ఢిల్లీ పేలుడు ఘటనతో సంబంధం ఉన్న జైష్ మాడ్యూల్ నుంచి పోలీసులు రాబట్టిన సమాచారం ప్రకారం టెర్రర్ ఆపరేటివ్స్ అయిన డాక్టర్ ఉమర్, అమిర్‌లు ఢిల్లీ నుంచి మరో రెండు కార్లు సేకరించినట్టు బయటపడింది. ఉగ్ర కుట్రలో ఈ కార్లను ఉపయోగించినట్టు అనుమానిస్తున్నారు.

## ఫరీదాబాద్ ఉగ్రకుట్రలో భాగస్వాములందరూ వైద్యులే

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఫరీదాబాద్‌లో భద్రతాధికారులు నిర్వహించిన ఆపరేషన్‌లో ఉగ్ర కుట్రల్లో భాగమైనవారు వైద్యులని తేలడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. తాజాగా ఈ టెర్రర్ మాడ్యూల్ వెనక ఉన్న ప్రధాన సూత్రధారిని కూడా అధికారులు గుర్తించారు. అతడే ఇమామ్ ఇర్ఫాన్ అహ్మద్. జమ్మూకశ్మీర్ పోలీసులు ఇప్పటికే ఇర్ఫాన్‌ను అరెస్టు చేశారు. అతడి గురించి ఆరాతీయగా.. కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇర్ఫాన్‌ది జమ్మూకశ్మీర్‌లోని షోపియాన్ ప్రాంతం. వైద్య విద్యార్థులకు ఉగ్రవాద భావజాలాన్ని నూరిపోయడంలో కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. గతంలో అతడు శ్రీనగర్‌లోని ప్రభుత్వ వైద్యకళాశాలలో పారామెడికల్ సిబ్బందిగా పని చేశాడు. నౌగామ్‌లోని ఓ మసీదులో కలిసిన విద్యార్థులతో సంబంధాలు కొనసాగించాడు. పాక్‌కు చెందిన జైషే మహమ్మద్ ఉగ్ర సంస్థ నుంచి ప్రేరణ పొందిన ఇర్ఫాన్.. ఫరీదాబాద్‌లోని వైద్య విద్యార్థులకు ఉగ్రవాద భావజాలాన్ని నూరిపోసినట్లు తెలుస్తోంది. జైషేకు సంబంధించిన వీడియోలను పదేపదే విద్యార్థులకు చూపించినట్లు సమాచారం. ఇంటర్నెట్ కాల్స్‌తో అఫ్గానిస్థాన్‌లోని కొంతమందితో సంప్రదింపులు జరిపినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఉగ్రవాద భావజాలాన్ని విద్యార్థుల్లో అణువణువునా నింపినట్లు నిఘా వర్గాలు పేర్కొన్నాయి. డాక్టర్ ముజమ్మిల్, ఉమర్‌లు ఈ మిషన్‌లో చురుగ్గా ఉన్నట్లు తెలుస్తోంది. మొత్తం మాడ్యూల్‌ను ఇర్ఫాన్ రూపొందించినట్లు నిఘా వర్గాలు తెలిపాయి. ఈ మాడ్యూల్ బయటపడిన నేపథ్యంలో భయాందోళనకు గురైన ఉమర్ దిల్లీ పేలుడుకు కారణమైనట్లు తెలుస్తోంది. ఉమర్‌కు ఇర్ఫాన్‌తో ప్రత్యక్ష సంబంధాలు ఉన్నట్లు వెల్లడైంది. ఇక, ఇటీవల అరెస్టయిన డాక్టర్ షాహిన్ ఈ మాడ్యూల్‌కు ఫైనాన్షియర్‌గా ఉన్నట్లు నిఘా వర్గాలు తెలిపాయి.

## భారత్‌కు అండగా ఉంటాం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఢిల్లీ కారు బాంబ్ బ్లాస్ట్ దేశాన్ని మరోసారి కలవరపెట్టిన సందర్భంగా ఇజ్రాయిల్ భారత్‌కు మద్దతు తెలిపింది. ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహూ ఈ ఘటనపై స్పందించారు. బాధిత కుటుంబాలకు తన సంతాపాన్ని తెలియజేశారు. ' మా ప్రియమైన మిత్రుడు నరేంద్రమోదీకి, భారతదేశంలో ధైర్యవంతులైన ప్రజలకు.. నేను, ఇజ్రాయిల్ ప్రజలు, బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాము. ఈ విషాద సమయంలో ఇజ్రాయిల్ మీతో బలంగా నిలుస్తుంది' అని ఎక్స్‌లో ట్వీట్ చేశారు. భారత్, ఇజ్రాయిల్ పురాతనమైన నాగరికతలు అయినప్పటికీ, అవి ఒకే రకమైన కఠిన పరీక్ష అయిన ఉగ్రవాదంతో బాధపడుతున్నాయి, రెండు దేశాలు ఉగ్రవాదానికి ఎప్పటికీ లొంగిపోవని నెతన్యాహూ అన్నారు. భారత్, ఇజ్రాయిల్ శాశ్వత సత్యాలపై నిలబడే పురాతన నాగరికతలు, దాడులు మన నగరాలను తాకవచ్చు కానీ, మన ఆత్మలను ఎప్పటికీ కదిలించలేవు, మన దేశాలు వెలుగులు మన శత్రువుల చీకటిని అధిగమిస్తాయి అని ఆయన అన్నారు. ఈ దాడిలో పాకిస్తాన్ ఉగ్ర సంస్థ జైషే మహ్మద్ ప్రమేయం ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. ఢిల్లీ మాత్రమే కాకుండా గురుగ్రామ్, ఫరీదాబాద్ వంటి ఢిల్లీ చుట్టుపక్కల ఉన్న ప్రాంతాల్లో కూడా దాడులు చేయాలని ఈ ఉగ్ర డాక్టర్లు ప్లాన్ చేశారు.

## అమెరికాలో భారతీయ విద్యార్థులకు మరిన్ని అవస్థలు

**వాషింగ్టన్(జనంసాక్షి):**అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన దగ్గరి నుంచి విదేశీ విద్యార్థుల రాకను కఠినతరం చేస్తున్నారు. సోషల్ వెట్టింగ్ అంటూ పలు విధానాలతో అమెరికా కలను గందరగోళంలో పడేస్తున్నారు. ఈ క్రమంలో యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెూమ్‌ల్యాండ్ సెక్యూరిటీ సరికొత్త ప్రతిపాదన చేసింది. ఆ నిబంధన వల్ల అంతర్జాతీయ విద్యార్థులకు ఉన్న ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ పై పరిమితులు విధించేలా లేక పూర్తిగా రద్దు చేసే అవకాశం ఉంది. ఆ రూల్ ఫెడరల్ రెగ్యులేటరీ అజెండాలో లిస్ట్ అయింది. 2025 చివర్లో లేక 2026 ప్రారంభంలో దానిని అమలు చేయొచ్చని తెలుస్తోంది.బీటెక్‌తోపాటు తత్సమాన విద్యార్హతల అండర్ గ్రాడ్యుయేషన్ ఇక్కడ పూర్తి చేసి, ఎఫ్-1 వీసా పొందినవారు స్టెమ్ కోర్సుల్లో (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణితశాస్త్రం) ఎంఎస్ చదివేందుకు అమెరికా వెళ్తుంటారు. వీటిలో ఏదేనీ విభాగంలో పీజీ పూర్తి చేసిన తరువాత ఓపీటీకి దరఖాస్తు చేసుకోవాలి. ఓపీటీ వచ్చిన అనంతరం తొలి ఏడాది స్టెమ్‌కు సంబంధించిన సంస్థల్లోనే ఉద్యోగం చేయాల్సివచ్చింది. అనంతరం రెండేళ్లపాటు (స్టెమ్‌కు సంబంధించిన సంస్థల్లోనే) అక్కడ పనిచేసే అవకాశం లభిస్తోంది. ఈ సమయంలోనే పలువురు ఉద్యోగావకాశాలు మెరుగుపర్చుకొని హెచ్-1 వీసా సైతం పొందుతున్నారు. ఓపీటీని భారత్‌తో సహా ఇతర దేశాల విద్యార్థులు దుర్వినియోగం చేస్తున్నారని అమెరికాలోని పలు సంస్థలు అభ్యంతరం తెలపటంతో సమస్య మొదలైంది. ఉద్యోగుల అవసరాన్ని అంగీకరించిన ట్రంప్ ఆ నేపథ్యంలో ఓపీటీ ప్రోగ్రామ్‌ను రద్దు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు గతంలో వార్తలు వచ్చాయి. ఒకవేళ.. ఓపీటీ రద్దు విధానం అమలైతే ఆ ప్రభావం విద్యార్థులపై తీవ్రంగా ఉంటుంది. మన విద్యార్థులు ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లే అవకాశం తగ్గిపోతుంది. విద్యార్థులతోపాటు అక్కడ యూనివర్సిటీలు నష్టపోయే ప్రమాదం ఉంది.ఇదిలాఉంటే.. ట్రంప్ యంత్రాంగం ఇలాంటి ప్రతిపాదనలు చేస్తుంటే.. ఇటీవల ఆయన మాటలు మాత్రం మరోలా ఉన్నాయి. విదేశీ విద్యార్థులు అమెరికాలో చదువుకునేందుకు ఎలాంటి అడ్డంకులు లేవని అన్నారు. వారు రావడం అమెరికాలోని వ్యాపారాలకు మంచిదేనని వ్యాఖ్యానించారు. దీనివల్ల దేశ ఉన్నత విద్యావ్యవస్థకు మద్దతుగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తంచేయడం గమనార్హం.

## నటుడు నాగార్జునపై నా వ్యాఖ్యలు వెనక్కి తీసుకుంటున్నా

**హైదరాబాద్(జనంసాక్షి):**ప్రముఖ నటుడు నాగార్జున కుటుంబంపై తాను గతంలో చేసిన వ్యాఖ్యలను మంత్రి కొండా సురేఖ వెనక్కి తీసుకున్నారు. తాను చేసిన వ్యాఖ్యలపై చింతిస్తున్నానన్నారు.ఈ మేరకు ఆమె ఓ పోస్టు పెట్టారు. నాగార్జున, ఆయన కుటుంబాన్ని బాధ పెట్టాలనే ఉద్దేశంతో నేను ఆ వ్యాఖ్యలు చేయలేదు. వారిని ఇబ్బందిపెట్టాలని కాని, వారి పరువు-ప్రతిష్టలకు భంగం కలిగించాలన్నది కాని నా ఉద్దేశం కాదు. నాగార్జున కుటుంబంపై నేను చేసిన వ్యాఖ్యల్లో ఏదైనా పొరపాటు ఉంటే అందుకు చింతిస్తున్నా. నా వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నా అని పేర్కొన్నారు.

# పేదల కడుపు నింపేందుకే సన్న బియ్యం పంపిణీ

**అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి నూతన రేషన్ కార్డులు: మంత్రి ఉత్తమ్**

**సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):**



ప్రజా ప్రభుత్వం ప్రజల మేలు కోరి పేద వారు కడుపు నిండా తినేలా సన్న బియ్యం పంపిణీ,అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి నూతనరేషన్ కార్డులు మంజూరు చేస్తున్నామని, 200 యూనిట్ల ఉచిత కరెంట్ అందజేస్తున్నామని, త్వరలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర నీటిపారుదల,పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.గరిడేపల్లి మండలంలో పలు రోడ్ల నిర్మాణాలకు మంత్రి బుధవారం శంకుస్థాపన చేశారు.గడ్డిపల్లి గ్రామంలో గడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాల వరకు రూ.8.28 కోట్లతో బీటీ డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు, పొనుగోడు గ్రామంలో పొనుగోడు పాత బస్టాండ్ నుండి మెయిన్ రోడ్ వరకు 50 లక్షల రూపాయలతో నిర్మించే 700 మీటర్ల రోడ్డుకు, పొనుగోడు గ్రామం నుండి అప్పన్నపేట వరకు 3.15 కోట్ల రూపాయలతో 4.5 కిమీల బీటీ రోడ్డు నిర్మాణానికి,మల్లయ్యగూడెం గ్రామంలో మల్లయ్య గూడెం నుండి పాత నేరేడుచర్ల వరకు 70 లక్షలతో నిర్మించే బిటి రోడ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.గరిడేపల్లి మండల కేంద్రంలో గరిడేపల్లి నుండి అలింగాపురం వరకు 30 కోట్ల రూపాయలతో నిర్మించిన డబుల్ బీటీ రోడ్ ను ప్రారంభించారు .అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ ఈ రోడ్డు నిర్మాణంలో కిలోమీటర్ కు 2 కోట్ల రూపాయల చొప్పున మొత్తం 30 కోట్లతో నాణ్యతతో నిర్మించామని తెలిపారు. రైతులు ట్రాక్టర్స్, కేజీ వీల్స్ తో రోడ్డు పై వెళ్లకుండా ప్రతి ఒక్కరు భాద్యత తీసుకోవాలని కోరారు.గరిడేపల్లి మండలంలో 200 కోట్లతో గడ్డిపల్లిలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్, కోదాడ జడ్చర్ల జాతీయ రహదారిని,పలు రోడ్లు నిర్మించి గరిడేపల్లి మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.హుజూర్ నగర్ లో 7.5 కోట్లతో జూనియర్ కాలేజీ, 4.5 కోట్లతో డిగ్రీ కాలేజీ నిర్మిస్తున్నామని,హుజూర్ నగర్ లో 100 పడకల హాస్పిటల్ లో డయాలసిస్ సెంటర్, సిటి స్కాన్ ఏర్పాటు చేశామని అన్నారు.నియోజకవర్గ వ్యాప్తంగా విద్య, వైద్యం, తాగు,సాగు, రోడ్లు ఇలా అన్ని రంగాలలో అభివృద్ధి చేసి హుజూర్ నగర్ నియోజకవర్గంను రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిపేందుకు నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు.అంతకు ముందు పొనుగోడు చెరువులో ఉచిత చేపల పంపిణి పథకాన్ని ప్రారంభించి చేప పిల్లలను చెరువులో విడుదల చేశారు.కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ కె.నరసింహ, ఆర్డీఓ శ్రీనివాసులు,ఆర్ అండ్ బి ఈఈ సీతారామయ్య, పీఆర్ ఈఈ వెంకటయ్య, డిఈ రమేష్, మత్స్యశాఖ అధికారి నాగులు నాయక్,తహసీల్దార్ కవిత,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం పునరుద్ధరిస్తాం

ఆర్థికపరమైన అవకతవకలు, ప్రణాళికాలోపాలను జ్యుడీషియల్ కమిషన్ పేర్కొందని తెలిపారు. అవకతవకలు, నిర్లక్ష్యం వహించినందుకు కొందరు అధికారులు, ఏజెన్సీలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ సిఫారసు చేసిందని మంత్రి పేర్కొన్నారు. రాజకీయ పరంగా, ఇంజనీర్ల స్థాయిలోనూ లోపాలు ఉన్నాయన్న మంత్రి.. ఆనకట్టలను సాంకేతిక విధానంలో సరిచేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. సీడీఓ లోపాలను కూడా విచారణ సంస్థలు ఎత్తిచూపినందున నైపుణ్యం కలిగిన సాంకేతిక సంస్థలు, కన్సల్టెంట్ల సేవలు వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కన్సల్టెన్సీ సేవల కోసం పలు సంస్థలు ముందుకొచ్చాయని, 3 తుదిదశకు అర్హత సాధించాయన్న మంత్రి.. ఐఐటీ లాంటి సంస్థలతో కలిసి పనిచేసే వాటికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ సీడబ్ల్యూపీఆర్ఎస్ అవసరమైన పరీక్షలు చేస్తోందని, వరద ఉద్ధృతి తగ్గిన వెంటనే మరో 15, 20 రోజుల్లో జియోఫిజికల్, హైడ్రాలిక్ పరీక్షలు ప్రారంభమవుతాయని తెలిపారు.

## అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలి

మేడారం హరిత కాకతీయ హెూటల్ లో మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ లతో కలసి సంబంధిత శాఖల ఉన్నత స్థాయి అధికారులు, గుత్తేదార్లతో మేడారం జాతర అభివృద్ధి పనుల పురోగతి, మాస్టర్ ప్లాన్ రూపకల్పన పై కూలంకషంగా సమీక్షించి సమర్ధవంతంగా నిర్వహించుటకు దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మేడారంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణం గా మేడారంలో జరుగుతున్న అభివృద్ధి పనులను జాతరకు పక్షం రోజుల ముందుగానే అన్ని పనులను పూర్తి చేస్తామని, గిరిజన పూజార్ల సూచన మేరకే పునరుద్ధరణ పనులు చేపడుతున్నామని అన్నారు.ముందస్తు మొక్కులు చెల్లించుకునే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పనులను పూర్తి చేస్తామని అన్నారు. వచ్చే రెండు వందల సంవత్సరాల కాలం పాటు శాశ్వతంగా నిలిచిపోయే విధంగా అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందని, 25 రోజుల క్రితం పనులు ప్రారంభం కాగా ఆయా పనులు వేగవంతంగా జరుగుతున్నాయని స్పష్టం చేశారు.ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకుని అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందని, భవిష్యత్ లో 10 కోట్ల మంది భక్తులకు సరిపోయే విధంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని, గతంలో జరగని అభివృద్ధి కార్యక్రమాలను నేటి ప్రజా ప్రభుత్వం చేస్తున్నదని వివరించారు. మంత్రి లక్ష్మణ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమ్మ వాళ్ళ ను దర్శించుకుని అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని అన్నారు. చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ, గ్రామీణ అభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ దేవుళ్ళ ప్రాంతాలలో గిరిజనుల సాంప్రదాయ పద్ధతి ప్రకారమే గద్దెల పునరుద్ధరణ పనులు కొనసాగు తున్నాయని అన్నారు. ఎంపీ పోరిక బలరాం నాయక్ మాట్లాడుతూ, అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి అనుకున్న సమయంలోగా పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు.అనంతరం సాయంత్రం 3 గంటల 40 నిమిషాలకు మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, చీఫ్ మినిస్టర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ కేఎస్ శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్ హారీష్ హెలికాప్టర్ ద్వారా హైదరాబాద్ కు బయలుదేరారు.

## యువత కొత్త ఆలోచనలతో రావాలి

ప్రోత్సహించేందుకు కొత్త విధానం తెచ్చినట్లు వివరించారు. వీటి ద్వారా స్వయం శక్తులుగా ఎదగాలన్నారు. అంకుర పరిశ్రమలు రూ.వంద కోట్ల టర్నోవర్‌కు చేరుకోవాలి. స్టార్టప్‌లకు సాయం చేసేందుకు మా ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఇవాళ ప్రపంచమంతా మనవైపు చూస్తోంది. వినూత్న ఆలోచనలతో ముందుకొచ్చే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది. ఇతర దేశాల్లోని అవకాశాల కోసం చూడవద్దు. ఇతర దేశాలు మనపై ఆధారపడే స్థితిక మనం ఎదగాలని శ్రీధర్‌బాబు అన్నారు.

## కాళేశ్వరంపై విచారణ జనవరికి వాయిదా

**హైదరాబాద్(జనంసాక్షి):** కాళేశ్వరం కమిషన్‌పై విచారణను హైకోర్టు జనవరి రెండో వారానికి వాయిదా వేసింది. ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయడానికి 4 వారాల గడువు ఇచ్చింది. ప్రభుత్వ కౌంటర్‌కు సమాధానం ఇచ్చేందుకు పిటిషనర్లకు మరో 3 వారాలు గడువు ఇచ్చింది. కేసీఆర్‌తోపాటు హరీశ్‌రావు, స్మితా సబర్వాల్, ఎస్కే జోషికి 3 వారాల గడువు ఇచ్చిన ఉన్నత న్యాయస్థానం.. అప్పటివరకు మధ్యంతర ఉత్తర్వులు పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది.

# అమర జ్యోతి కేంద్రాన్ని త్వరలో ప్రారంభించాలి

- సీఎం రేవంత్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేస్తా
- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి
- అమర వీరుల స్మారక అమర జ్యోతి కేంద్రాన్ని సందర్శించిన చిన్నారెడ్డి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** హైదరాబాద్ లో రాష్ట్ర సచివాలయం ఎదురుగా నిర్మించిన అమరవీరుల స్మారక అమర జ్యోతి కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాల్సిన ఆవశ్యకత ఉందని, రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డిని త్వరలో కలిసి విజ్ఞప్తి చేస్తానని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి అన్నారు. బుధవారం అమర వీరుల స్మారక అమర జ్యోతి కేంద్రాన్ని చిన్నారెడ్డి సందర్శించారు. తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం అమరులైన 1969 తొలి దశ, 2000 -14 మలి దశ ఉద్యమకారుల స్మారకం కోసం నిర్మించిన అమర జ్యోతి కేంద్రం ప్రారంభానికి సిద్ధంగా ఉందని చిన్నారెడ్డి తెలిపారు. అమర జ్యోతి కేంద్రాన్ని ప్రజల సందర్శనం కోసం వెంటనే ప్రారంభించాల్సిన ఆవశ్యకత ఉందని చిన్నారెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ ప్రాంగణంలో భారీ సమావేశ మందిరం, క్యాంటీన్, విశాలమైన ప్రదేశం, ఎస్కాలేటర్స్ ఉండటాన్ని చిన్నారెడ్డి గమనించారు. అమర వీరుల స్మారక కేంద్రం నిర్మాణానికి ప్రణాళిక రూపొందించిన ప్రముఖ శిల్పి ఎం. వీ. రమణా రెడ్డి అమర జ్యోతి ప్రాంగణాన్ని దగ్గర ఉండి చిన్నారెడ్డికి వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ భాషా సాంస్కృతిక మండలి ఫౌండర్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ గంటా జలంధర్ రెడ్డి కూడా పాల్గొన్నారు.

# సోమశిల బ్యాక్ వాటర్‌లో లక్ష చేపపిల్లల విడుదల



**కొల్లాపూర్, నవంబర్12 (జనంసాక్షి) :** మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం జిల్లాలోని కేంద్ర మత్స్యశాఖ సంయుక్త కార్యదర్శి నీతూ కుమారి ప్రసాద్, తెలంగాణ మత్స్య శాఖ కమిషనర్ నిఖిల, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తో కలిసి సోమశిల వద్ద శ్రీశైలం బ్యాక్ వాటర్ కృష్ణ నదిలో లక్ష చేప పిల్లలను వదిలారు. సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని వంద శాతం సబ్సిడీతో అమలు చేస్తోందని వెల్లడించారు. జిల్లాలో 2.50 కోట్ల చేప పిల్లల పంపిణీకి ఏర్పాట్లు చేశామని అన్నారు. మత్స్యకారులు అలవి వలలను ఉపయోగించరాదని మంత్రి హెచ్చరించారు. నాణ్యమైన చేప పిల్లలనే మత్స్యశాఖ అధికారులు పంపిణీ చేయాలని అధికారులకు సూచించారు. సోమశిల గ్రామంలో పర్యటించిన మంత్రి సోమశిల -శ్రీశైలం క్రూయిజ్ లాంచీని సందర్శించారు. శ్రీశైలం వెళ్లే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని, రెగ్యులర్‌గా శ్రీశైలంకు లాంచి నడిపేలా చర్యలు తీసుకోవాలని నాగర్ కర్నూలు జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహకు ఆదేశించారు.



ఈత, తాటి చెట్ల నుంచి వచ్చే కల్లు ఆరోగ్యానికి మేలు చేస్తాయని అనుమతులిస్తున్నా.. అమ్మకందారులు మాత్రం ఆ చెట్ల జాడ లేకుండానే కల్లును సృష్టిస్తున్నారు. వాటిని ప్రజలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మహబూబ్‌నగర్ అర్బన్, రూరల్ ప్రాంతాల్లో విచ్చలవిడిగా విక్రయాలు జరుపుతున్నప్పటికీ అబ్కారీ శాఖ మాత్రం మొద్దునిద్ర పోతున్నట్టు తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కల్తీ కల్లు తయారీదారులతో కుమ్మక్కై లక్షల రూపాయలు వసూలు చేస్తున్నట్టు ఆరోపణలొస్తున్నాయి. మద్యం రేట్ల మాదిరిగా ఇప్పుడు కల్తీ కల్లుకు కూడా ధరలు పెంచేసి, ఈ అక్రమ ఆదాయాన్ని ఆబ్కారీ శాఖ అధికారులకే పంచిపెడుతున్న పరిస్థితి..!

మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబర్ 12 (జనంసాక్షి) :

# ఆబ్కారీ అధికారుల చేతివాటం!

- కల్తీ కల్లుకు సైతం రేట్లు పెంచేసిన దుకాణాదారులు
- అధికారుల తీరుతో దుమ్మెత్తిపోస్తున్న స్థానికులు
- 'పెద్ద సార్లకు' ఇవ్వాలంటూ ఓ ఆఫీసర్ అమ్యామ్యాలు
- కురుమూర్తి ఉత్సవాల్లో వసూళ్లపై చర్యలేవీ..?

ఎన్నో రోజుల నుంచి కల్తీ కల్లు తయారీదారుల వద్ద నెలనెలా కొందరు అధికారులు వసూళ్లు చేస్తున్నట్టు బాహటంగానే వినబడుతోంది. ఇప్పుడు చెట్ల దగ్గర అమ్మకాలు చేస్తున్న వారినీ వదిలిపెట్టడం లేదు. పైస్థాయిలో ఇవ్వాలి.. సార్ వాళ్లు సీరియస్‌గా ఉన్నారు.. 50 వేల రూపాయలు ఇవ్వాల్సిందేనంటూ మహబూబ్‌నగర్ రూరల్ పరిధిలోని ఓ అధికారి దబాయిస్తున్నట్టు సమాచారం. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి సమీపంలోని దేవరకద్ర రోడ్‌లో కొందరు కల్లు గీత కార్మికులు కల్లు గీసి రోడ్డుపై వెళ్లేవారికి అమ్ముతున్నారు. అటుగా వెళ్తున్న అబ్కారీ అధికారి వెంటనే వారిని జిల్లా కేంద్రానికి పిలిపించుకుని 'రేటు' కుదుర్చుకున్నట్టు తెలిసింది. ఉన్నతాధికారుల పేరు చెప్పి అమాయకులను భయభ్రాంతులకు గురిచేసి వేల రూపాయలు వసూళ్లు చేస్తున్నాడని బాధితులు వాపోతున్నారు.

### శాఖలో తప్పు చేసినా చర్యలుండవా..?

కురుమూర్తి జాతరలో బెల్ట్ షాపుల వద్ద పెద్దమొత్తంలో వసూళ్లకు తెరతీసిన మహబూబ్‌నగర్ రూరల్ అధికారిపై ఉన్నతాధికారులు ఏమాత్రం చర్యలకు ఉపక్రమించకపోవడం అనుమానాలకు దారితీస్తోంది. అవినీతి వ్యవహారాల్లో ఆరితేరిన సదరు మహబూబ్‌నగర్ రూరల్ అబ్కారీ అధికారి కల్లు దుకాణాల వద్ద సైతం చేతివాటం ప్రదర్శిస్తున్నాడు. ఇవ్వనివారికి కల్తీ కల్లు కేసులుంటాయని హెచ్చరిస్తూ మరీ దండుకుంటున్నట్టు తెలిసింది. ఈ స్థాయిలో చెలరేగిపోతున్న సదరు అవినీతి అధికారిపై పలువురు గౌడ కులస్తులు కూడా ఏసీబీని ఆశ్రయించినట్టు విశ్వసనీయ సమాచారం..!

# స్కూలు బస్సులో మంటలు.. తప్పిన ముప్పు

**మెదక్, నవంబర్12 (జనంసాక్షి) :** మెదక్ జిల్లా నార్సింగి మండల కేంద్రంలో ప్రైవేటు పాఠశాల బస్సులో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దీంతో స్కూల్ బస్సు డ్రైవర్, స్థానికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. రామాయంపేటకు చెందిన అక్షర టెక్నో స్కూల్ బస్సు.. రోజు మాదిరిగానే విద్యార్థులను వారి వారి గమ్యస్థానాలకు చేర్చింది. అనంతరం స్థానికంగా ఉన్న వేణుగోపాల స్వామి ఆలయం వద్ద బస్సును పార్కింగ్ చేశాడు డ్రైవర్. కాసేపటికే షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్ ఫైర్ సిబ్బందికి సమాచారం అందించాడు. ఘటనాస్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసింది. అగ్నికీలలు ఎగిసిపడ్డ సమయంలో బస్సులో విద్యార్థులెవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

# ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

- ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వరంగల్ పార్లమెంట్ సభ్యులు డా కడియం కావ్య తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాలలో వైద్య విద్యార్థులకు నిర్వహించిన వైట్ కోట్ సెర్మనీలో శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ తాను కూడా వైద్య విద్యనభ్యసించి 8 సంవత్సరాలు పాటు గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. వివిధ వ్యాధులతో బాధపడుతూ వైద్య సేవలకు మీ దగ్గరకు వచ్చే ప్రజలకు ప్రేమతో వైద్య సేవలు అందించాలని తెలిపారు. భవిష్యత్తులో మంచి వైద్యులుగా నిలబడాలంటే ఎన్నో ఆటుపోట్లను, సవాళ్ళను ఎదుర్కొవాల్సి వస్తుందని ధైర్యంగా ఎదుర్కొని మంచి వైద్యులుగా స్థిర పడాలని సూచించారు. ఈ ప్రాంతానికి వైద్య కళాశాల మణిహారమని మీరు చదువుకున్న కళాశాలకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని తెలిపారు. సిన్సియర్ గా పని చేసి ప్రజలకు వ్యాధి తగ్గించి మంచి పేరున్న వైద్యులని పేరు సాధించాలని స్పష్టం చేశారు. భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ వైద్య వృత్తిలో మంచి అనుభవాన్ని పొంది ప్రత్యేక వైద్యులుగా నిలవాలని తెలిపారు. భూపాలపల్లిలో చదివామన్న మంచిపేరు కళాశాలకు, ఈ ప్రాంతానికి తీసుకురావాలని సూచించారు. సింగరేణి, కేటీపీపీ సిఎస్ఆర్ నిధులు ఈ ప్రాంత విద్య, వైద్య రంగాలకు కేటాయించాలని తెలిపారు. ఖనిజ సంపద ఇక్కడి నుండే వస్తుంది కాబట్టి విద్యా, వైద్య రంగాలతో పాటు ఈ ప్రాంత అభివృద్ధికి నిధులు కేటాయించాలని తెలిపారు. 300 మంది విద్యార్థులు ఇక్కడ వైద్య విద్యను అభ్యసించడం పట్ల ఆయన అభినందించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ప్రతి వైద్య విద్యార్థికి వైట్ కోర్టు రావడం అనేది ఒక మదురమైన అనుభూతి అన్నారు. బాగా చదివి మంచి వైద్యులుగా తయారై పేదలకు మెరుగైన నాణ్యమైన వైద్యసేవలు అందించాలని సూచించారు. వైద్య కళాశాలల్లో మంచి ఫ్యాకల్టీ ఉందని వైద్య విద్యార్థులు మంచిగా చదివి మానవత్వంతో ప్రజలకు మేలైన మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఈ ప్రాంతం చాలా వెనుకబడున ప్రాంతమనని ఈ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా వెంకటేశ్వరావు, సింగరేణి జిఎం రాజేశ్వర్ రెడ్డి, కేటీపిపీ సీఈ శ్రీ ప్రకాష్, వైద్య కళాశాల వివిధ విభాగాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# డీజీపీపై కేటీఆర్ వ్యాఖ్యలు గర్హనీయం

**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ డీజీపీపై ఎమ్మెల్యే కేటీఆర్ చేసిన అనుచిత, అసభ్య వ్యాఖ్యలను రాష్ట్ర పోలీస్ అధికారుల సంఘం తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై. గోపిరెడ్డి తెలిపారు. కేటిఆర్ ఒక వార్తా ఛానల్ కు ఇంటర్వ్యూ ఇస్తూ ... డిజిపిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు అసభ్యంగా, అనుచితంగా, అనాగరికంగా ఉన్నాయని, డిజిపి నాయకత్వంలో ఎన్నడూ లేనంత అప్రమత్తతతో తెలంగాణ పోలీసు పని చేస్తున్న విషయం ప్రజలకు తెలుసునని, తాము చట్టానికి, ప్రజలకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. పోలీసు శాఖ నిష్పక్షపాతంగా పని చేస్తుందని, శాంతి భద్రతలు కాపాడడానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని, వారు ప్రస్తావించిన అన్ని సంఘటనల్లో పోలీసులు చట్ట ప్రకారం కేసులు రిజిస్టర్ చేశారని తెలిపారు. దోపిడీ, హత్యల కేసుల్లో అత్యంత వేగంగా నిందితులను పట్టుకున్నామని, పోలీసుల పనితీరులో ఆక్షేపించవలసింది ఏమీ లేదు. ఒకవేళ ప్రశ్నించవలసివచ్చినా సంస్కారయుతంగా, సభ్యతతో ప్రశ్నించాలని గుర్తు చేస్తున్నామని, రాజకీయ ప్రేరేపిత సంఘటనలను దృష్టిలో పెట్టుకుని అభ్యంతరకర భాషలో రాష్ట్ర డిజిపిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని, పత్రికా ముఖంగా క్షమాపణ చెప్పాలని కేటి రామారావును డిమాండ్ చేశారు.

# బీఆర్ఎస్, కాంగ్రెస్ దొందూదొందే..

- ఇరు పార్టీల పాలనలో నల్లగొండకు అన్యాయం
- కృష్ణాజలాలు అందించడంలో రెండు ప్రభుత్వాలు విఫలం
- ఆస్పత్రిలో కనీస వసతులు కల్పించలేక పోయారు
- జాగృతిజనం బాటలో కవిత ఘాటు విమర్శలు



**నల్లగొండ, నవంబర్12 (జనంసాక్షి) :** తెలంగాణ వచ్చాక కూడా నల్లగొండ జిల్లాకు కృష్ణా జలాలు అందలేదని నల్లగొండ జిల్లా కేంద్రంలో కల్వకుంట్ల కవిత మీడియాతో మాట్లాడుతూ అన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు నల్లగొండ జిల్లాకు సాగునీరు అందించడంలో విఫలం అయ్యాయి. ప్రభుత్వాలను అడిగేందుకు, నిలదీసేందుకే జాగృతి జనం బాట చేపట్టామని అన్నారు. జాగృతి జనం బాట'లో భాగంగా నల్లగొండ జిల్లాలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా నల్గొండ జిల్లా కేంద్రంలో తన ఫ్లెక్సీలను తొలగించడంపై స్పందించారు. ఫ్లెక్సీలు తొలగించడానికి కవిత తప్పు పట్టారు. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పెద్ద మంత్రి అనుకున్నా అని విమర్శించారు. ప్రజా సమస్యలు ప్రస్తావిస్తే.. ఫ్లెక్సీలు తొలగిస్తారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను తాను ప్రస్తావిస్తున్నా అని, చేతనైతే ప్రభుత్వం సమస్యలను త్వరగా పరిష్కరించాలన్నారు. నల్లగొండకు కల్వకుంట్ల కవిత రానున్న నేపథ్యంలో ఆమె అభిమానులు కటౌట్‌లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన కటౌట్‌లు, ఫ్లెక్సీలను మున్సిపల్ సిబ్బంది తొలగించింది. ? 'సుంకిశాల లిఫ్ట్ ఇరిగేషన్ కాంట్రాక్టర్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఎస్ఎల్‌బీసీ ఘటనపై విచారణ జరగాలి. నాగార్జున సాగర్ ఎడమ కాలువను రాష్ట్ర ప్రభుత్వం తమ అధీనంలోకి తీసుకోవాలి. కృష్ణా జలాలను నల్లగొండకు తీసుకురాకపోతే.. భూ నిర్వసితులతో ముఖ్యమంత్రి ఇల్లు ముట్టడిస్తాం' అని అన్నారు. 'బీఆర్ఎస్‌ను తిట్టి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. అయినా కూడా కాంగ్రెస్ అదే నిర్లక్ష్యం చేస్తుంది. సీఎం ఆదేశాలను కలెక్టర్‌లు పట్టించుకోవడం లేదు.

# బోథ్‌లో ప్రోటోకాల్ రగడ

- కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య తోపులాట
- రంగంలోకి దిగిన పోలీసులు



**బోథ్, నవంబర్ 12(జనంసాక్షి) :** బోథ్ నియోజకవర్గ కేంద్రంలోని కాంగ్రెస్ బిఆర్ఎస్ నాయకుల మధ్య తోపులాట జరిగింది. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో బోథ్,సొనల మండలాలకు చెందిన కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పక్కన ప్రోటోకాల్ ఉల్లంఘించి స్టేజ్ పై కూర్చోవడంతో కాంగ్రెస్ నేతలు అడ్డు తగిలి చెక్కులు ఎలా పంపిణీ చేస్తారని నిలదీశారు. దీంతో పరస్పరం ఇరు పార్టీల మధ్య మాటల యుద్ధం పెరిగి చేయి చేసుకోవడం తీవ్ర ఆందోళన దారితీసింది. అనంతరం వేదికపై నుంచి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రసంగిస్తుండగా కాంగ్రెస్ నేతలు అధికార ప్రతినిధి పసుల చంటి,మార్కెట్ చైర్మన్ గంగారెడ్డి, ఆత్మ చైర్మన్ రాజు యాదవ్ ఎమ్మెల్యే ప్రసంగానికి అడ్డుపడ్డారు. వెంటనే ఇరు వర్గాల నాయకుల మధ్య మాటల యుద్ధం పెరిగి తోపులాట జరిగి దాడికి దిగారు. అనంతరం కాంగ్రెస్ నాయకులను బిఆర్ఎస్ నేతలు కార్యక్రమం నుండి బయటకు తీసుకొచ్చారు. అనంతరం బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్ ఘటన స్థలానికి చేరుకొని కాంగ్రెస్ నాయకులతో కలిసి గంటపాటు రోడ్డుపై బైఠాయించడంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. అనంతరం ఆదిలాబాద్ డిఎస్పి జీవన్ రెడ్డి ఘటన స్థలానికి చేరుకొని కాంగ్రెస్ నాయకులను అదుపులోకి తీసుకొని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ను బిఆర్ఎస్ నాయకులను అక్కడి నుండి పంపించారు. అనంతరం ఇరు పార్టీల నాయకులు ఒకరి పై ఒకరు స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసుకున్నారు.

# మున్నాను కోర్టులో హాజరుపరచాలి

- గాయపడిన మావోయిస్టులకు మెరుగైన చికిత్స అందించాలి
- తెలంగాణ పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, నారాయణరావు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** పోలీసుల అదుపులో ఉన్న మున్నాను కోర్టులో హాజరుపరచాలని, గాయపడిన మావోయిస్టులకు మెరుగైన చికిత్స అందించాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, నారాయణరావు డిమాండ్ చేశారు. చత్తీస్‌గడ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా మద్దేడ్ తార్లగూడ అటవీ ప్రాంతంలో బుధవారం ఉదయం పోలీసులు 10 మంది మావోయిస్టులను పట్టుకున్నట్టు తెలిసిందని, వారినికోర్టులో హాజరు పర్చాలని గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని డిమాండ్ చేశారు. పట్టు బడిన వారిని ఎన్‌కౌంటర్ చేసే ప్రమాదం ఉందని, అది కాక ఇప్పటికే ఇరవైరెండు నెలలుగా కొనసాగిస్తున్న ఆపరేషన్ కగార్‌లో 80 ఎన్‌కౌంటర్‌లలో 700 వరకు హత్యలు జరిగాయని, మధ్య భారతంలో ప్రాథమిక హక్కు ఐన జీవించే హక్కు పూర్తిగా ప్రమాదంలో పడిందని, కాబట్టి వారి ప్రాణాలకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# దొంగతనం చేస్తూ పట్టుబడ్డ బిటెక్ విద్యార్థి

- జల్సాలకు అలవాటు పడి దొంగగా అవతారం

**సూర్యాపేట, నవంబర్12 (జనంసాక్షి) :** ఏపీకి చెందిన ఓ యువకుడు ఈజీ మనీ కోసం తెలంగాణలో చోరీలు చేస్తూ పట్టుబడ్డాడు. అయితే నిందితుడు పోటీ పరీక్షలు రాసినా.. ఉద్యోగం రాకపోవడంతో.. జల్సాలకు అలవాటు పడి చోరీలు చేస్తున్నాడు. సూర్యాపేట జిల్లాలోని వేపల సింగారంలో చోరీ చేసి పారిపోతుండగా.. పోలీసులు పట్టుకున్నారు. ప్రస్తుతం నిందితుడిని పీఎస్ కు తరలించారు. ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం భీమవరం గ్రామానికి చెందిన పెనుగొండ మల్లికార్జున్ రెడ్డి బీటెక్ పూర్తి చేశాడు. కాంపిటేటివ్ ఎగ్జామ్స్ కు ప్రిపేర్ అయినప్పటికి ఉద్యోగం రాలేదు. దీంతో జల్సాలు, ఈజీ మనీ కోసం చోరీలు చేస్తున్నాడు. అయితే దొంగతనం చేసిన సొమ్ముతో బెట్టింగ్ ఆడి.. డబ్బులు పోగొట్టుకునే వాడు. ఈ క్రమంలో సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం వేపలసింగారంలో దొంగతనానికి పాల్పడ్డాడు. గ్రామంలోని ముడెం గోపిరెడ్డి ఇంటికి తాళం వేసి వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన మల్లికార్జున్ రెడ్డి తాళం పగలగొట్టి బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలు, రూ. 90 వేల నగదు దొంగిలించాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న హుజూర్‌నగర్ పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించి దర్యాప్తు ప్రారంభించారు. చోరీ చేసిన సొమ్మును అమ్మేందుకు వెళుతుండగా.. అక్కడే వాహనాలు తనిఖీలు చేస్తున్న పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించాడు. దీంతో మల్లికార్జున్ రెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించారు.




# లంచం తీసుకుంటూ పట్టుబడ్డ పోలీసులు

**గజ్వేల్, నవంబర్12 (జనంసాక్షి) :** అక్కా, చెల్లెళ్ల మధ్య ఆస్తి తగాదాల విషయంలో బాధితురాలి నుంచి లంచం తీసుకున్న ఎస్సై, కానిస్టేబుల్‌ను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సిద్దిపేట కమిషనరేట్ పరిధిలోని ములుగు పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న సీహెచ్ విజయ్‌కుమార్, అతడి డ్రైవర్, కానిస్టేబుల్ రాజు మంగళవారం రాత్రి రూ. 50 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇంటి నుంచి అక్కను ఖాళీ చేయించాలని చెల్లెలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు లంచం డిమాండ్ చేసి పట్టుబడ్డారు. ఇద్దరిని హైదరాబాద్‌లోని ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టి, దర్యాప్తు చేస్తున్నామని వివరించారు. ప్రభుత్వంలోని ఉద్యోగి ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే 1064 టోల్ ఫ్రీ నంబర్‌కు గాని, వాట్సప్ నంబర్ 9440446106 అనే నంబర్ ద్వారాగా, తెలంగాణ ఏసీబీ ఫేస్‌బుక్, ట్విటర్ ద్వారా గాని ఫిర్యాదు చేయాలని సూచించారు.

# బాలల దినోత్సవం రోజు పరీక్షలా?

**కర్నూలు చిల్డ్రన్స్ క్లబ్ కన్వీనర్ ఎస్.ఉమాదేవి**

**కర్నూలు (జనంసాక్షి) :** బాలల దినోత్సవం రోజు పాఠశాలల్లో ఎస్ ఎ 1 పరీక్షలు నిర్వహించడం చాలా విచారకరమని కర్నూలు చిల్డ్రన్స్ క్లబ్ కన్వీనర్ ఎస్.ఉమాదేవి అన్నారు. ఇది బాలల హక్కుల పట్ల నిర్లక్ష్యాన్ని, వారిపై మానసిక ఒత్తిడిని ప్రతిబింబిస్తుందని, పిల్లలకు ఆట, ఆనందం, అభివ్యక్తి, మరియు సృజనాత్మకతకు అవకాశం కల్పించే ఈ రోజు పరీక్షల బరువుతో నలిగి పోవడం సరైంది కాదని తెలిపారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని పునరాలోచించి, బాలల దినోత్సవం నాడు పరీక్షను రద్దు చేసి, పాఠశాలల్లో సామూహిక కార్యక్రమాలు, పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేలా సూచనలు జారీ చేయాలని చేశారు.

# ఎల్ఎల్ఎం కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు

**హైదరాబాద్, నవంబర్12 (జనంసాక్షి) :** రాష్ట్రవ్యాప్తంగా ఎల్ఎల్ఎం కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లకు అధికారులు గైడ్‌లైన్స్ విడుదల చేశారు. కన్వీనర్ కోటాలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోని వారు సైతం స్పాట్ అడ్మిషన్లు పొందవచ్చని చెప్పారు. స్పాట్ అడ్మిషన్లు పూర్తిగా మెరిట్ ఆధారంగానే నిర్వహిస్తామని స్పష్టం చేశారు. కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్లకు సంబంధించిన నోటిఫికేషన్‌ను గురువారం విడుదల చేస్తామన్నారు. కాలేజ్ లింక్ ద్వారా స్పాట్ రిజిస్ట్రేషన్లను 17వ తేదీ వరకు చేసుకోవాలని సూచించారు. స్పాట్ అడ్మిషన్ల కేటాయింపును 18న విడుదల చేస్తామని, 19వ తేదీ మధ్యాహ్నం పన్నెండుగంటల్లోపు సంబంధిత కళాశాలల్లో సీట్లు పొందిన అభ్యర్థులు రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు.

# చదువుతోపాటు మానవతా విలువలు నేర్పించాలి




**(నవంబర్ 14న బాలల దినోత్సవం సందర్భంగా)**

**దేశపు భవిష్యత్తు పిల్లల చేతుల్లోనే ఉందని అందరికీ తెలిసిన విషయం. ప్రతి సంవత్సరం నవంబర్ 14న దేశం మొత్తం బాలల దినోత్సవాన్ని ఘనం గా జరుపుకుంటుంది. భారత తొలి ప్రధాన మంత్రి పండిట్ జవహర్లాల్ నెహ్రూ జన్మదినాన్ని ఈ రోజున బాలల దినోత్సవంగా జరుపుకోవడం ప్రత్యేకత.**

"చిన్నపిల్లలకు మానవతా విలువలను ఏ విధంగా బోధించాలి. ఇప్పటి వేగవంతమైన ప్రపంచంలో సాంకేతిక విజ్ఞానం, పోటీ, ఆత్మకేంద్రిత జీవన శైలి పెరుగుతున్న నేపథ్యంలో పిల్లల్లో మానవతా విలువలను పెంపొందించడం అత్యంత అవసరం. విద్య అంటే కేవలం పాఠ్యపుస్తకాల జ్ఞానం మాత్రమే కాదు ు మంచి మనిషిగా మారడం, ఇతరుల పట్ల దయ, గౌరవం, సహనం కలిగి ఉండడం కూడా అంతే ముఖ్యమైనవి.

నేటి ఆధునిక ప్రపంచంలో ధన సంపాదన, వస్తు సమృద్ధి వెంట పరుగులు పెడుతుంది. ఈ పరుగులో మానవతా విలువలు చేజారిపోతున్నాయి. నేడు సామాజికంగా, కుటుంబ పరంగా, వ్యక్తిగతంగా దిగజారుడుతనం ప్రజల్లో బాగా కనబడుతుంది. ఆత్మహత్యలు అత్యాచారాలు దోపిడీ దురాగతాలు రోజురోజుకి పెరుగుతున్నాయి వీటిని అరికట్టడంలో ప్రభుత్వాల బాధ్యత పరిమితమే, శాశ్వత పరిష్కారం అందించాలంటే అసలు పాత్ర తల్లిదండ్రులదే, రేపటి సమాజ బాధ్యత వారి చేతుల్లోనే ఉంది.

పిల్లలకు చదువుతోపాటు మానవతా విలువలను కూడా బోధించాలి. వారిలో ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం నైతిక విలువలు, మన సంస్కృతి పట్ల, మన ధర్మం పట్ల అభిమానం జాతీయతా భావాలను పెంపొందింపజేయాలి. ఇందుకు తల్లిదండ్రులు తమ ఇళ్ళనే విలువల పాఠశాలలుగా మలుచుకోవాలి. లేదంటే పిల్లలకు తల్లిదండ్రులకు ఉన్న సంబంధం రెక్కలు రాగానే తల్లిదండ్రులను విడిచి ఎగిరిపోయే పక్షి పిల్లలకు పక్షులకు ఉన్న సంబంధముల మిగిలిపోతుంది. కాబట్టి మన పురాణ ఇతిహాసాలు, చరిత్రలో పేర్కొన్న సాహస బాలలు, మహాపురుషులు, మహనీయుల అద్భుత గాధలను పిల్లలకు చెప్పాలి. తద్వారా వారు గొప్ప వ్యక్తులుగా ఆపై గొప్ప తల్లిదండ్రులుగా ఉన్నత వ్యక్తిత్వంతో బాధ్యతయుత పౌరులుగా రూపొందుతారు. అప్పుడు మనవైన విలువలతో వర్ధిల్లుతారు.

మానవతా విలువలను బోధించే మొదటి పాఠశాల ఇంటి నుంచే ప్రారంభమవుతుంది. తల్లిదండ్రుల ప్రవర్తన, మాట్లాడే తీరు, ఇతరులతో వ్యవహరించే విధానం పిల్లలపై గాఢమైన ప్రభావం చూపుతుంది. కాబట్టి పెద్దలు ముందుగా మంచి ప్రవర్తనతో ఆదర్శంగా నిలవాలి. పాఠశాలల్లో కూడా విలువల విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలి. చిన్న కథల ద్వారా, నీతికథల పఠనం, నాటికలు, సేవా కార్యక్రమాలు, సామూహిక ఆటలు వంటి పద్ధతుల ద్వారా పిల్లలలో సహకారం, స్నేహభావం, సహనశీలత వంటి గుణాలను అభివృద్ధి చేయవచ్చు.

మానవతా విలువలు పుస్తకాలలో నేర్చుకునేవి కావుబీ అవి అనుభవం, అనుసరణ, మరియు పరిసరాల ద్వారా పిల్లలలో బలపడతాయి. అందుకే సమాజం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి పిల్లలకు మనిషిగా ఎలా జీవించాలో చూపాలి. మానవతా విలువలను చిన్న వయసులో నేర్పితే, వారు పెద్దయ్యాక సమాజానికి శ్రేయస్సు చేకూర్చే పౌరులుగా మారుతారు. మనిషితనమే మహా విద్య అనే సత్యాన్ని పిల్లల మనసుల్లో నాటుదాం. కాబట్టి పిల్లలకు ఎల్లప్పుడూ మంచి విలువలను బోధించాలి వారిని ఎల్లప్పుడూ మంచి పనులకు ప్రోత్సహించాలి.

విద్య పిల్లలకు కొత్త ప్రపంచాన్ని పరిచయం చేస్తుంది. కానీ విద్యతోపాటు మానవతా, నైతికతా విలువలు కూడా అవసరం. పెద్దలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్య కొనసాగింపుతో పాటు క్షమ, సహనం, దయా, సహ జీవనం వంటి విలువలు నేర్పాలి. ఇవే వారి జీవితానికి పునాది అవుతాయి.

### విలువలతో పాటు విద్య ప్రాముఖ్యత:

విద్య పిల్లలకు కొత్త ప్రపంచాన్ని పరిచయం చేస్తుంది. కానీ విద్యతోపాటు మానవతా, నైతికతా విలువలు కూడా అవసరం. పెద్దలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్య కొనసాగింపుతో పాటు క్షమ, సహనం, దయా, సహ జీవనం వంటి విలువలు నేర్పాలి. ఇవే వారి జీవితానికి పునాది అవుతాయి.

### పిల్లల్లో మానవతా విలువల పెంపుడు ఎలా?

ఇంట్లో, స్కూల్లో పిల్లలకు మంచి ప్రవర్తన కోసం గొప్ప వ్యక్తుల కథలు, అనుభవాలను పంచాలని పెద్దలు గమనించాలి. సమాజంలో అందరినీ సమానంగా చూసే నైతిక దృక్పథాన్ని పెంపొందించాలి. ఎవరికైనా సహాయపడే, సహాయపడే మనసు ఉండేలా ప్రోత్సహించాలి. పర్యావరణం, ప్రజలు, జీవరాజుల ప్రాముఖ్యతను పిల్లలకు వివరంగా చెప్పాలి. ఇతరులకు గౌరవం, సహనం, సహాయంపై ఆసక్తి కలిగించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. నేటి బాలలే రేపటి సమాజపు పునాది. కేవలం పుస్తకాల చదువుతో ఖచ్చితంగా సరిపోదు. మానవతా విలువలు, జ్ఞానం కలిగిన వ్యక్తులుగా ఎదగేలా పిల్లలను అలువడించడమే ఈ బాలల దినోత్సవం సందేశం.



**డాక్టర్ కోమల్ల ఇంద్రసేనారెడ్డి**
లైబ్రేరియన్ కాకతీయ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ ,
వరంగల్. 9849375829

---

వాజపేయి నుండి మోదీ వరకు ఒకే కథ
ఇంటెలిజెన్స్ ఫెయిల్యూర్, సెక్యూరిటీ ల్యాప్స్‌లు పునరావృతం
ఎన్నికల రాజకీయ లాభాల కోసం రక్తం పారుతోంది
భద్రతా వైఫల్యాలకు బాధ్యత వహించాలి

భారత్ రక్తసిక్తమైంది. బీజేపీ అధికారంలో ఉన్న ప్రతిసారీ – వాజపేయి యుగం నుండి మోదీ యుగం వరకు – మూడు దశాబ్దాలుగా ఒకే కథ పునరావృతమవుతోంది. ఇంటెలిజెన్స్ ఫెయిల్యూర్, సెక్యూరిటీ ల్యాప్స్ అనే పదాలు తరచూ వినిపిస్తాయి. ఎన్నికల సమయంలో రాజకీయ లాభాల కోసం ఈ రక్తం పారాల్సిందే అన్నట్టు పరిస్థితి నడుస్తోంది.




# బీజేపీ పాలనలో ఉగ్రవాద రక్తసిక్తం

### వాజపేయి యుగం: మొదటి రక్తపు అధ్యాయాలు

1999–2004 మధ్య వాజపేయి ప్రభుత్వం హయాంలోనే దేశ భద్రతపై తీవ్ర దెబ్బలు పడ్డాయి. డిసెంబర్ 13, 2001న భారత పార్లమెంటుపై జైష్–ఎ–మహమ్మద్ ఉగ్రవాదుల దాడి జరిగింది. 5 మంది ఉగ్రవాదులు 9 మందిని (5 పోలీసులు, ఒక గార్డెనర్, 3 సిబ్బంది) హతమార్చారు. 18 మందికి గాయాలు. ఇంటెలిజెన్స్ ముందుగానే హెచ్చరికలు జారీ చేసినా నిర్లక్ష్యం వల్ల దేశ గుండెలోనే దాడి జరిగింది. పార్లమెంటు భద్రత బలోపేతం కాలేదు. అదే నెలలో గుజరాత్‌లోని అక్షరధాం ఆలయంపై లష్కర్–ఎ–తొయిబా దాడి – 30 మంది మరణం, 80 మందికి గాయాలు. అప్పటి సీఎంగా మోదీ ఉన్న రాష్ట్రంలో 'గుజరాత్ మోడల్' ఫెయిల్ అయింది. సెప్టెంబర్ 24, 2002న మళ్లీ అక్షరధాం దాడి – 33 మంది మరణం, 100 మందికి పైగా గాయాలు. ఒకే ఏడాదిలో రెండుసార్లు దాడులు. ఇంటెలిజెన్స్ లోపం, పోలీస్ వైఫల్యం అంటూ వార్తలు మామూలయ్యాయి. బీజేపీ రాష్ట్రంలో భద్రత లేదు, అయినా బింకాలు మాత్రం తగ్గలేదు.

### మోదీ యుగం: రక్త చరిత్ర కొనసాగింపు

2014 నుండి 2025 వరకు మోదీ ప్రభుత్వం హయాంలో ఉగ్రవాద దాడులు మరింత తీవ్రమయ్యాయి. జూన్ 4, 2015న మణిపూర్ చందేల్‌లో ఎన్ఎస్‌సీఎన్–కె దాడి – 18 సైనికుల మరణం, 11 మందికి గాయాలు. అధికారంలోకి వచ్చి 10 రోజులే అయినా మొదటి పెద్ద దాడి. బోర్డర్ సెక్యూరిటీ లోపం అని మీడియా రిపోర్టులు. జులై 27, 2015న పంజాబ్ గుర్దాస్పూర్‌లో పాక్ ఇన్‌ఫిల్ట్రేషన్ – 7 మంది మరణం (3 పోలీసులు, 3 సివిలియన్లు, 1 ఎస్పీ). ఇంటెలిజెన్స్ హెచ్చరిక ఉన్నా నిర్లక్ష్యం. 1995 తర్వాత మొదటి పెద్ద దాడి. జనవరి 2, 2016న పఠాంకోట్ ఎయిర్‌బేస్ దాడి – 7 సైనికుల మరణం, 17 గంటల గన్‌ఫైట్. పంజాబ్ పోలీస్ ఎస్పీ హెచ్చరించినా చర్య లేదు. ఎన్ఐఏ దర్యాప్తు పెండింగ్‌లోనే ఉంది.

### పుల్వామా నుండి పహల్గాం వరకు భద్రతా లోపాలు

సెప్టెంబర్ 18, 2016న ఉరి ఆర్మీ క్యాంప్ దాడి – 19 సైనికుల మరణం, ఒకే దాడిలో అత్యధికం. పాకిస్తాన్ సపోర్ట్, ఇంటెలిజెన్స్ ఇన్‌పుట్ ఉన్నా సెక్యూరిటీ ల్యాప్స్. నవంబర్ 29, 2016న నాగ్రోటా దాడి – 7 సైనికుల మరణం. 10 రోజుల ముందు ఇంటెలిజెన్స్ వార్నింగ్ ఉన్నా నిర్లక్ష్యం. ఏప్రిల్ 25, 2017న సుక్మా మావోయిస్టు దాడి – 26 సీఆర్‌పీఎఫ్ జవాన్ల మరణం. 300 మంది మూకుమ్మడి దాడి, ఇంటెలిజెన్స్ ఫెయిల్. ఫిబ్రవరి 14, 2019 పుల్వామా – 40 సీఆర్‌పీఎఫ్ జవాన్ల మరణం, సూసైడ్ బాంబర్, 100 కేజీ ఆర్‌డీఎక్స్. ఇంటెలిజెన్స్ సూచనలు ఉన్నా కాన్వాయ్ ఆపలేదు. లెఫ్టినెంట్ గవర్నర్ సత్యపాల్ మాలిక్ ఇంటెలిజెన్స్ ఫెయిల్యూర్‌గా ఒప్పుకున్నారు.

### ఆర్టికల్ 370 తర్వాత దాడులు పెరిగాయి

ఏప్రిల్ 3, 2021 సుక్మా–బీజాపూర్ దాడి – 22 సురక్షా సిబ్బంది మరణం, 32 మందికి గాయాలు. ఏప్రిల్ 26, 2023 దంతేవాడా – 10 పోలీసులు, 1 డ్రైవర్ మరణం. జూన్ 9, 2024 రీసీ–జెండకే – 9 హిందూ యాత్రికుల మరణం, 41 మందికి గాయాలు. ఏప్రిల్ 22, 2025 పహల్గాం – 26 సివిలియన్లు (అందరూ హిందువులు) మరణం. టూరిస్ట్ బస్‌పై దాడి, లష్కర్ తోయిబా బాధ్యత. ఇంటెలిజెన్స్ సమాచారం ఉన్నా భద్రతా ఏర్పాట్లు లేవు. నవంబర్ 10, 2025 ఢిల్లీ రెడ్ ఫోర్ట్ సమీపం కారు బాంబ్ – 8 మంది మరణం, 30 మందికి గాయాలు. రాజధానిలోనే భద్రత లేదు. మావోయిస్టు దాడులు: 2014–2023 మధ్య 200కు పైగా జవాన్ల మరణం. 2014–2018లో జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్ర సంఘటనలు 176 శాతం, రక్షణ సిబ్బంది మరణాలు 93 శాతం పెరిగాయి. ఇన్‌ఫిల్ట్రేషన్ 300 శాతం పెరుగుదల. ఆర్టికల్ 370 తర్వాత దాడులు మరింత పెరిగాయి. పఠాంకోట్, ఉరి, పుల్వామా, పహల్గాం – అన్నీ ఒకే కథ: ఇంటెలిజెన్స్ హెచ్చరికలు ఉన్నా చర్య లేదు. బోర్డర్ గ్యాప్స్, డ్రోన్లు, టన్నెల్స్ ఆపలేకపోవడం. దర్యాప్తులు పెండింగ్. పుల్వామా తర్వాత 2019 ఎన్నికల్లో హిందువులే టార్గెట్. "సబ్‌కా సాత్" ఎక్కడ? మోదీ ఉపన్యాసాలు దంచటంలో మాస్టర్, చేతలు శూన్యం. వాజపేయి నుండి మోదీ వరకు బీజేపీ అసమర్థ ఫార్ములా: ఆత్మస్తుతి, పరనింద. 56 ఇంచ్ ఛాతీ మాటల్లోనే. ఉగ్రవాదులకు అచ్ఛా దిన్, జనాలకు కాలా దిన్. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ వైఫల్యాలకు బాధ్యత వహించాలి.



**డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్.**
**9849328496.**

---

# పాతికేళ్ల పోరాటం - ఇరవై ఆరేళ్ల అమరత్వం ఆమె కామ్రేడ్ రంగవల్లి..!




ఈ నెల 13న కామ్రేడ్ రంగవల్లి ఇరవైఆరవ వర్ధంతిని,రంగవల్లి విజ్ఞాన కేంద్రం, వేములవాడ (నంది కమాన్) వద్ద నిర్వహిస్తున్నారు.నవంబర్ మాసం అంటే చలి కాలమే కాదు. అది వెచ్చని నెత్తుటితో తడిసి ఒక ఆశయాన్ని మోసుకొచ్చిన మాసం. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (PDSU) వ్యవస్థాపకుడు కామ్రేడ్ జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ 1975 ఎమర్జెన్సీని కాలంలో చీకటి గుండ్లలో ఎన్‌కౌంటర్‌లో అమరుడై నవంబర్ 05 కు యాభై ఏండ్లు నిండుకున్నాయి.కామ్రేడ్ జంపాల స్థాపించిన PDSU జెండాను ఎత్తినది కామ్రేడ్ రంగవల్లి.యాదృచ్ఛికమే అయినా ఈ ఇద్దరి కామ్రేడ్స్ ది ఉమ్మడి నిజామాబాద్ జిల్లా.

కామ్రేడ్ రంగవల్లి ఉన్నతమైన కుటుంబంలో తొలిచూలు బిడ్డగా జన్మించింది.పీడిత ప్రజల కోసం తన జీవన ప్రయాణం కొనసాగించింది. నిజామాబాద్ జిల్లా %ూణూఖ% నాయకురాలిగా ఉన్నత చదువుల కోసం హైదరాబాద్ కు వచ్చి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తత్వశాస్త్రం అభ్యసిస్తూనే విద్యార్థుల పక్షాన PDSU రాష్ట్ర కోశాధికారిగా బిగి పిడికిలి జెండా ఎత్తింది.విజృంభణ మాస పత్రికకు ఎడిటర్ గా పని చేసింది.ఎన్నో విద్యార్థి ఉద్యమాలలో చురుకుగా పాల్గొన్నది.కేవలం విద్యార్థి ఉద్యమాలకే పరిమితం కాలేదు.మహిళా సమస్యలపై కదం తొక్కింది .రైతు కూలీల సమస్యలపై మద్దతుగా నిలిచింది.దివి సీమ ప్రజలు వరదల్లో నష్టపోతే వారికి అండగా నిలిచింది.ఇలా అనేక సామాజిక,సాంఘిక,సాంస్కృతిక,ఆర్థిక సమస్యల మీద రాజకీయంగా స్పందించిన దీశాలి తాను. ఈ క్రమంలోనే ఉన్నతమైన మార్గాన్ని ఎంచుకున్నది కామ్రేడ్ రంగవల్లి.అడవి తల్లి తల్లడిల్లుతుందని ఓదార్చుడానికి అడవి బాట పట్టింది.కుల వర్గ పోరాటాన్ని ఎత్తిపట్టింది.సీపీఐ (ఎం- ఎల్) జనశక్తి రాష్ట్ర నాయకురాలిగా శోషిత జనాలకు అండగా,నోరు లేని ఆదివాసీ ప్రజలకు గొంతుకై వినిపించింది.అడవికి అండగా ఆయుధాన్ని ఎత్తిపట్టిన రంగవల్లిని రాజ్యం నవంబర్ 11,1999న రాజకీయ హత్య జేసింది.కామ్రేడ్ రంగవల్లి అమరురాలై నేటికి ఇరవై ఆరు ఏళ్లు అవుతుంది. ఆమె స్మృతిలో నిర్మాణమైన రంగవల్లి విజ్ఞాన కేంద్రంలోనే ఆమె స్మారకోపాన్యాసాల సభ జరగడం విశేషం.

నేడు దేశం సంక్షోభంలో ఉన్నది. ఎక్కడ చూసినా రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న రాజ్యం.ప్రజలపై ముప్పేట దాడులకు సిద్ధపడింది.రాజకీయ విశ్వాసాలు కలిగి ఉన్న వాళ్లను నేరస్తులుగా పరిగణిస్తూ అక్రమ కుట్ర కేసులను బనాయిస్తుంది.ఎక్కడ ఏ ప్రశ్న ఉత్పన్నం అయినా దానికి సమాధానం చెప్పలేక ప్రశ్నించే గొంతులను కత్తులతో కోస్తున్నది.ఇలాంటి సామాజిక సంక్షోభంలో కామ్రేడ్ రంగవల్లి ఇరవై ఆరోవ వర్ధంతిని జరుపుకోవడం అంటే దేశ పరిస్థితులను తడుముకొని ఎలా ముందుకు పోవడమనే కార్యాచరణకు ఒక సందర్భం అవుతుంది.ఒక ఉమ్మడి కార్యాచరణగా ముందుకు పోవడమే రంగవల్లికి ఇచ్చే నిజమైన నివాళి కాగలదు.

జోహార్ కామ్రేడ్ రంగవల్లి
జోహార్ కామ్రేడ్ జంపాల చంద్ర శేఖర్ ప్రసాద్
జోహార్ అమరవీరులకు

**వంగల సంతోష్**
ప్రజా సంఘాల ఉమ్మడి వేదిక


---

# తెలంగాణ విప్లవ తేజం కాళోజీ

"ఏ భాష నీది ఏమి వేషమురా,
ఈ భాష ఈ వేషమెవరి కోసమురా,
ఆంగ్లమందున మాటలనగానే
ఇంత కుల్కెదవెందుకు రా,
తెలుగు వాడివై తెలుగు రాదనుచు,
సిగ్గులేక ఇంక చెప్పుటెందుకురా
అన్య భాషలు నేర్చి ఆంధ్రమ్ము రాదంచు, సకిలించు ఆంధ్రుడా చావ వెందుకురా,"!...పర భాషలపై మోజుతో మాతృ భాషను విస్మరించే వారిని కాళోజీ కంటే గొప్పగా హెచ్చరించిన వారెవరూ లేరనేది వాస్తవం. అందుకే ఆయన జయంతి 'తెలంగాణ భాషా దినోత్సవం' అయింది. ఎక్కడో మరాఠాల కుటుంబంలో పుట్టి, వరంగల్‌కు వచ్చి స్థిరపడి 'నాది బడి పలుకుల భాష కాదు.. పలుకు బడుల భాష.. నా మాతృభాష తెలుగు' అని ఎలుగెత్తిన పోరాట యోధుడు. భయం అనేది ఎరుగని కలం వీరుడు కాళోజీ. ఆయన తుపాకీ గుండ్లకు ఎదురు నిలిచాడు. ఎన్నో సార్లు నిజాం ప్రభుత్వం కాళోజీని వరంగల్లు నుంచి బహిష్కరించింది.

"నా గురించి చెప్పు కోవాలంటే ఎక్కడ అన్యాయం జరిగినా ప్రతిఘటిస్తు వచ్చిన, అన్ని ఉద్యమాల్లో ధైర్యంగా పాల్గొన్న, ఎక్కడ అక్రమం జరిగినా దాన్ని ధిక్కరిస్తూ గేయమో, కథో రాసిన. నా గేయాలలో తొంభై ఐదు శాతం ఉద్యమాలపై రాసినవే. అవన్నీ గేయ రూపంలో ఉన్న స్టేటుమెంట్లే." అలాంటి కలం వీరుడిని జ్ఞాపకం చేసుకుని నివాళులు అర్పించాల్సిన అవసరం అనివార్యంగా ఉంది.

రఘువీర్ నారాయణ్ లక్ష్మీకాంత్ శ్రీనివాసరాం రాజా కాళోజీ (సెప్టెంబరు 9, 1914 – నవంబరు 13, 2002) "కాళోజీ నారాయణ రావు లేదా కాళోజీ లేదా కాళన్న"గా సుపరిచితులు. ఆయన తెలంగాణ ప్రజల ప్రతీ ఉద్యమం యొక్క ప్రతిధ్వనిగా కొనియాడ బడతాడు. ఆయన రాజకీయ సాంఘిక చైతన్యాల సమాహారం. కవిత్వం రాసినా, హక్కులడిగినా, ఉద్యమం నడిపినా, ప్రజా వాణికి ప్రతిధ్వనిగా నిలిచాయన. మొత్తంగా తెలంగాణ జీవిత చలన శీలి కాళోజి. ఆజన్మాంతం తెలంగాణ ప్రజల అన్యాయాల గురించే తపించిన మహనీయుడు, వైతాళికుడు కాళోజి. నిజాం దమన నీతికి, నిరంకుశత్వానికి, అరాచక పాలనకి వ్యతిరేకంగా ఆయన తన కలం ఎత్తాడు. ఆయన స్వాతంత్ర్య సమర యోధుడు, తెలంగాణా ఉద్యమ కారుడు. ఆయన 1992లో భారతదేశ అత్యున్నత పురస్కారం పద్మ విభూషణ్ పొందాడు. ఆయన జన్మదినాన్ని తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా చేసి గౌరవించింది. వరంగల్‌లో నెలకొన్న వైద్య విద్యాలయానికి ఆయన పేరు పెట్టబడింది.




'అన్యాయాన్నెదిరిస్తే నా గొడవకు సంతృప్తి...అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తిప్రాప్తి. అన్యాయాన్నెదిరించిన వాడే నాకారాధ్యుడు' అని సగర్వంగా ప్రకటించి ఉద్యమమే ఊపిరిగా జీవించిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు. ఆయన 1914, సెప్టెంబరు 9 న (కర్ణాటక) రాష్ట్రం, బీజాపూర్ జిల్లా లోని రట్టిహళ్లి గ్రామంలో జన్మించాడు. తల్లి రమాబాయమ్మ, కన్నడిగుల ఆడ పడుచు. తండ్రి కాళోజీ రంగారావు మహారాష్ట్రీయుడు. కాళోజీ తెలుగు, ఉర్దూ, హిందీ, మరాఠీ, కన్నడ, ఇంగ్లీషు భాషల్లో రచయిత గా ప్రఖ్యాతి గాంచాడు. రాజకీయ వ్యంగ్య కవిత్వం వ్రాయడంలో కాళోజీ దిట్ట. 'నా గొడవ' పేరిట సమకాలీన సామాజిక సమస్యలపై నిర్మొహమాటంగా, నిక్కచ్చిగా, కటువుగా స్పందిస్తూ పాలకులపై అక్షరాయుధాలను సంధించి ప్రజాకవిగా కీర్తిగడించాడు. తెలంగాణ ప్రజల ఆర్తి, ఆవేదన, ఆగ్రహం ఆయన గేయాల్లో రూపు కడతాయి. నిజాం దమన నీతికి, నిరంకుశత్వానికి, అరాచక పాలనకు వ్యతిరేకంగా కలం, గళం ఎత్తిన ఈ శతాబ్దపు మేటి కవి కాళన్న. బీజాపూర్ నుంచి వరంగల్ జిల్లాకు తరలివచ్చిన కాళోజీ కుటుంబం మడికొండలో స్థిరపడింది. ప్రాథమిక విద్యానంతరం హైదరాబాదు పాతబస్తీలోని చౌమహల్ న్యాయ పాఠశాలలో కొంతకాలం చదివిన కాళోజీ, అటు తరువాత సిటీ కాలేజీలోనూ, హన్మకొండలోని కాలేజియేట్ ఉన్నత పాఠశాల లోనూ చదువు కొనసాగించి మెట్రిక్యులేషను పూర్తిచేశాడు. 1939 లో హైదరాబాదు లో హైకోర్టుకు అనుబంధంగా ఉన్న న్యాయ కళాశాల నుంచి న్యాయ శాస్త్రంలో పట్టా పొందాడు. 1930 నుంచే కాళోజీ గ్రంథాలయ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నాడు. తెలంగాణలోని ప్రతి గ్రామంలో ఒక గ్రంథాలయం ఉండాలన్నది కాళోజీ ఆకాంక్ష. సత్యాగ్రహోద్యమంలో పాల్గొని 25 సంవత్సరాల వయసులో జైలుశిక్ష అనుభవించాడు. నిజామాంధ్ర మహాసభ, హైదరాబాదు స్టేట్ కాంగ్రెసుతో కాళోజీ అనుబంధం విడదీయరానిది. 1940 లో రుక్మిణీబాయితో వివాహం జరిగింది. మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి, జమలాపురం కేశవరావు, బూర్గుల రామకృష్ణా రావు, పి.వి.నరసింహారావు వంటి వారితో కలిసి కాళోజీ అనేక ఉద్యమాల్లో పాల్గొన్నాడు. విద్యార్థి దశలోనే నిజాం ప్రభుత్వ నిషేధాజ్ఞలను ఉల్లంఘించి వరంగల్లులో గణపతి ఉత్సవాలు నిర్వహించాడు. తెలంగాణలో అక్షర జ్యోతిని వ్యాపింపజేయాలన్న తపనతో ఆంధ్ర సారస్వత పరిషత్తును స్థాపించిన ప్రముఖుల్లో కాళోజీ ఒకడు. రజాకార్ల దౌర్జన్యాన్ని ప్రతిఘటిస్తూ 1945 లో పరిషత్తు ద్వితీయ మహా సభలను దిగ్విజయంగా నిర్వహించడంలో కాళోజీ ప్రదర్శించిన చొరవ, ధైర్య సాహసాలను ఆయన అభిమానులు ఇప్పటికీ గుర్తు చేసుకుంటారు. వరంగల్ కోటలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడానికి ప్రయత్నించి నందుకు ఆయనకు నగర బహిష్కరణ శిక్ష విధించారు. స్వరాజ్య సమరంలో పాల్గొని ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థులు బహిష్కరణకు గురైనప్పుడు, వారిని నాగపూర్ విశ్వ విద్యాలయంలో చేర్పించి ఆదుకోవడంలో కాళోజీ పాత్ర అనన్యం. 1953 లో తెలంగాణ రచయితల సంఘం ఉపాధ్యక్షుడుగా ఎన్నికయ్యాడు. 1958 లో ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి శాసన మండలి సభ్యునిగా ఎన్నికై, 1958 నుండి 60 వరకు పనిచేసారు. రెండేళ్లు ఏ పార్టీకి చెందని స్వతంత్ర సభ్యుడిగా ఉన్నాడు. ఆయన "ఆంధ్ర సారస్వత పరిషత్" వ్యవస్థాపక సభ్యుడు మరియు ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడెమీలో సభ్యుడు. ఆయన తెలంగాణ రచయితల సంఘం అధ్యకునిగా, 1957-61 కాలంలో గ్లోసరీ కమిటీ సభ్యునిగా ఉన్నారు. 1977లో సత్తుపల్లి (ఖమ్మం జిల్లా) నుండి స్వతంత్ర అభ్యర్థిగా నాటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు పై పోటీ చేశాడు, కానీ ఓడి పోయాడు. కాకతీయ విశ్వ విద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయగా, భారత ప్రభుత్వం పద్మ విభూషణ్ అవార్డుతో సత్కరించింది. 'హింస తప్పు, రాజ్యహింస మరీ తప్పు' అంటూ "సామాన్యుడే నా దేవుడు" అని ప్రకటించిన కాళోజీ 2002 నవంబరు 13 న తుదిశ్వాస విడిచాడు. ఆయన మరణా నంతరం ఆయన పార్థివ శరీరాన్ని కాకతీయ మెడికల్ కళాశాలకు అంద జేసారు. 1992లో పద్మ విభూషణ్ – భారత రెండవ అత్యున్నత పురస్కారం 1972లో తామ్రపత్ర పురస్కారంబీ 1968లో "జీవన గీత" రచనకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే అనువాద పురస్కారంబీ బూర్గుల రామకృష్ణా రావు మెమోరియల్ మొదటి పురస్కారంబీ ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం చే 1981లో సత్కారంబీ "ప్రజాకవి" బిరుదు ఆంధ్రప్రదేశ్‌లో అనేక సాహితీ సంఘాలచే సన్మానాలు రామినేని ఫౌండేషన్ అవార్డుబీ గాడిచర్ల ఫౌండేషన్ అవార్డుబీ కాకతీయ విశ్వ విద్యాలయంవరంగల్ వారు 1992 లో డాక్టరేట్‌బీ 1996లో సహృదయ సాహితీ విశాఖ వారి గురజాడ అవార్డుబీ 1996లో కళసాగర్ మద్రాస్ వారి విశిష్ట పురస్కారం పొందారు. ఆయన మరాఠీ, ఇంగ్లీషు, ఉర్దూ భాషల్లో పండితుడు. ఎన్నో ఇతర భాషా గ్రంథాలను తెలుగులో అనువదించాడు. 1943 లోనే ఆయన కథల్ని "కాళోజీ కథలు" పేరుతో అప్పట్లో హైదరాబాదులో ఆంధ్ర పబ్లిషింగ్ కంపెనీకి చెందిన అణా గ్రంథమాల సంస్థ తన పద్నాలుగో ప్రచురణగా ప్రచురించింది. ఆంధ్ర జనసంఘం, ఆంధ్ర సారస్వత పరిషత్తు, ఆంధ్ర మహాసభ, తెలంగాణ రచయితల సంఘం సంస్థల నిర్మాణలలో కాళోజి భాగం ఉంది. పాములపర్తి నరసింహారావు లాంటి ఎందరికో ఆయన సాహిత్యంలో, రాజకీయాల్లో మార్గదర్శనం చేశాడు. విశాలాంధ్ర సమస్యలు గమనించి ఆయన 1969లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కలిశాడు.

అన్ని సందర్భాలలో అసలుసిసలైన తెలంగాణ వాదిగా జీవించాడు. పర భాషా జ్ఞానాన్ని సంపాదించు కోవడం అవసరమే. కానీ, ఆ సాకుతో అమ్మ లాంటి మన భాషను నిర్లక్ష్యం చేయడం ఎంత తప్పు. నేటి తరం. తెలుగు పదాలనే మర్చిపోతోంది. ఈ పరిస్థితి పోవాలి. మన తేట తెలుగు భాషకు పూర్వ వైభవం రావాలి అని పరితపించాడు. తెలంగాణ పలుకు బడితో ప్రజల మాట, వ్యధలను ఆయన వ్యక్తం చేసిన తీరు అమోఘం. అందరికీ ఆదర్శ ప్రాయం.

**రామకిష్టయ్య సంగనభట్ల**
**9440595494**

---

## రెక్కలు తొడిగిన బాల్యం

**ఆకలి దూప తీర్చింది
యిప్పుడే నిద్రలోకీ..
ఈ పూట జోరు లేదు
జోల పాట లేదు
సోపతి గాండ్ల గాలి ముచ్చట్లు..
సుడి గాలుల గురుతులున్నయ్
దారెంట పోతుంటే..
గోడకేసిన సినిమా బొమ్మ
రమ్మని సైగ చేసింది
గమ్యం చేరాలో..
ఆ సైగను తీర్చాలో ..
తెలియని సంకట స్థితి
మూడ్రుపాయల సినిమా షో..
ఎన్ని సార్లు ఎడిపించిందో
గుర్తొస్తే..
గుండె అగినంత పనైతాంది
అరచేతిలో స్వరం
ఇక టికెట్ కొనాల్సిన అవసరం లేదు
కుంచెలో ఓ వగలాడి సింగారించుకుంది
మిత్రుడి ఇంటి గోడకూ
ఆ రోజు ప్రాణంబోసుకుంది
ఏండ్లు గడిచినా..
రంగెలిసినా..
పడచుతనం తగ్గలె
తల్లడిల్లిన పానం
ఆకాశంలో స్వప్నాలను వెతుకుతుంది
మాస్టారుకు అందించిన చిత్రం
కండ్లలో కన్నీళ్లను నిద్రలేపాయి
ఆ చిత్రం తనదే..
ఆనంద బాష్పాలు వొక్కసారిగా
హృదయాన్ని అల్లుకున్నై
పాదాన్ని తాకిన స్పర్శ పెదాలపై మెరుస్తుంది
చెరువు బండలపై..
వొడ్ల కల్లాల్లో ఏరిన పరిగే గింజలు
పక్షుల ఆకలి తీర్చినై.. పుచ్చిన కర్రల దులిపి
ఏరిన చెదను కోడి పిల్లలకేసేది
అప్పుడూ.. ఈ చిన్ని మనస్సుది
అమ్మ తనంగా తోచేది
సంతలో పాత బట్టలకున్న క్రేజీ
పెద్దింట్లో వొండిన పాయాసానికి లేదాయే
ఈ బుడుతడు
నిండు జాబిలిలో కునుకు దీస్తాండు
వాడి భావాలు లోకాన్ని చుట్టేస్తున్నై
మల్లన గట్టుకేసిన గాలం
ఇంట్లో పండుగ జేసింది
అటికెలో చేప పిల్లల గుంపు సందడి
ఇంటిముందు చల్లని తాటాకుల పందిరేసింది
ఓ కాలమా! వొచ్చిపో..
ఓ 'సారీ' మాయింట్లో చేయి కడిపో..
మళ్లొసారి పంటకు పచ్చని రంగేసిపో
మిగిలిన పేజీలతో
కుట్టిన వొయ్యిని సూసినప్పుడల్లా..
రాయని పాఠాలు యాదికొచ్చేవి
భారాలను మోసికొని
బాల్యమెక్కడో బందీయైంది
విస్మరించిన బాటే..
బతుకు దీపమైంది
జ్ఞానం లేని సదువు
వెలుగు లేని సీకటి రెండు ఒకటే!
ఈ తరానికి సోయిలేదు
ఏలికలు సీకట్లను జన మైదానంలో అలికారు
సన్నాసుల కసాయి తనం రూడీయైంది
బతుకంటావా ?
అదొక మిద్యే! ఈ మట్టి చరిత్ర
నువ్వే రాయాలి ఊరి శిఖలో పొదిగిన వజ్రం
నీవే చెప్పాలి
వెలుగు జాడల వీరత్వం పరిమళించాలి
చరిత్రను పునర్లికించాలి
చేతి వేళ్లను ముద్దాడిన కాలం
కానరానిదైందా.. అంటరానిదా!
కటికె వాడు మొద్దుపై
కత్తులాడీస్తుండు
ఎడ్లీ తూడ్చిన ఎన్నెముక
ఎడాబోయిందో..
యిక, నిప్పులపై నడక సెమట పుట్టిస్తోంది
సెమట సుక్క లేని సొత్తు
సొగసు తప్పింది**

- మామిండ్ల రమేష్ రాజా
78932 30218

జనంసాక్షి

# శేరిలింగంపల్లి పరిధి చెరువులను అభివృద్ధి చేస్తాం

- 64 చెరువులను సుందర శోభిత వనాలుగా తీర్చిదిద్దడమే ధ్యేయం
- పిఎసి చైర్మన్ అరికపూడి

**శేరిలింగంపల్లి, నవంబర్ 12 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ డివిజన్ పరిధి గురునాథం చెరువు, పటేల్ చెరువు, మక్త మహబూబ్ పేట్ లోని పెద్ద కుడి చెరువు, రామసముద్రం కుంట చెరువు, నాయనమ్మ కుంట చెరువుల మహర్దశ తన లక్ష్యమని, వాటిని సుందర శోభిత మంచినీటి వనరులుగా తీర్చిదిద్దడమే తన ప్రధాన ఆశయమని రాష్ట్ర ప్రజాపతుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. మియాపూర్ డివిజన్ పరిధి గురునాథం చెరువు సుందరీకరణలో భాగంగా నెక్సస్ సెలెక్ట్ మాల్స్ కంపెనీ వారి కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ పథకం కింద మల్లిక వార్డ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా చేపట్టిన చెరువు పునరుజ్జీవనంలో భాగంగా బుధవారం మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, లేక్ మ్యాన్ ఆఫ్ ఇండియా ఆనంద్ మల్లిగవాడ్, నెక్సస్ సెలెక్ట్ మాల్స్ ప్రతినిధులతో కలిసి అరికపూడి గురునాథం చెరువును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలోని మొత్తం 64 చెరువులను అన్ని రంగాలలో ఘనంగా తీర్చిదిద్దుతామని భరోసాను వ్యక్తం చేశారు. శేరిలింగంపల్లి పరిధిలోని 64 చెరువులను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని, చెరువుల సుందరికరణతో స్వచ్ఛమైన వర్షపు జల సిరులను ఒడిసి




పడతామని ధీమాను వ్యక్తం చేశారు. చెరువుల జలకళతో గ్రామీణ వాతావరణం నెలకొల్పడమే తన ధ్యేయంగా ముందుకు సాగుతానని, చెరువులను సంరక్షిస్తే భూగర్భ జలాల ద్వారా అవి తిరిగి మానవాళిని కాపాడుతాయని ఆయన జోస్యం చెప్పారు. చెరువులలో నీరు నిల్వ ఉండడం ద్వారా జీవ వైవిధ్యం పెరుగుతుందని, పక్షుల వలసలు పెరిగే ప్రకృతి సంపద మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. చెరువుల సంరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, చెరువులను దత్తత తీసుకొని అభివృద్ధి చేసే వారు ప్రత్యక్షంగా కనిపించే దైవంతో సమానమని ఆయన వివరించారు. గురునాథం చెరువు పునరుద్ధరణ ప్రభుత్వం, పరిశ్రమలు, సమాజం మధ్య భాగస్వామ్య ప్రయత్నాలు అర్థవంతమైన పర్యావరణ పురోగతిని ఎలా నడిపించగలదో చెప్పడానికి ఒక శక్తివంతమైన ఉదాహరణగా ఆయన అభివర్ణించారు. గురునాథం చెరువు అభివృద్ధి తర్వాత ఇక్కడి పరిసర ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన ఆహ్లాదకరమైన వాతావరణం లభించడంతోపాటు సుజల జలంతో అపురూప దృశ్య కావ్యంగా గోచరిస్తుందన్నారు. నెక్సస్ సెలక్ట్ మాల్స్ ద్వారా మల్లిగవాడు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుందరీకరణ చేపట్టుటకు ముందుకు రావడం చాలా అభినందించదగ్గ విషయమని సమాజ హితం, సమాజసేవ చేయడం కోసం వారు స్వచ్ఛందంగా ముందుకు రావడం ఆహ్వానించదగ్గ పరిణామం అన్నారు. ఈ క్రమంలో లేక్ మ్యాన్ ఆఫ్ ఇండియా గా ప్రసిద్ధిగాంచిన ఆనంద్ మల్లిగవాడ్ ను మరియు ఆయన బృందాన్ని పీఏసీ చైర్మన్ అరికపూడి హృదయపూర్వకంగా అభినందించడం జరిగింది. గురునాథం చెరువు సుందరీకరణ, సంరక్షణ, అభివృద్ధి పనులు పూర్తయిన క్రమంలో చెరువుకట్టను పటిష్టపరిచేలా పునరుద్ధరణ, మురుగు నీరు చెరువులో కలవకుండా ప్రత్యేకంగా చెరువు చుట్టూ నిర్మించే మురుగు నీటి కాల్వ యుజిడి)నిర్మాణం మరియు అలుగు మరమ్మత్తులు, పునరుద్ధరణ పనులు, వాకింగ్ ట్రాక్ వంటి పనులను సమగ్రంగా చేపడతామన్నారు. అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో నెక్సస్ సెలెక్ట్ మాల్స్ ప్రతినిధులు జయం నాయక్, నీలేష్ సింగ్, నిషాంక్ జోషి, హర్ష, తన్వీర్ షేక్, బ్లాక్ స్టోన్ గ్లోబల్ ఈఎస్జి ప్రతినిధులు ఎరిక్, ప్యారిస్, సిఎస్ఆర్ ఐ టి సంస్థ ప్రతినిధులు చైతన్య, రాము, వివిధ కాలనీల అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రేషన్ డీలర్ల బకాయిలను వెంటనే చెల్లించాలి



**హయత్‌నగర్, నవంబర్ 12 (జనం సాక్షి) :** భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) హయత్ నగర్ సర్కిల్ ఆధ్వర్యం లో సిఐటియు కార్యాలయం లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం హయత్ నగర్ సర్కిల్ కార్యదర్శి కీసర నర్సిరెడ్డి మాట్లాడుతూ రేషన్ డీలర్ల రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వవలసిన బకాయిలను వెంటనే చెల్లించాలని వారు కోరారు. ప్రభుత్వం చెల్లించని స్థితిలో డీలర్లు అందరూ అధిక రేట్లకు గోధుమలు విక్రయిస్తున్నారని ఫలితంగా పేద ప్రజల డబ్బులు డీలర్లు అక్రమంగా వసూలు చేస్తున్నారని కావున తక్షణమే డీలర్లకు చెల్లించాల్సిన గత బకాయిలన్నీటిని చెల్లించాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. గోధుమలు ప్రభుత్వ రేటు రూపాయలు 7 ఉండగా, డీలర్లు 15 రూపాయల వరకు అధిక రేట్లకు విక్రయిస్తున్నారని వారు అన్నారు. ఈ విక్రయాలను తక్షణమే నిలుపుదల చేయాలని, ధరల పట్టికలను నోటీస్ బోర్డులో డిసిప్లే చేయాలని వారు తెలిపారు. రేషన్ షాపు లలో కేరళ ప్రభుత్వం ఇస్తున్న పద్ధతిలో 14 రకాల నిత్యవసర సరుకులను పేదలకు సరఫరా చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమం లో సర్కిల్ కమిటీ సభ్యులు చింతపల్లి కృష్ణయ్య, బిట్టు మూర్తి, లెక్చరర్స్ కాలనీ నాయకులు రాసూరి బిక్షపతి, ఏ బూసి నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

# గంగన్న కుంటను వదలని ఆక్రమణ దారులు

- చర్యలు శూన్యం
- దర్గాగా సారెగూడెం గంగన్న ఎఫ్‌టిఎల్ బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలు



**నిజాంపేట్, నవంబర్ 12 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పటిష్టాత్మకంగా చెరువులు కుంటలు, కట్టు కాలువలు. నాళాలు కబ్జాలకు గురికాకుండా చెరువులను రక్షించుకోవాలని హైడ్రాను తీసుకొచ్చిన కొందరు అక్రమ నిర్మాణాదారులు చెరువులను కుంటలను చేరబడుతున్నారు. వివరాల్లోకి వెళితే దుండిగల్ గండి మైసమ్మ మండల పరిధిలోని సారెగూడెం గంగన్న కుంట సర్వేనెంబర్ 276 ఎఫ్.టి.ఎల్ బఫర్ జోన్లలో నిర్మాణాలు జరుగుతున్నా రెవెన్యూ అధికారుల కు తెలిసి తమకేమీ పట్టనట్లు చోద్యం చూస్తూ ఉండడం స్థానికులు అధికారుల తీరుపై విస్మయం చెందుతున్నారు. ఇటీవల గంగన్న కుంట ను పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు కుంట కబ్జాపై మౌనం దాల్చడం కొసమెరుపు. కబ్జాల ఆగడాలను అరికడుతుందన్న హైడ్రా భయాలను సైతం పక్కన పెట్టి , అక్రమ నిర్మాణాలు అదే గంగన్నకుంటలో పలు మార్లు జరుగుతున్న ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువిరిస్తున్నాయి ఈ తతంగమంతా వివిధ శాఖల కనుసన్నల్లోనే నడుస్తున్నాయన్నాడానికి గంగన్న కుంట అక్రమ నిర్మాణాలే సాక్ష్యంగా ఇప్పటికీ నడుస్తున్నాయి. ఇప్పటికైనా పై అధికారులు చెరువులు కుంటలలో నిర్మాణాలు చేపట్టకూడదని చర్యలు చేపట్టాలని, ప్రభుత్వం హైడ్రా అదే విధంగా సుప్రీంకోర్టు మార్గదర్శకాలు జారీ చేసినా అధికార యంత్రాంగం నిర్లక్ష్యంతో వ్యవహరించడంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. చెరువులు కుంటలు రెవెన్యూ ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యానికి విలువైన భూములు కనుమరుగై పోతున్నాయి. సర్వేనెంబర్ 276 కుంట విస్తీర్ణ రెండు ఎకరాల10 ఉండడంతో, కొందరు 100 గజాలు ప్లాట్లు చేసి 25 లక్షల నుంచి 20 లక్షల వరకు అమ్ముతున్నారని స్థానికులు తెలియజేస్తున్నారు. ఇంత జరుగుతున్న రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవడం లేదు ఇప్పటికైనా హైడ్రా ఉన్నతాధికారులు గంగన్న కుంట పై దృష్టి సారించి కబ్జాల గురి కాకుండా కాపాడాలని స్థానిక గ్రామస్తులు కోరుతున్నారు.

# ఆయిల్‌ఫామ్ సాగు లాభదాయకం

**మానవపాడు, నవంబర్ 12 (జనం సాక్షి) :** ఆయిల్ ఫామ్ సాగుపై రైతులు అవగాహన కలిగి ఉండాలని, లాభదాయకమైన పంట కాబట్టి సాగు చేసేందుకు ముందుకు రావాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఎంఏ అక్బర్ అన్నారు.బుధవారం మానవపాడు మండల కేంద్రంలోని, ప్రాథమిక సహకార వ్యవసాయ సంఘం అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి అధ్యక్షతన రైతులకు ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహన సదస్సును నిర్వహించారు. కొత్తగా సాగు చేసే రైతు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని చెప్పారు. గద్వాల జిల్లా ఉద్యానవన శాఖ, తెలంగాణ ఆయిల్ ఫీడ్ మరియు సహకార శాఖల ఆధ్వర్యంలో మానవపాడు సింగిల్ విండో కార్యాలయం దగ్గర ఆయిల్ ఫామ్ సాగు పై అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు చైర్మన్ శ్రీధర్ రెడ్డి, అలంపూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్ప, మరియు జిల్లా సహకార అధికారి శ్రీనివాస్ ఈ కార్యక్రమంలో వివరించారు. పామాయిల్ కోసం ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు విదేశీ మారకద్రవ్యాన్ని ఖర్చు చేస్తున్నందున దాన్ని తగ్గించుటకు ఆయిల్ ఫామ్ సగుపై కేంద్రం మరియు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాయని అన్నారు. కొద్దిపాటి పెట్టుబడితో రైతుల ఎక్కువ శాతం సబ్సిడీతో ఆయిల్ పంపు సాగుబడి ముందుకొస్తున్నారు, ఆయిల్ ఫామ్



సాగులో కలిగే ఇబ్బందులను ఎప్పటికప్పుడు ఆయిల్ ఫామ్ ఫీల్డ్ ఆఫీసర్స్ రైతులకు సలహాలు మరియు సూచనలు అందిస్తున్నారు అన్నారు. కొత్తగా ఆయిల్ ఫామ్ సాగు చేసే రైతులు ఈ సదా అవకాశాన్ని వినియోగించుకొని ముందుకు రావాల్సిందిగా జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఎంఏ అక్బర్, మరియు ఆయిల్ ఫీడ్ మేనేజర్ శివ నాగిరెడ్డి కోరారు, ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సందీప్, మరియు ఏఈవోలు, ఉద్యానవన శాఖ అధికారులు రాజశేఖర్, ఇమ్రానా, ఫీల్డ్ ఆఫీసర్ యశ్వంత్, త్రివిక్రమ్, మరియు పెద్ద సంఖ్యలు రైతులు పాల్గొనడం జరిగిందని తెలిపారు.

## తప్పు ఒప్పుకున్న రెవెన్యూ అధికారులు

- చర్యలు మాత్రం శూన్యం



రెవెన్యూ శాఖలో ఫోర్జరీ భాగోతం

ఫోర్జరీ సంతకాలతో పహానీలు పెటి సర్టిఫికెట్లు జారీ చేయిస్తున్న డిప్యూటీ తహశీల్దార్

బయటపడ్డ డిటి రాకేష్ లీలలు ఆలస్యంగా వెలుగులోకి

**కొందుర్గు, నవంబర్ 12 (జనంసాక్షి) :** ఫోర్జరీ సంతకాలతో రెవెన్యూ రికార్డులను తారుమారు చేస్తూ రెవెన్యూ సిబ్బంది చేతివాటానికి అద్దు అదుపు లేకుండా పోయింది. అధికారులు చేస్తున్న తప్పులకు రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. రైతు సమస్యల పరిష్కారానికి ఎన్ని దరకాస్తులు పెట్టిన ఫలితం లేకపోవడంతో పాటు అధికారులు కాసులకు కక్కుర్తి పడి భూ రికార్డులను క్షణాల్లో తారుమారు చేసి డబ్బులు పోగేసుకుంటున్నారు. అలాంటి సంఘటనలకు అద్దాగా కొందుర్గు తహశీల్దార్ కార్యాలయంలో సిబ్బంది తాజాగా వ్యవహరించిన తీరును చూస్తే తెలుస్తోంది.కొందుర్గు మండల డిప్యూటీ తహశీల్దార్ రాకేష్ కుమార్ ఫోర్జరీ సంతకాలతో పీటీ, నఖల్ జారీ చేయడంతో పాటు ప్రయివేట్ వ్యక్తులను ప్రోత్సాహిస్తూ తనదైన స్టైల్ లో ఒక్కో అప్లికేషను లక్షల్లో డిమాండ్ చేసి వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.గతంలో కూడా ప్రయివేట్ వ్యక్తిని పెట్టి రికార్డు సెక్షన్ లో వసూళ్ల పర్వనికి దిగారు. పలు పత్రికల్లో వార్త కథనాలు వచ్చినప్పటికీ చర్యలు మాత్రం శూన్యంగా కనిపిస్తున్నాయి.

## రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

**బొంరాస్‌పేట, నవంబర్ 12 (జనం సాక్షి) :** రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా వరి ధాన్యం కొనుగోలు చేపట్టాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు.బుధవారం మండలంలోని కొత్తూరు,నాగిరెడ్డిపల్లిలోని వరి కొనుగోలు ధాన్యం కేంద్రాలను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరను అందిస్తూ ఏ - గ్రేడ్ ధాన్యం క్వింటాలుకు రూ.2389,సాధారణ రకానికి రూ .2369 చొప్పున కనీస మద్దతు ధర చెల్లించడంతో పాటు సన్న రకానికి అదనంగా రూ.500 చొప్పున బోనస్ అందించనుందన్నారు.కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు గన్నీ బ్యాగులు,తూకం యంత్రాలు,టార్పాలిన్లు,తేమ కొలిచే యంత్రాలను అందుబాటులో సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ తెలిపారు.తాగునీరు,నీడ వసతి నిమిత్తం టెంట్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు.ఎక్కువ సంఖ్యలో హమాలీలను ఏర్పాటు చేసుకుని ధాన్యం తూకం జరిగేలా,ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు రవాణా జరిగేలా సరిపడా లారీలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు.అనంతరం నాగిరెడ్డిపల్లిలో నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి,ఇండ్లు



నిర్మించుకుని గృహప్రవేశాలు చేసుకున్న కుటుంబాలకు జిల్లా కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్,వికారాబాద్ జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ రాజేష్ రెడ్డి,అడిషనల్ డీఆర్డీఓ నరసింహులు,డీసిఎస్ఓ సుదర్శన్ ,డీఎంసిఎస్ మోహన్ కృష్ణ,తహసిల్దార్ పద్మావతి,ఎంపీడీవో వెంకన్ గౌడ్,పిఎసిఎస్ చైర్మన్ జయకృష్ణ, ఉపాధి హామీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నర్సింలు గౌడ్,కాంగ్రెస్ పార్టీ నాయకులు రామచంద్ర రెడ్డి, వెంకట్ రాములు గౌడ్,మల్లేష్, ప్రవీణ్, మహేందర్, నర్సింలు, సిసి యాదయ్య,పంచాయతీ కార్యదర్శులు మహేశ్వరి, బసంత్ రెడ్డి, మహిళా సంఘాలు, వివో ఏలు తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 14న పాదయాత్రను విజయవంతం చేయాలి

**మెదక్ జిల్లా బ్యూరో, నవంబర్ 12 (జనం సాక్షి) :** సర్దార్ వల్లభాయి పటేల్ 150వ జయంతి సందర్భంగా శుక్రవారం మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు నేతృత్వంలో జరిగే పాదయాత్రను విజయవంతం చేయాలని జిల్లా యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్ తెలిపారు. కలెక్టరేట్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు సంబంధిత అధికారులతో యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీన జూనియర్ కాలేజ్ గ్రౌండ్ నుండి రాందాస్ చౌరస్తా వరకు జరిగే పాదయాత్రను విజయవంతం చేయడానికి చెయ్యాల్సిన ఏర్పాట్ల గురించి చర్చిందం జరిగిందన్నారు. ఈ



పాదయాత్రలోయువతీయువకులు, యువజన సంఘాలు, క్రీడా సంఘాలు, విద్యార్థిని విద్యార్థులు, మహిళలు పెద్ద ఏతున పాల్గొని పాదయాత్రను విజయవంతం చేయగలరని సూచించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా యువజన అధికారి యం.రంజిత్ రెడ్డి, కార్యక్రమ అధికారి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మాధవన్ జీ హాస్పిటల్‌లో నర్సింగ్ కాలేజ్ ప్రారంభం



**మహేశ్వరం, నవంబర్ 12 (జనం సాక్షి) :** అవేర్ మాధవన్ జీ సూపర్ స్పెషాలిటి హాస్పిటల్స్ కు అనుబంధంగా మాధవన్ జీ కాలేజీ ఆఫ్ నర్సింగ్,మాధవన్ జీ కాలేజీ ఆఫ్ ఫిజియోథెరపీ కాలేజీలో సంవత్సరానికి 50 మంది విద్యార్థులను చేర్చుకుంటామని మాధవన్ జీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ తరుణ్ అన్నారు.ఈ సందర్భంగా తరుణ్ మాట్లాడుతూ...నాలుగు సంవత్సరాల కోర్సులో 200 మంది విద్యార్థులు కళాశాలలో నర్సింగ్ విద్యను నేర్చుకుని మంచి ఉద్యోగాలను సంపాదించుకోవచ్చాన్నారు.దేశంలో 100 మంది నర్సులకు 30 మంది నర్సులు మాత్రమే ఉన్నారన్నారు. మాధవన్ జీ కాలేజీ ఆఫ్ నర్సింగ్ లో చేరబోయే వారు 10o2 చదివి ఉండాలన్నారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఇంగ్లీష్ సబ్జెక్టులలో ఉత్తీర్ణత పొందిన వారిని మాత్రమే చేర్చుకుంటామన్నారు.నర్సింగ్ కోర్సులో అమ్మాయిలకు మాత్రమే అవకాశం ఉందన్నారు.ఒక్కొక్క సబ్జెక్టులో కనీసం 45 మార్కులు వచ్చి ఉండాలన్నారు.17 సంవత్సరాల వయస్సు పైబడినవారు చేరవచ్చున్నారు. ఎస్సీ,ఎస్టీ,ఓబీసీ విద్యార్థులకు రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. నర్సింగ్ నేర్చుకోవాలని ఆసక్తి కలిగిన అమ్మాయిలు తక్షణమే అవేర్ భగవతిపురంలోని మాధవన్ జీ హాస్పిటల్‌ను సందర్శించాలన్నారు.

## 2026 జూలైలో గ్లోబల్ టెక్స్‌టైల్ మెగా ఈవెంట్ భారత్ టెక్స్-26



**ఖైరతాబాద్, నవంబర్ 12 (జనం సాక్షి) :** భారత్ టెక్స్ ట్రేడ్ ఫెడరేషన్(బీటీటీఎఫ్) ఆధ్వర్యంలో 2026 జూలై 14 నుండి 17 వరకు న్యూఢిల్లీలోని ఐకానిక్ భారత్ మండపంలో దేశంలోని ప్రముఖ గ్లోబల్ టెక్స్‌టైల్స్, అపెరల్ ఈవెంట్ భారత్ టెక్స్ యొక్క మూడవ ఎడిషన్‌ను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోందని బీటీటీఎఫ్ చైర్మన్ నరేన్ గోయెంకా తెలిపారు. బుధవారం భారత్ టెక్స్ ట్రేడ్ ఫెడరేషన్(బీటీటీఎఫ్) ప్రముఖ ఎగుమతి ప్రోత్సాహక మండలి(ఈపీసీలు), పరిశ్రమ సంఘాల కన్సార్టియం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నరేన్ గోయెంకా మాట్లాడుతూ రాబోయే ఎడిషన్ యొక్క విజన్, స్కేల్, ముఖ్య ముఖ్యాంశాలను వివరించారు. భారత్ టెక్స్ 2026 కోసం సన్నాహాలను అధికారికంగా ప్రారంభించినట్లు తెలిపారు. భారత్ టెక్స్ యొక్క మొదటి 2 ఎడిషన్‌లు ఇప్పటికే భారతదేశ గ్లోబల్ మెగా టెక్స్‌టైల్స్ ఈవెంట్‌గా దాని స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాయని తెలిపారు.

# జర్నలిస్టుల సంక్షేమమే టీడబ్ల్యూజేఎఫ్ ధ్యేయం

- వర్కింగ్ జర్నలిస్టులకు అండగా ఫెడరేషన్
- హక్కుల సాధనకు ఉద్యమంలా పోరాడుదాం
- జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శేరిబాయి గణేష్, యం. సైదులు

**శంకర్‌పల్లి, నవంబర్ 12 (జనం సాక్షి) :** జర్నలిస్టుల సంక్షేమమే టిడబ్ల్యూజేఎఫ్ ధ్యేయం అని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు శేరిబాయి గణేష్, మైల సైదులు అన్నారు. బుధవారం చేవెళ్ల నియోజకవర్గం పరిధిలోని శంకర్‌పల్లి మండల కేంద్రంలో టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా విస్తృతస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా మూడవ మహాసభలో తీసుకున్న తీర్మానాలను జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ప్రధాన ఎజెండా అంశాలుగా చేర్చుకొని సుదీర్ఘంగా వాటిపై చర్చించారు. మహాసభ తీర్మానాలపై జర్నలిస్టులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.వర్కింగ్ జర్నలిస్టుగా పని చేస్తున్న వారికి దక్కాల్సిన అక్రిడేషన్ కార్డులు పక్కదారి పట్టకుండా పకడ్బందీగా వ్యవహరించాలని తెలిపారు.జర్నలిస్టులకు ఎలాంటి ఆపద ఉన్నా సరైన సమయంలో స్పందించి యూనియన్ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. జర్నలిస్టుల పిల్లలకు రాయితీతో కూడిన విద్య అందించేందుకు మరింతగా కృషి చేయాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. అంతేకాకుండా ముఖ్యంగా ఎంతో కాలంగా పెండింగ్లో ఉన్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు సమస్యలను పరిష్కరించే దిశగా భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని స్పష్టం చేశారు. జర్నలిస్టులకు హెల్త్ కార్డులు, ప్రత్యేక రక్షణ చట్టాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం 43 మందితో జిల్లా పూర్తి స్థాయి కమిటీని



జిల్లా కార్యదర్శి మైల సైదులు ప్రకటించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంఘం కోశాధికారి శ్రీనివాస్ చారి, చేవెళ్ల డివిజన్ అధ్యక్షులు సిహెచ్ రాజు,ప్రధాన కార్యదర్శి జై చంద్ర, జిల్లా ఉపాధ్యక్షులు ఎం రాజశేఖర్,జిల్లా కార్యవర్గ సభ్యులు,జిల్లా కమిటీ సభ్యులు, నియోజకవర్గం అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు ఉన్నారు.

జనంసాక్షి www.janamsakshi.org | గురువారం 13 నవంబర్ 2025

# ఖమ్మంలో జరిగే సీపీఐ బహిరంగ సభను జయప్రదం చేయండి

- ఈ నెల 17న సిద్దిపేట జిల్లాకు సీపీఐ ప్రచార జాతా రాక
- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్



**చేర్యాల, నవంబర్ 12 (జనంసాక్షి) :** పీడిత తాడిత ప్రజల జీవితాలకు భరోసా కల్పించేందుకు దేశ స్వాతంత్ర్యని కంటే ముందే ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శత జయంతి ఉత్సవాల ముగింపు బహిరంగ సభ డిసెంబర్ 26న ఖమ్మం కేంద్రంగా జరగనుందని ఈ బహిరంగ సభను జయప్రదం చేసేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ పిలుపునిచ్చారు. శత జయంతి ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారత గడ్డపై కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి ఈ డిసెంబర్ 26వ తేదీ నాటికి వందేళ్లు పూర్తి అవుతుందని, భారతక మ్యూనిస్టు పార్టీ స్వాతంత్ర సంగ్రామంలో బానిస సంకెళ్ళ నుండి భరత మాత విముక్తి కోసం కమ్యూనిస్టు కార్యకర్తలు అలుపెరగని పోరాటాలు చేశారని అన్నారు. భగత్ సింగ్ లాంటి యువ కిషోరాలు నమ్మిన సిద్ధాంతం కోసం ఉరి కొయ్యలను ముద్దాడారని గుర్తు చేశారు. ఆనాటి నుండి నేటి వరకు పీడిత ప్రజల పక్షాన నిలబడింది ఎర్రజెండా నేనని, ఎర్రజెండాల పని అయిపోయిందని అవహేళన చేసిన వారికి ఈ శతవసంత ఉత్సవాల బహిరంగ సభ ఒక గుణపాఠం కావాలని అన్నారు. 40 దేశాల నుండి కమ్యూనిస్టు పార్టీల ప్రతినిధులు, మేధావులు కవులు కళాకారులు ఉత్సవ ముగింపు సభకు తరలివస్తున్నారని, ఈ బహిరంగ సభను మరింత ఎరుపెక్కించేందుకు తమ తమ ప్రాంతాల నుండి కమ్యూనిస్టు పార్టీ నాయకులు కార్యకర్తలు సానుభూతిపరులు వేలాదిగా తరలి రావాలని పిలుపునిచ్చారు. 5 లక్షల మందితో ఖమ్మం కేంద్రంగా జరిగే ఉత్సవాల ముగింపు సభ దేశానికే గర్వకారణం కానుందని, ఎర్ర జెండా నీడలో అమరులైన ప్రతి ఒక్కరికి ఈ శతవసంత ఉత్సవం అంకితం కావాలని ఆకాంక్షించారు. డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే శత ఉత్సవాలు ముగింపు బహిరంగ సభ జయప్రదం చేయాలని కోరుతూ ఈనెల 17,18న సిద్దిపేట టౌన్, కోహెడ, హుస్నాబాద్ ప్రాంతాలకు సిపిఐ ప్రచార జాత రానున్నట్లు ఈ జాతకు సీపీఐ మాజీ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శి మంద పవన్ లు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఈరి భూమయ్య, జంగిలి యాదగిరి, కత్తుల భాస్కర్ రెడ్డి, నంగి కనకయ్య, పొన్నబోయిన మమత, సుంకోజు రజిత, గూడెపు సుదర్శన్, పొన్నబోయిన మహేందర్, ఆత్మకూరి హరిక్రిష్ణ, శ్రీరాం మహేష్, సీతారాములు, ప్రేమ్ కుమార్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## సారంబండ తండాలో నాణ్యతలేని బీటీ రోడ్డు పనులు

- నాణ్యతగా చేపట్టాలని తండావాసులు డిమాండ్



**చారకొండ, నవంబర్ 12 (జనంసాక్షి) :** మండలంలోని సారంబండ తండా దొంతులగుట్ట తండా వరకు చేపట్టిన బీటీ రోడ్డు పనులు పూర్తిగా నాసిరకంగా చేపడుతున్నారని తండావాసులు వాపోయారు.మంగళవారం సారంబండ తండా నుంచి దొంతులగుట్ట తండా ఒక కిలోమీటర్ రూ.80 లక్షల వ్యయంతో రోడ్డు పనులు ప్రారంభించారు.రోడ్డు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పూర్తిగా నాసిరకంగా చేపట్టారు.రోడ్డు పనులు నాణ్యతగా చేపట్టాలని తండావాసులు డిమాండ్ చేస్తున్నారు.సంబంధిత అధికారులకు చెప్పిన ఏమాత్రం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి బీటి రోడ్డు పనులు నాణ్యతగా చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తామని తండావాసులు హెచ్చరించారు.

## కోవిడ్ బాధిత పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలి

- పీఎం కేర్ చిల్డ్రన్స్‌తో కలెక్టర్ సమీక్ష



**నారాయణపేట జిల్లా బ్యూరో, నవంబర్ 12 (జనం సాక్షి) :** కోవిడ్ - 19 కారణంగా తల్లిదండ్రులు చనిపోయి అనాథలైన పిల్లలకు కింద ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సమీక్షలో భాగంగా బుధవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ కలెక్టరేట్ లోని తన ఛాంబర్‌లో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వర్ తో కలిసి నారాయణపేట జిల్లాలో పీఎం కేర్ లో ఉన్న ఇద్దరు పిల్లలకు సంబంధించి సమీక్ష జరిపారు.ఈ సమీక్షలో ప్రస్తుతం ఆ ఇద్దరు పిల్లల ఆరోగ్యం, విద్య , రక్షణకు సంబంధించిన అంశాలపై స్వయంగా ఆ పిల్లలనే అడిగి తెలుసుకున్నారు. వారి యోగ క్షేమాల గురించి అడిగారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా? ప్రస్తుతం ఏం చదువుతున్నారు..? చదువుపై వారికి ఉన్న ఆసక్తిని గమనించారు. అలాగే పి.ఎం.కేర్స్ కింద పిల్లలకు వస్తున్న బెనిఫిట్స్ కి సంబంధించి జిల్లా కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్ లో గల జిల్లా కలెక్టర్, చైల్డ్ పేర్ల పై ఉన్న ఉమ్మడి ఖాతాలను ఒకసారి చెక్ చేయమని, పిల్లల తండ్రి పేరు మీద ఉన్న పట్టా భూమిని పిల్లల పేర్లపై పట్టా అయ్యేలా చూడమని,స్పాన్సర్షిప్ యొక్క గైడ్ లైన్స్ ను అనుసరించి పిల్లలకు డీ సీ పీ వో కరిష్మా కు సూచించారు. స్పాన్సర్షిప్ ఇచ్చే అవకాశాలు ఉంటే చూడాలని, తరచుగా పిల్లల రక్షణకు సంబంధించి ఫాలోఅప్ చేస్తూ పిల్లల స్టేటస్ ను అప్ డేట్ చేయాలని డి.సి.పి.ఓ.ను ఆదేశించారు.

## త్వరలో పేట పట్టణంలో ప్రభుత్వ వైద్య సేవలు



**నారాయణపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 12 (జనం సాక్షి) :** నారాయణపేట పట్టణ ప్రజలకు అందుబాటులో వైద్యసేవలు అందించాలనే ఉద్దేశ్యంతో ఎమ్మెల్యే డాక్టర్.చిట్టెం.పర్ణిక రెడ్డి రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ అధికారులతో మాట్లాడి ఆసుపత్రి ఏర్పాటు చేయించడంతో పట్టణ ప్రజలకు త్వరలో వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.గత కొన్ని నెలల క్రితం పట్టణంలో ఇంటిగ్రే టెడ్ మార్కెట్ భవనములో వైద్య సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో ఎమ్మెల్యే డాక్టర్.చిట్టెం.పర్ణిక రెడ్డి మాట్లాడిన,హాస్పిటల్ నిర్వహణకు ఇంటిగ్రేటెడ్ మార్కెట్ స్థలం అణువుగా లేదని నివేదించడంతో 'పేట' పట్టణంలోని ప్రభుత్వ చిల్డ్రన్స్ హాస్పిటల్ లోనే వైద్య సేవలు అందించేందుకు ఎట్టకేలకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.అతి త్వరలో పట్టణ ప్రజలకు వైద్య సేవలు ప్రారంభిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.అందులో భాగంగా ఎమ్మెల్యే డాక్టర్.చిట్టెం.పర్ణిక రెడ్డి ఆదేశాల మేరకు ఎమ్మెల్యే వ్యక్తిగత పి.ఏ చిట్టెం.మాధవ్ రెడ్డి,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండి.సలీం,సీనియర్ నాయకులు గందే. చంద్రకాంత్, మార్కెట్ డైరెక్టర్ బోయ శరణప్ప,సతీష్ గౌడ్ లతో కలిసి బుధవారం వైద్యఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి బిక్షపతి,డాక్టర్. కె.మల్లికార్జున్ పట్టణంలోని పాత బస్టాండ్ దగ్గర ఉన్న ప్రభుత్వ చిల్డ్రన్స్ హాస్పిటల్ భవన సముదాయాన్ని పరిశీంచారు.రాబోయే పక్షం రోజుల్లో ఈ చిల్డ్రన్స్ హాస్పిటల్ ప్రారంభయించడం జరుగుతుందని,హాస్పిటల్ లో రోజువారీగా ముగ్గురు ఎంబిబిఎస్ డాక్టర్లతో ఓ.పి వైద్య సేవలు మరియు పెషెంట్ లకు అవసరమైన మందులు అందించడం జరుగుతుందని, అదేవిధంగా అవసరమైన వారికి రక్త పరీక్షలు కూడా చేయడం జరుగుతుందని తెలిపారు.అదేవిధంగా రాత్రి వేళల్లో అత్యవసర సేవలు అందించే విధంగా డాక్టర్లు ప్రతి రోజు ఈ హాస్పిటల్ లో అందుబాటులో ఉంటారని ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు.వైద్య సేవలు ప్రారంభించేందుకు గాను యుద్ధప్రతిపదికన అన్ని మౌలిక వసతులు సమాకుర్చడం కోసం అధికారులు చర్యలు చేపట్టినట్లు వారు తెలిపారు.

## రైతులు నష్టపోకుండా నిబంధనల ప్రకారం పత్తి కొనుగోలు చేయాలి

- గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్



**గద్వాల నడిగడ్డ, నవంబర్ 12 (జనం సాక్షి) :** సీసీఐ నిబంధనల ప్రకారం రైతులు పత్తి ఆరబెట్టుకుని వచ్చేలా సంబంధిత ఏఈఓలు అవగాహన కల్పిస్తే, రైతులు నష్టపోకుండా పత్తి కొనుగోలు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ అన్నారు. బుధవారం అలంపూర్ చౌరస్తా సమీపంలో ఉన్న వరసిద్ధి వినాయక జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. సీసీఐ నిబంధనల ప్రకారం 8 నుంచి 12 శాతం లోపు తేమ ఉన్న పత్తిని కొనుగోలు చేస్తున్నందున రైతులు దాని ప్రకారం ఆరబెట్టుకుని తీసుకురావాలని సూచించారు. ప్రస్తుతం స్లాట్ బుకింగ్ విధానంలో ఎకరాకు ఏడు క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేస్తుండగా,12 క్వింటాళ్లు కొనుగోలు చేయాలని, అకాల వర్షాలతో పత్తి దెబ్బతినడంతో తేమ ఎక్కువగా ఉన్న కొనాలని పలువురు రైతులు కలెక్టర్ ను కోరారు. ఇటీవలే ఈ విషయాన్ని వ్యవసాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లామని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ వాహనాల్లో రైతులు అమ్మేందుకు తీసుకొచ్చిన పత్తిని పరిశీలించి, అధికారులతో మాట్లాడారు.అనంతరం కలెక్టర్ జిన్నింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ పర్యటనలో జిల్లా మార్కెటింగ్ అధికారిని పుష్పమ్మ,జిల్లా కో-ఆపరేటివ్ అధికారి శ్రీనివాస్,సిసిఐ అధికారి రాహుల్ కలాన, తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం

- గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్



**గద్వాల నడిగడ్డ, నవంబర్ 12 (జనం సాక్షి) :** విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ తెలిపారు. బుధవారం ఉండవెల్లి మండలం బొంకూరు గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడి డిజిటల్ స్క్రీన్ల ద్వారా బోధించే పాఠ్యాంశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. యు డైస్ ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని, పాఠశాల నిధులను నిబంధనల ప్రకారం ఖర్చు పెట్టాలన్నారు.పాఠశాల తరగతి గదిలోనే అంగన్వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తుండడంతో త్వరలోనే కేంద్రానికి పక్కాభవనం నిర్మించాలని సంబంధిత అధికారులతో మాట్లాడారు. పాఠశాలలో గ్రంథాలయ,సమాచార, క్రమశిక్షణ, ఆరోగ్య, ఫుడ్ కమిటీల పనితీరును అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో నెలలోగా ఇంటర్నెట్ కనెక్షన్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.అనంతరం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులతో కలిసి కలెక్టర్ మొక్క నాటారు. ఈ పర్యటనలో విద్యాశాఖ ఏపిఓ శ్రీనివాసులు, పాఠశాల జిహెచ్ఎం మద్దిలేటి, పంచాయతీ సెక్రెటరీ రజియా బేగం, తదితరులు పాల్గొన్నారు.

## మినీ ట్యాంక్ బండ్ పనులను వేగవంతం చేయాలి



**మక్తల్, నవంబర్ 12 (జనంసాక్షి) :** మక్తల్ పట్టణానికి పర్యాటక శోభను తీసుకురానున్న మినీ ట్యాంక్ బండ్ సుందరీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి అధికారులను ఆదేశించారు. బుధవారం మంత్రి వాకిటి శ్రీహరి పట్టణంలోని మినీ ట్యాంక్ బండ్ ప్రాంతాన్ని సందర్శించి, అధికారులతో కలిసి జరుగుతున్న నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సుందరీకరణ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం రూ.3 కోట్ల 75 లక్షల నిధులను కేటాయించింది. పనుల పరిశీలన అనంతరం మంత్రి మాట్లాడుతూ ట్యాంక్ బండ్ వద్ద నిర్మించాల్సిన కీలక వసతుల గురించి ప్రస్తావించారు. యాత్రికుల సౌకర్యార్థం విశ్రాంతి భవనాలు, కాటేజీలు, టాయిలెట్లు నిర్మించాల్సి ఉందని తెలిపారు. అదే విధంగా వ్యాపార కార్యకలాపాలను ప్రోత్సహించేందుకు వ్యాపార సముదాయాలు, ప్లస్ వన్ కాంప్లెక్స్‌తో పాటు 12 దుకాణాలను నిర్మించాల్సి ఉందని మంత్రి పేర్కొన్నారు. అలాగే, దూర ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులు విశ్రాంతి తీసుకునేందుకు వీలుగా 12 బెడ్ల సదుపాయాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు.ఈ పనుల పర్యవేక్షణలో ఇంజినీర్ నాగ శివ, స్థానిక పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

- మంత్రి జూపల్లి కృష్ణారావు



**కొల్లాపూర్/ నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, నవంబర్ 12 (జనంసాక్షి) :** మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం జిల్లాలోని కేంద్ర మత్స్యశాఖ సంయుక్త కార్యదర్శి నీతూ కుమారి ప్రసాద్,తెలంగాణ రాష్ట్ర మత్స్య శాఖ కమిషనర్ నిఖిల,నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, తో కలిసి మంత్రి జూపల్లి కృష్ణారావు సోమశిల వద్ద శ్రీశైలం బ్యాక్ వాటర్ కృష్ణా నదిలో లక్ష చేప పిల్లలను వదిలారు.ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని100 శాతం సబ్సిడీతో అమలు చేస్తోందని అన్నారు. అలవి వలలతో చిన్న చేప పిల్లలు పడిపోవడం వలన మత్స్య సంపదకు తీవ్ర నష్టం కలుగుతోందని, అటువంటి చర్యలకు కఠిన శిక్షలు విధిస్తామని ఆయన స్పష్టం చేశారు. చేప పిల్లల సైజు బాగుండేలా, నాణ్యమైన చేప పిల్లలనే మత్స్యశాఖ అధికారులు పంపిణీ చేయాలని మంత్రి సూచించారు.మత్స్యకారుల అభివృద్ధి కోసం ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల ద్వారానే రైతుకు మద్దతు ధర

- పాక్స్ చైర్మన్ వెంకట్ రాం రెడ్డి



**శివ్వంపేట, నవంబర్ 12 (జనంసాక్షి) :** ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారానే రైతుకు మద్దతు ధర లభిస్తుందని శివంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ చింతల వెంకట్ రాంరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలోని శభాష్ పల్లి, కొత్తపేట్ గ్రామాల్లో పర్యటించి సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తొందరపడి ప్రవేట్ వ్యాపారులకు ధాన్యాన్ని అడ్డగోలు రెట్లు అమ్ముకోవద్దని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వం కల్పించిన మద్దతు ధర పొంది, ఆర్థికంగా లాగుపడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాక్స్ సీఈఓ మధు యాదవ్, పాక్స్ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, పాక్స్ డైరెక్టర్ బల్వంత్ రెడ్డి, మాజీ సర్పంచ్ పార్వతి సత్యం, సాన్వి రమాకాంత్ రెడ్డి, నాయకులు భరత్ రెడ్డి లతో పాటు ఆయా గ్రామాల రైతులు, నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ప్రాథమిక విద్య కీలకం

మండల విద్యాధికారి రాములు



**నిజాంపేట్, నవంబర్ 12 (జనం సాక్షి) :** నిజాంపేట్ మండలంలోని రామ్ రెడ్డి పేట్ గ్రామంలోని ప్రథమికోన్నత పాఠశాలను బుధవారం మండల విద్యాధికారి రాములు అకస్మతిగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లు పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని వివరాలను తెలుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో ఉపాధ్యాయులు బోధించే బోధన విద్యార్థులకు కీలకమన్నారు. విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భూమయ్య, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయురాలు, తదితరులు పాల్గొన్నారు.

# వరిధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి



**వనపర్తి బ్యూరో, నవంబర్ 12 (జనం సాక్షి) :** వరి కొనుగోలు కేంద్రాలకు రైతులు తెచ్చిన ధాన్యంలో నిర్దేశించిన తేమ శాతం వచ్చిన వెంటనే కేటాయించిన మిల్లుకు ధాన్యాన్ని లోడ్ చేసి తరలించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ వనపర్తి మండల పరిధిలోని పెద్దగూడెం తండా పరిధిలో ఏర్పాటుచేసిన ఐకెపి వరి కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ రైతులు ఆర పోసుకున్న వరి ధాన్యం యొక్క తేమ శాతాన్ని కలెక్టర్ పరిశీలించారు. పీపీసీ కేంద్రానికి ధాన్యం తెచ్చిన రైతుల రిజిస్టర్ను పరిశీలించిన కలెక్టర్ ఎంతమంది రైతులు వచ్చారు,ఎంతమంది ధాన్యంలో నిర్దేశించిన తేమ వచ్చిందని పరిశీలించారు.కలెక్టర్ మాట్లాడుతూ రైతులు తెచ్చిన ధాన్యంలో నిర్దేశించిన తేమ శాతం రావడంతో కేటాయించిన మిల్లుకు లోడ్ చేసి పంపించాలని సూచించారు.కొనుగోలు కేంద్రం నిర్వాహకులు నిబంధనల ప్రకారమే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆదేశించారు. కాలిపర్స్ ద్వారా సన్నధాన్యం,దొడ్డు రకం వరి ధాన్యాన్ని పకడ్బందీగా గుర్తించాలని నిర్వాహకులకు సూచించారు. కొనుగోలు కేంద్రానికి వచ్చే రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు.
ఈ సందర్భంగా అక్కడే ఉన్న పలువురు రైతులు గత సీజన్ కు సంబంధించిన వరి ధాన్యం బోనస్ డబ్బులు ఇంకా రాలేదని కలెక్టర్ ను కోరగా, త్వరలోనే బోనస్ డబ్బులు ప్రభుత్వం రైతుల ఖాతాల్లో వేయడం జరుగుతుందని కలెక్టర్ తెలియజేశారు. డిసిఎస్ కాశి విశ్వనాథ్, డిపిఎం ప్రభాకర్, తహసిల్దార్ రమేష్ రెడ్డి, ఎంపీడీవో, ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.



# విద్యార్థులు జిల్లాకు పేరు తేవాలి

- కేంద్రాల నిర్వహణ పక్కాగా ఉండాలి
- అధికారులు నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**బచ్చన్నపేట, నవంబరు 12 (జనంసాక్షి) :** విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై చర్యలు తప్పవని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు. బుధవారం మండలంలోని పలు కేంద్రాలను తనిఖీ చేశారు. తమ్మడపల్లి పిఎసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి తేమ శాతం వచ్చిన ధాన్యం ను వెంటనే కొనాలనీ ఆలస్యం చేస్తే చర్యలు తప్పవని ఉన్నారు. ధాన్యం తెచ్చిన రైతులు కూడా వారి ధాన్యన్ని ఆరబెట్టుకొని తేమ శాతం రాగానే త్వరగా కొనుగోలు అయ్యేలా కేంద్రాలలోనే అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం బచ్చన్నపేట ఐకేపీ కేంద్రాన్ని పరిశీలించి రిజిస్టర్ సక్రమంగా లేదని నిర్వాహకుల పైన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. రిజిస్టర్ లను సక్రమంగా నిర్వహించని ఆగ్రహం వ్యక్తపరిచి వారిపై చర్యలకు ఆదేశించారు. కేజీవీబీ కి వెళ్లి స్టాఫ్ తో మాట్లాడి మెనూ ప్రకారం మధ్యాహ్నం భోజనం పెడుతున్నరా లేదా అని అడిగి తెలుసుకుని పదవ తరగతికి సంబందించి సిలబస్ ఎంత వరకు వచ్చింది పరీక్షలకు సంబందించిన యాక్షన్ ప్లాన్ గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడుతూ వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. పదవ తరగతి పరీక్షలకు ఇప్పటి నుండే ఒక షెడ్యూల్ పెట్టుకొని చదవాలని మీరు బాగా చదివి మార్కులు తెచ్చుకుంటేనే జిల్లా కి మంచి పేరు తేవాలన చదువు ఆరోగ్యం ముఖ్యమని విద్యార్థులకు తెలిపారు. పీహెచ్ సి ని సందర్శించి స్టాఫ్ హాజరు ను, అలాగే వివిధ రకాల టీకాల,మందుల నిల్వ లను పరిశీలించారు. చలి తీవ్రత నేపథ్యంలో ఓపికి వచ్చే ప్రతీ ఒక్కరికి రక్త పరీక్షలు చేయాలనీ సూచించారు. పెషేంట్ లతో మాట్లాడి పీహెచ్ సి లో అందుతున్న వైద్యం గురించి తెలుసుకున్నారు. డాక్టర్ లు సమయానికి వస్తున్నారా. బాగా చూస్తున్నారా. భోజనం ఎలా ఉంటుంది అని రోగులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ కార్యాలయనికి వెళ్లి రెవిన్యూ పరంగా ఎలాంటి పెండింగ్ లేకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో మండల తహసీల్దార్, సివిల్ సప్లై, మార్కెటింగ్, మెడికల్ అధికారులు పాల్గొన్నారు

# రాష్ట్రంలో విద్యావ్యవస్థను బలోపేతం చేస్తున్నాం

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద



**మంచిర్యాల ప్రతినిధి, నవంబర్ 12 (జనంసాక్షి) :** రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని రాష్ట్ర కార్మిక మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. బుధవారం మంచిర్యాల జిల్లాలోని జైపూర్ మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో నూతనంగా నిర్మించిన జూనియర్ కళాశాల గదులను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి మాట్లాడుతూ....ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకుని విద్యార్థులు ఏకాగ్రతతో విద్య అభ్యసించాలని, ఉన్నత స్థాయిలో రాణించాలని తెలిపారు. విద్య ఎంతో శక్తివంతమైనదని, క్రమశిక్షణతో చదువుకుంటే భవిష్యత్తు బంగారు మయమవుతుందని తెలిపారు. ప్రభుత్వం రాష్ట్రంలో విద్యావ్యవస్థను బలోపేతం చేస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను అభివృద్ధి చేసి సకల సౌకర్యాలతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై చదువుకోవడమే కాకుండా తమ తల్లిదండ్రులకు సహాయంగా నిలవాలని, విద్యతోపాటు క్రీడారంగంలో రాణించాలని తెలిపారు. సాఫ్ట్, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలని, తద్వారా ఆత్మవిశ్వాసం కలుగుతుందని, క్రమశిక్షణతో మంచి నైపుణ్యం పొందాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు ప్రభుత్వం 51 వేల మంది ఉపాధ్యాయులను నియమించినది తెలిపారు. పాఠశాలలలో అవసరమైన ఫర్నిచర్, ఉపాధ్యాయులు, మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో కల్పిస్తుందని తెలిపారు. 2.5 కోట్ల రూపాయల సి ఎస్ ఆర్ నిధులతో అదనపు గదులు నిర్మించడం జరిగిందని, రామకృష్ణాపూర్ లోని గురుకుల పాఠశాలలో 30 లక్షల రూపాయల ఎస్ డి ఎఫ్ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు 15 రోజులలో ప్రతిపాదనలు అందించాలని, విద్యార్థులకు చదువుకునేందుకు మంచి వాతావరణం కల్పించాలని తెలిపారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని వాటిని సాధించే దిశగా పట్టుదలతో కృషి చేయాలని తెలిపారు. ఉపాధ్యాయులు తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించి విద్యలో అభివృద్ధి చెందేలా కృషి చేయాలని తెలిపారు.

అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... ప్రభుత్వం వైద్య, విద్యా రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు అవసరమైన త్రాగునీరు, విద్యుత్, ప్రహరీ గోడ, విద్యార్థినీ విద్యార్థులకు వేరువేరుగా మూత్రశాలలు ఇతర సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందిస్తుందని తెలిపారు. 2.5 కోట్ల రూపాయల నిధులతో చేపట్టిన జూనియర్ కళాశాల అదనపు గదులలో తరగతి గదులు, పరిపాలనా విభాగం, ల్యాబ్ ఇతర సదుపాయాలు కల్పించడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య 3 శాతం పెరిగిందని, ఈ విద్యా సంవత్సరంలో 6 వేల నుండి 7 వేల మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల నుండి ప్రభుత్వ పాఠశాలలలో చేరారని తెలిపారు. జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో ఆశ్రమ పాఠశాల అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందని, కోటపల్లి మండలంలోని ఆశ్రమ పాఠశాలలో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. భీమారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, చెన్నూర్ బాలికల ఆశ్రమ పాఠశాల లలో పనులు జరుగుతున్నాయని, జైపూర్ లోని ఎస్. సి. సంక్షేమ వసతి గృహం కొరకు సి.ఎస్.ఆర్. నిధులు మంజూరయ్యాయని తెలిపారు. జిల్లాలో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల పనులు పురోగతిలో ఉన్నాయని, త్వరగా పూర్తి చేసే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రతి రోజు వారు పాఠశాలకు హాజరయ్యేలా పర్యవేక్షించాలని తెలిపారు. జిల్లాలోని కస్తూరిబా బాలికల విద్యాలయంలో విద్య అభ్యసించి ఎం. బి. బి. ఎస్. సీటు సాధించడం అభినందనీయమని, ఈ విషయాన్ని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకొని చదువులో రాణించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో చదువుకునేందుకు ప్రతి ఒక్కరికి అవకాశం ఉందని, సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



# గ్రంథాలయ సమస్యలు పరిష్కరించాలని ఆందోళన

**బెల్లంపల్లి, నవంబర్ 11, (జనంసాక్షి) :** బెల్లంపల్లి పట్టణంలోని శాఖ గ్రంథాలయంలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం పాఠకులు ఆందోళన చేపట్టారు. బెల్లంపల్లి సబ్ కలెక్టర్, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినతిపత్రాలు అందజేశారు. గ్రంథాలయ సిబ్బంది సమయపాలన పాటించడం లేదని, ఇష్టారీతిన విధులకు హాజరువుతున్నారని, ప్రశ్నిస్తే ఎవరికి పిర్యాదు చేసుకుంటారో చేసుకొండని నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తు, దురుసుగా ప్రవర్తిస్తున్నారని వారు తెలిపారు. బిల్లులు రావడం లేదనే సాకుతో తాగునీరు కూడా తెప్పించడం లేదని, పాఠకులమే డబ్బులు జమచేసి తాగునీటిని తెప్పించుకుంటున్నామని వివరించారు. పట్టణంలోని గ్రంథాలయం పనివేళలు మార్చాలని ఉదయం 8 నుంచి రాత్రి 8 వరకు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు విన్నవించుకున్నా వారు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రంథాలయంలో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# యువత వివేకానందుని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ ప్రతినిధి, నవంబర్ 12 (జనంసాక్షి):** నేటి యువతరం స్వామి వివేకానంద ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి అన్నారు. బుధవారం వరంగల్ నగరంలోని పోతన ఆడిటోరియంలో జిల్లా యువజన,క్రీడల శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యువజన ఉత్సవాలలో భాగంగా స్వామి వివేకానందుని జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి లు పాల్గొని వివేకానందుని చిత్రపటానికి పూల మాలలు సమర్పించి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద యువతి యువకులను ఉద్దేశించి మాట్లాడుతూ యువత దేనికి భయపడకూడదని, ప్రతి సమస్యను ధైర్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులను గౌరవించి ప్రేమ చూపాలని, యువతీ యువకుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని , ఈ క్రీడల్లో పోటీల్లో పాల్గొనే పిల్లల్లో ఆత్మస్థిత్యం ఎక్కువగా ఉంటుందని, విద్యార్థి దశ నుండి క్రీడలు పిల్లలకు ఎంతో మేలుచేశాయని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.క్రీడల్లో గెలుపొందిన పిల్లలకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేయడం జరిగింది.చదువుతోపాటు ఆటలు.. పోటీల్లో రాణించాలని దాని వలన మనసుకేంతో ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని ఇస్తాయని, ఇక్కడ గెలిచిన యువతి యువకులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి వరంగల్ కి కీర్తి కిరీటాన్ని నిలబెట్టా లని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ జి సంధ్యారాణి జిల్లా యువజన, క్రీడల అధికారి అనిల్ కుమార్, ప్రిన్సిపాల్ భుజంగారెడ్డి సైన్స్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, జాతీయ యువజన అవార్డు గ్రహీత శ్రీకాంత్ మరియు జాతీయ జానపద కళాకారుడు ఆకులపల్లి కరుణాకర్ రాజేందర్ మౌనికలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి నాగేష్, రాజేందర్ రెడ్డి, చిరంజీవిలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

# భూ తగాదాలో గొడ్డలి, కర్రలతో దాడి



**బెల్లంపల్లి, నవంబర్ 12, (జనంసాక్షి) :** భూ తగాదాలో ఇద్దరిపై గొడ్డలి, కర్రలతో దాడి చేసిన సంఘటన బెల్లంపల్లి నియోజకవర్గం నెన్నెల మండలం మైలారం గ్రామంలో చోటుచేసుకుంది. నెన్నెల ఎస్సై కే ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం మైలారం గ్రామంలో కొమ్ము రాజేష్, కొమ్ము రామక్క ఉదయం ఇంటి వెనకాల పెరట్లో బ్రష్ చేసే సందర్భంలో అదే గ్రామానికి చెందిన కొమ్ము నాగయ్య, కొమ్ము రామక్క వారి కొడుకులు అయిన కొమ్ము మహేష్, కొమ్ము సాయికుమార్ అందరు కలిసి గొడ్డలి, కర్రలతో దాడి చేశారని వివరించారు. కొమ్ము రామక్కను కొడుతున్నారని కేకలు వేయగా, ఆపడానికి వెళ్లిన ఆమె కోడలు భాగ్యలక్ష్మిని కడుపులో తన్నారని చెప్పారు. రామక్కకు కాలుకు గాయంమై కాలు వాపు వచ్చిందని, కొమ్ము రాజేష్ ను ఇష్టం వచ్చినట్టు కర్రలతో కొట్టారన్నారు. అసలు గొడవకు కారణం 2 నెలల క్రితం వారికి భూ సంబంధిత తగాదాలు ఉండగా కోర్టు కొమ్ము రాజేష్ కు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. అట్టి భూమిని రాజేష్ పట్టా చేయించుకున్నాడు. ఈ విషయాన్ని మనస్సులో పెట్టుకోని, వారిపై దాడి చేసి, చంపుతాం అని చూసారని కొమ్ము భాగ్యలక్ష్మి ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రసాద్ వివరించారు.

# అక్రమాలకు పాల్పడుతున్న రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకోవాలి

- ధాన్యం కాంటాలో తరుగు తీసే పేరుతో రైతులను దోపిడీ చేయొద్దు
- సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు పెద్ద ఎత్తున ధర్నా




**హనుమకొండ ప్రతినిధి నవంబర్ 12 (జనం సాక్షి) :** హనుమకొండ జిల్లాలో రైస్ మిల్లర్ల అక్రమాలకు అడ్డుకట్ట వేయడంలో అధికారులు విఫలమయ్యారని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సమస్యల్ని పరిష్కరించడం కోసం అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి ప్రభుత్వాన్ని, జిల్లా కలెక్టర్ ను డిమాండ్ చేశారు. అక్రమాలకు పాల్పడుతున్న రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కార్యదర్శి బిక్షపతి మాట్లాడుతూ గత అనేక సంవత్సరాలుగా జిల్లాలో రైస్ మిల్లులు రైతులను తరుగు,తాలు,రవాణా పేరుతో ఇబ్బందులకు గురిచేయడమే కాకుండా ప్రభుత్వాన్ని కూడా పెద్ద ఎత్తున మోసం చేస్తున్నారని,ఈ విషయంలో అధికారుల నిర్లక్ష్యం వహించడమో లేదా సహకరించడమో చేయకపోతే ఇలా ఎందుకు జరుగుతుందని ప్రశ్నించారు.ధర్నా అనంతరం జిల్లా కలెక్టర్ కు సీపీఐ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, సిరబోయిన కరుణాకర్, జిల్లా నాయకులు మద్దెల ఎల్లేశ్ , ఎదునూరి వెంకటరాజం, నేదునూరి రాజమౌళి, కర్రె లక్ష్మణ్, కొట్టేపాక రవి,మునిగాల బిక్షపతి, జక్కు రాజు గౌడ్, యేషబోయిన శ్రీనివాస్, అలువాల రాజు, రాజేందర్, దొమ్మాటి ప్రవీణ్, జూకంటి పద్మ , కొట్టె వెంకటేష్ పాల్గొన్నారు.

# హనుమకొండ జేఎన్ఎస్‌లో కొనసాగుతున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్



**హనుమకొండ ప్రతినిధి, నవంబర్ 12 (జనంసాక్షి) :** హనుమకొండ లోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో డిడిజి ( స్టేట్స్), జోనల్ రిక్రూటింగ్ ఆఫీస్ చెన్నై,డైరెక్టర్ రిక్రూటింగ్ ఏఆర్ఓ సికింద్రాబాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆర్మీ రిక్రూట్ మెంట్ ర్యాలీలో భాగంగా ఆర్మీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన మూడు జిల్లాలకు చెందిన అభ్యర్థులకు ఆర్మీ అధికారులు ఆర్మీలో ఎంపికకు వివిధ పరీక్షలను బుధవారం నిర్వహించారు.కుమురంభీమ్ ఆసిఫాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబ్ నగర్ జిల్లాలకు చెందిన అభ్యర్థులు 794 ఆర్మీ నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణులు కాగా జేఎన్ఎస్ లో నిర్వహ రిక్రూట్మెంట్ ర్యాలీ ఎంపిక పరీక్షకు 623 హాజరయ్యారు. ఈ సందర్భంగా మూడు జిల్లాలకు చెందిన 623 మంది అభ్యర్థులకు ఆర్మీ అధికారులు రన్నింగ్, ఫిజికల్ ఫిట్ నెస్ పరీక్షలను నిర్వహించి అభ్యర్థుల ఎత్తు, బరువు, ఛాతీ ప్రమాణాలను కొలిచారు. ఆర్మీ రిక్రూట్ మెంట్ ర్యాలీలో పాల్గొంటున్న అభ్యర్థులు నిర్ణీత సమయంలో పరుగును పూర్తి చేసేందుకు ఉత్సాహంగా పరిగెత్తుతున్నారు. ఆర్మీలో చేరడమే లక్ష్యంగా అభ్యర్థులు పోటీ పడుతున్నారు. కాగా మంగళవారం రన్నింగ్, ఫిజికల్ ఫిట్నెస్, పరీక్షల్లో పాల్గొన్న అభ్యర్థులకు బుధవారం మెడికల్ ఎగ్జామ్ నిర్వహించారు.

# ప్రభుత్వం అందించే ప్రతి పైసా ప్రజా ప్రయోజనార్థం వినియోగించాలి

- రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య




**నిర్మల్ రూరల్,నవంబర్12 (జనం సాక్షి) :** ప్రభుత్వం అందించే ప్రతి పైసా ప్రజా ప్రయోజనార్థం వినియోగించాలని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య తెలిపారు.ఆదిలాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం కమిషన్ చైర్మన్ అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశంలో కమిషన్ సభ్యులు రమేష్,కార్యదర్శి కాత్యాయిని దేవి,జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్లు,అదనపు కలెక్టర్లు, స్థానిక సంస్థల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ స్థానిక సంస్థలు ఆర్థికంగా బలోపేతం కావడం ద్వారానే గ్రామీణాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు.గ్రామీణ అభివృద్ధి వేగవంతం కావాలంటే స్థానిక సంస్థల ఆర్థిక స్థితి బలోపేతం కావడం అత్యవసరమని తెలిపారు.నిధుల వినియోగం పారదర్శకంగా,సమర్థవంతంగా ఉండాలని, పంచాయతీలు,మున్సిపాలిటీలు ప్రజల ప్రాథమిక అవసరాలపై దృష్టి పెట్టి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ మార్గదర్శకాల ప్రకారం స్థానిక సంస్థల ఆర్థిక స్థితిగతులను బలోపేతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని చైర్మన్ సూచించారు.అనంతరం ఉమ్మడి జిల్లా పరిధిలోని పంచాయతీల ఆదాయం, వ్యయాల స్థితి,పన్నుల వసూళ్లు,నిధుల వినియోగం,పేదరిక నిర్మూలన,గ్రామీణ గృహనిర్మాణం,విద్యుత్, తాగునీటి సరఫరా, రహదారులు,పారిశుద్ధ్యం వంటి అంశాలపై ఆయా జిల్లాల కలెక్టర్లు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్ర వివరాలు అందజేశారు.ఈ సమావేశంలో భాగంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ నిర్మల్ జిల్లాకు వివిధ శాఖలకు ఆయా రూపాలలో వచ్చిన నిధులు,ఆదాయ వివరాలను ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ కు వివరించారు. జిల్లా గ్రామపంచాయతీ, మున్సిపాలిటీలలో వివిధ మార్గాలలో ఆదాయ పెంపునకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. ప్రజా ప్రయోజనార్థం వినియోగిస్తున్న నిధులకు సంబంధించి, సంబంధిత అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ నిధుల వినియోగం పారదర్శకంగా జరిగేలా చర్యలు చేపట్టామని అన్నారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా కలెక్టర్లు రాజర్షి షా, కుమార్ దీపక్,వెంకటేష్ దోత్రే,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు సోమ రాజేశ్వర్,ఫైజాన్ అహ్మద్, దీపక్ తివారి,పంచాయతీ రాజ్,శాఖ అధికారులు అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# మైబూబ్ హుస్సేన్ జిగర్ అవార్డు గ్రహీతను సన్మానించిన ట్రస్మా అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్



**నిర్మల్ బ్యూరో, నవంబర్12 (జనంసాక్షి) :** రాష్ట్ర మైనార్టీ ఉర్దూ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో రాష్ట్ర మైనార్టీ శాఖ మాత్యులు మహమ్మద్ అజర్ ఒద్దిన్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఉర్దూ అకాడమి చైర్మన్ తాయార్ బిన్ అందాన్ చేతుల మీదుగా నిర్మల్ జిల్లా సియాసత్ ఉర్దూ డైలీ పేపర్ సీనియర్ జర్నలిస్ట్ సయ్యాద్ జలీల్ ఆజార్ అవార్డు తీసుకున్నారు. బుధవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని సియాసత్ జిల్లా కార్యాలయంలో సయ్యద్ జలీల్ అజార్ ని ట్రస్మా నిర్మల్ జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి శ్రీనివాస్ గౌడ్ పూల మాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మోకుదెబ్బ జాతీయ అధ్యక్షులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమరవేణి నర్సాగౌడ్, ట్రస్మా రాష్ట్ర కమిటీ నాయకులు సబ్బర్ అలీ, మోకుదెబ్బ జిల్లా అధికార ప్రతినిధి పీసర శ్రీనివాస్ గౌడ్, మైనార్టీ నాయకులు అజ్మత్ ఖాన్, అర్షద్ అలీ, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారిపై అడ్డంగా గేదెల రాకపోకలు

- ప్రమాదం జరిగితే గాని పట్టించుకోరా..!
- చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న సంబంధిత అధికారులు



**దేవరకొండ, నవంబర్ 12 (జనం సాక్షి) :** కోదాడ – జడ్చర్ల జాతీయ రహదారి పై దేవరకొండ పట్టణంలో నిత్యం వేల సంఖ్యలో వాహనాలు తిరుగుతూ ఉంటాయి. రద్దీగా ఉండే ఈ జాతీయ రహదారిపై పశువులు తిరుగుతూ ఉంటే ప్రమాదాలు జరగడానికి అవకాశాలు ఉండడంతో పాటు ఇది జాతీయ రహదారేనా అన్న అనుమానం రాక తప్పదు. పట్టణ శివరు ప్రాంతంల్లోనో లేక ఏదైనా వీధిలో అయితే పర్వాలేదు.ఏకంగా ప్రధాన కూడళ్లైన ఆర్టీసీ బస్టాండు, మరియు చౌరస్తాలో సర్కిల్ వద్ద రోడ్ల మధ్యలో గంటల తరబడి ఇవి నిలబడడం, వేగంగా ఊరకడం, పడుకోవడంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. పశువులు గుంపులు గుంపులుగా రోడ్డుకు అడ్డంగా రావడంతో వాహనాలు తిరగబడి ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయని చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పశువులు రోడ్లపైకి విచ్చలవిడిగా తిరుగుతూ వాహనచోదకులతో పాటు చిరువ్యాపారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. తోపుడు బండ్లపై పలు రకాల పండ్లను తింటూ,ఆకుకూరలు, కూరగాయలను పాడు చేస్తున్నాయని చిరువ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**హెచ్చరికలే లేవు... చర్యలెక్కడా..**

రోడ్డు మీదకు ఆవులు, గేదెలను వదిలితే చర్యలు తీసుకుంటామంటూ హెచ్చరికలు జారీ చేసే మున్సిపల్ అధికారులు వాటిని అమలు చేయటంలో మాత్రం ఘోరంగా విఫలమవుతున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. రోడ్డు మీదకు వదిలిన పశువులను బందించి అపరాద రుసం వసూలు చేస్తామని హెచ్చరికలు జారీ చేస్తే వాటిని రోడ్డుపై రానీయకుండా యజమానులు జాగ్రత్త పడతారని, ఇప్పటికైనా వాటి యజమానులు జాగ్రత్తలు తీసుకునే విధంగా మున్సిపల్ అధికారులు కట్టడి చేయాలని పట్టణ ప్రజలు, వాహనచోదకులు కోరుతున్నారు.

## అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణానికి ప్రజల సహకారం అవసరం



**సూర్యాపేట ప్రతినిధి, నవంబర్ 12 (జనంసాక్షి) :** సూర్యాపేట పట్టణంలో జరుగుతున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణానికి ప్రజల సహకారం అవసరమని మున్సిపల్ కమిషనర్ సిహెచ్.హన్మంత్ రెడ్డి అన్నారు.పట్టణంలోని 28వ వార్డు జెజె నగర్ ప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను బుధవారం పరిశీలించి మాట్లాడారు.పట్టణంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ పనులు వేగంగా సాగుతున్నాయని పేర్కొన్నారు.ఈ క్రమంలో ప్రజలకు తాత్కాలిక ఇబ్బందులు ఉంటాయని,ప్రజలు సహకరించాలని కోరారు.పట్టణ అభివృద్ధిని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అంజద్ అలీ, సానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శివప్రసాద్, వార్డ్ ఆఫీసర్ నస్రత్ ఫాతిమా, హెల్త్ అసిస్టెంట్ పోతుగంటి వేణు తదితరులు పాల్గొన్నారు.

## అంబులెన్స్‌లో మహిళ ప్రసవం



**బూర్గంపహాడ్, నవంబర్ 12 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం చింతకుంట గ్రామం మడివి రాజి (23) మహిళ ప్రభుత్వ ఆసుపత్రి 108 అంబులెన్స్ వాహనంలో ప్రసవించింది. మహిళ నిండు గర్భిణీ కాగా బుధవారం ఉదయం పురిటి నొప్పులు అధికమవడంతో 108 అంబులెన్స్ కు సమాచారం అందించగా వెంటనే స్పందించిన అంబులెన్స్ సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకుని హుటాహుటిగా ఘటన స్థలానికి చేరుకున్నారు. చింతకుంట రోడ్డు గోతుల మయమై వాహన రాకపోకలకు ఇబ్బందులు ఉన్నా కూడా అంబులెన్స్ పైలెట్ విజయభాస్కర్ చాకచక్యంగా వాహనాన్ని నడిపి నిండు గర్భిణీ అయిన మహిళను అంబులెన్స్‌లో ఎక్కించుకొని హాస్పటల్ కి తీసుకువచ్చే క్రమంలో నొప్పులు అధికం కావడంతో అంబులెన్స్ సిబ్బంది వాహనాన్ని మార్గం మధ్యలో నిలిపి డెలివరీ చేశారు. మహిళ పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. సమయస్ఫూర్తితో వ్యవహరించిన పైలెట్ విజయ్ భాస్కర్, ఈఎంటి సుభద్రను వైద్యులు అభినందించారు.

# మత్స్య శాఖ ద్వారా ఉచిత చేపల పంపిణీ




**సూర్యాపేట ప్రతినిధి, నవంబర్ 12 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని రిజర్వాయర్లకు, చెరువులకు మత్స్య శాఖ ద్వారా ఉచిత చేపల పంపిణీని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పేర్కొన్నారు.బుధవారం కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫిరెన్స్ ద్వారా పంచాయతీ, ఇరిగేషన్, అగ్రికల్చర్, మత్స్య శాఖ అధికారులు,సొసైటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. సీజనల్ కుంటలలో జిల్లా మత్స్య శాఖ అధికారి తరపున ఒక ప్రతినిధి, పంచాయతీ కార్యదర్శి, ఏఈఓ, అట్టి చెరువు సొసైటీ ప్రెసిడెంట్, సొసైటీలోని 10 మంది సభ్యులతో కమిటీ ఏర్పడుతుందని తెలిపారు. ఆయా కమిటీల ఆధ్వర్యంలోనే చేప పిల్లలను రిజర్వాయర్లు, చెరువులు కుంటలలో పంపిణీ చేయాలని అన్నారు.ఆయా కమిటీ ఆధ్వర్యంలోనే ఎన్ని పిల్లలు వేస్తున్నారో లెక్కించి వాటి యొక్క పరిమాణం బరువులు కొలవాలని, అక్కడే అందరి సభ్యులతో సంతకం తీసుకోవాలని అన్నారు. ఆ వివరాలను టీ మత్స్య యాప్ లో అప్ లోడ్ చేయాలని, చెరువులో చేప పిల్లలను విడుదల చేసేటప్పుడు స్థానిక ప్రజాప్రతినిధులను తప్పనిసరిగా ఆహ్వానించాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, జిల్లా మత్స్యశాఖ అధికారి బి.నాగులు నాయక్,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు తేజ విద్యాలయ విద్యార్థులు



**కోదాడ, నవంబర్ 12 (జనం సాక్షి) :** మంగళవారం భువనగిరిలోని ఇండోర్ స్టేడియం లో జరిగినటువంటి ఎస్ జి ఎఫ్అండర్ 14 బాలికల చదరంగం పోటీలలో తేజ విద్యాలయానికి చెందినటువంటి భూక్య యోగిత 6వ తరగతి మరియు ఓరుగంటి అనంతలక్ష్మి 7 వ తరగతి విద్యార్థులు ప్రథమ మరియు ద్వితీయ స్థానాలు సాధించి రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు ఎంపీక కావడం జరిగింది. ఈ సందర్భంగా వ జిల్లా గేమ్స్ సెక్రటరీ దశరథ రెడ్డి మరియు పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రిన్సిపల్ రమాదేవి అభినందించారు.

# పేద ప్రజల పాలిట వరంగా ముఖ్యమంత్రి సహాయనిధి



**మర్రిగూడ, నవంబర్ 12 (జనం సాక్షి) :** పేద ప్రజలకు అండగా నిలుస్తూ అనారోగ్య బాధితులకు భరోసాగా నిలిచిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి.పేద ప్రజల పాలిట వరంగా ముఖ్యమంత్రి సహాయ నిధి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో బాధిత కుటుంబానికి 2,50,000 ఎల్ఓసి అందజేత. మర్రిగూడ మండలం యరగండ్లపల్లి గ్రామానికి చెందిన వాస్తవ్యులు రెవెల్లి శ్రీనుకు నరాల బలహీనత న్యూరాలజీ మైలో న్యూరోపతి సార్సీఓ డైసిష్ అనే వ్యాధితో గత కొద్ది కాలంగా బాధపడుతున్నాడు. శ్రీను ఆరోగ్య పరిస్థితిని స్థానిక నాయకులు మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించి శీను ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 2,50,000/- ఎల్ఓసి మంజూరు చేయించారు. బుధవారం బాధిత కుటుంబానికి మర్రిగూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాందాస్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఎల్ఓసి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ కాకులవరం అశోక్ రెడ్డి,కుక్కడపు పెద్దరాములు గౌడ్, మాల్ మార్కెట్ డైరెక్టర్ జమ్ముల వెంకటేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## వీధి వ్యాపారుల అభివృద్ధికి తోడ్పడాలి



**మిర్యాలగూడ, నవంబర్ 12 (జనం సాక్షి) :** వీధి వ్యాపారుల అభివృద్ధి కోసం సకాలంలో రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లను కోరారు. మున్సిపల్ కమిషనర్ జి. శ్రీనివాస్. బుధవారం మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్‌లో పట్టణస్థాయి బ్యాంకర్స్ కమిటీ సమావేశము ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ వీధి వ్యాపారులకు చేయూతనందించేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పీఎం స్వానిధి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రుణాల విషయంలో బ్యాంకర్లు సహకరించాలన్నారు.15వేల రుణం సకాలంలో చెల్లించినవారికి 25 వేలు, ఆ తర్వాత 50 వేల రూపాయల రుణాలు వీధివిక్రయిదారులకు విధిగా సమయానికి రుణముగా మంజూరు చేయాలన్నారు. అదేవిధంగా మున్సిపల్ సిబ్బంది రుణాల బకాయిలను పూర్తిగా రికవరీ చేయాలన్నారు. మిర్యాలగూడ పట్టణంలో ఉన్నటువంటి వీధి విక్రయదారులు అర్హత ఉండి ఇంకా అప్లై చేసుకొని వారు మున్సిపల్ కార్యాలయం లోని మెప్మా సెక్షన్ లో దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ కోరారు.ఈ కార్యక్రమంలో మెప్మా జిల్లా కోఆర్డినేటర్ కె శివాజీ నాయక్, టిఎంసి బక్కయ్య, సిఓలు శ్రీనివాసు,వెంకటేశ్వర్లు, సతీష్, వివిధ బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయం



**మణుగూరు, నవంబర్ 12 (జనం సాక్షి) :** కాంగ్రెస్ పార్టీ ఓటమి భయం తోనే అప్రజాస్వామిక పద్ధతిని పాటిస్తూ ఓటర్లను భయ భ్రాంతులకు గురి చేస్తుందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు రేగ కాంతారావు అన్నారు.బుధవారం మౌనిక హెటల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...గతంలో ఇచ్చిన ఆరు గ్యారంటీ లను అమలు చేయడంలో విఫలమయ్యారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ ఎన్నిక వద్ద గందరగోళం పరిస్థితిని సృష్టిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దొంగ ఓట్లు క్రియేట్ చేసి, భారీగా డబ్బులు పంపిణీ చేశారని ఆరోపించారు. వీటిని నిరోధించడంలో అధికారులు, ఎన్నికల సంఘం పూర్తిగా విఫలమైందని అన్నారు. ఎన్ని కుట్రలు చేసినా ఎంత డబ్బు ఖర్చు చేసినా ప్రజలు బి ఆర్ఎస్ పక్షానే ఉన్నారన్నారు. ఓటమి భయం తోనే ఇతర పార్టీల మద్దతు తీసుకున్నారని ప్రజా పాలనలో ప్రజలు ఏమి లబ్ధి పొందారో వారికి తెలుసన్నారు. హైదరాబాద్ లో చెత్త తీయలేదని సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. బి ఆర్ఎస్ పాలనలో ఉన్న చెత్త ఇప్పటికీ ఉందా లేక ఈ ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్న ఇంకా చెత్త తీయలేక పోతున్నారో ప్రజలకు తెలుసన్నారు. ప్రజలకు ప్రభుత్వం పై నమ్మకం ఉంటే మా నాయకులపై దాడులు చేయటమెందుకని అన్నారు.ప్రశ్నిస్తే దాడులు చేస్తారా..పట్టుబడ్డ వారిని తీసుకెళ్తే పట్టించుకోవడం లేదంటే ప్రజాస్వామ్య వ్యవస్థపై నమ్మకం పోతుందన్నారు. మహాకవి శ్రీశ్రీ అన్నట్లు గెలిచింది న్యాయం కాకపోవచ్చు కానీ చివరికి గెలిచేది మాత్రం న్యాయమే అన్నారు. ఈ కార్యక్రమంలో కుర్రి నాగేశ్వరరావు, యాదగిరి గౌడ్, అడపా అప్పారావు, వట్టం రాంబాబు,ముత్యం బాబు,నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# చిన్న నీటి వనరుల గణన ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్



**గద్వాల నడిగడ్డ, నవంబర్ 12 (జనం సాక్షి) :** జిల్లాలోని చిన్ననీటి వనరుల లెక్క తేల్చేందుకు నిర్వహించనున్న గణన ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు దేశవ్యాప్తంగా ఐదేళ్లకోసారి నిర్వహించే 7వ మైనర్ ఇరిగేషన్, రెండవ వాటర్ బాడీస్ సెన్సెస్ జిల్లాలో ఏ విధంగా నిర్వహించాలని అంశంపై జిల్లాస్థాయి స్టీరింగ్ కమిటీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని చిన్న నీటి పారుదల వనరుల గణన ప్రణాళిక ప్రకారం పూర్తిచేయాలని ఆదేశించారు.రెండు వేల హెక్టార్లలోపు విస్తీర్ణం ఉన్న జలవనరుల గణన మొబైల్ అప్లికేషన్ ద్వారా చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసిందని వెల్లడించారు. మొదట ఒక గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని గణన పూర్తిచేసిన తర్వాత, తదుపరి గ్రామాల గణనను కొనసాగించాలన్నారు. తహసీల్దార్, ఎంపీడివో, నీటిపారుదల శాఖ ఏఈలు మండల స్థాయిలో పర్యవేక్షణ చేస్తారని తెలిపారు. గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, ఏఈవోలు ఎన్యూమరేటర్లు గా కొనసాగుతారని తెలిపారు. జిల్లాలో ఉన్న 202 రెవెన్యూ గ్రామాల్లో చిన్న నీటి వనరుల గణన కోసం అవసరమైతే ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్స్‌ను కూడా ఎన్యూమరేటర్లుగా వినియోగించుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని చెరువులు, కుంటలు, ఇతర జల వనరుల వివరాలు సేకరించడంపై అందరూ ఎన్యూమరేటర్లకు జిల్లా, మండలాల స్థాయిలో త్వరితగతిన శిక్షణ పూర్తి చేయాలని ఆదేశించారు. పీపీటి ద్వారా ఎన్యూరేటర్లకు మొబైల్ అప్లికేషన్ గణన ప్రక్రియపై స్పష్టంగా శిక్షణ ఇవ్వాలని సూచించారు.నీటి పారుదల,విద్యుత్, ఇతర శాఖల అధికారులు తమ శాఖకు సంబంధించిన వివరాలను గణన చేస్తున్న అధికారులకు అందజేయాలని సూచించారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత గడువులోగా గణన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ,సీపీఓ పాపయ్య, నీటి పారుదల శాఖ ఈఈ శ్రీనివాసులు, భూగర్భ జల వనరుల శాఖ డీడీ మోహన్, పంచాయతీరాజ్ శాఖ ఈఈ ప్రభాకర్, విద్యుత్ శాఖ డీఈ తిరుపతిరావు, డిప్యూటీ ఎస్ఓ లు హరికృష్ణ, హైమావతి, డిఆర్డిఏ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ నివారణపై ప్రజలు చైతన్యం కలిగి ఉండాలి



**భద్రాచలం, నవంబర్ 12 (జనంసాక్షి) :** భద్రాచలం పట్టణం డబల్ బెడ్ రూమ్ కాలనీలో పట్టణ సీఐ నాగరాజు ఆధ్వర్యంలో డ్రగ్స్ పై చైతన్యం అంశంపై ఏర్పాటు చేసిన పోలీసు బృందాల కళా ప్రదర్శనలో సీఐ నాగరాజు మాట్లాడుతూ ప్రజలు డ్రగ్స్ నివారణపై చైతన్యం కలిగి ఉండాలని ఉన్నారు. యువత గంజాయి మత్తు వీడి మంచి మార్గాన్ని ఎంచుకోవాలని, బ్రతుకుని నరకం చేసుకోవద్దని ఆయన హితవు పలికారు. యువతీ యువకులు ఉన్నత చదువులు చదివి గొప్పగా ఎదగాలని, తల్లిదండ్రుల శ్రమను గుర్తించి చెడు వ్యసనాలకు బానిస కాకుండా జాగ్రత్త వహించాలని, వారి శ్రమకు తగ్గ ఫలాన్ని అందించాలని, విద్యార్థి దశ గొప్పదని, క్రమశిక్షణగా చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని, ప్రతి ఒక్కరూ గంజాయి మహమ్మారికి దూరంగా ఉండి తమ జీవితాలను బంగారు భవిష్యత్తును పాడు చేసుకోకుండా ఉండాలని ఆయన అన్నారు. భద్రాచలం పట్టణంలో గంజాయి రవాణా జరిగినట్లు ఎవరికి తెలిసిన వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలని, గంజాయి స్మగ్లింగ్‌కు పాల్పడితే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆయనన్నారు. కళా ప్రదర్శనలో గంజాయి మత్తులో జీవితాలు ఎలా విచ్ఛిన్నం చేసుకున్నారు మనకు కళ్ళకు కట్టినట్లు పోలీస్ కళాబృందాలు వివరించాయని, వారికి ప్రత్యేకమైన అభినందనలు తెలుపుతున్నానని, అంతేకాకుండా ఈ కళావేదికకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. ఈ గంజాయి డ్రగ్స్ మహమ్మారుల చైతన్య కళా ప్రదర్శనలో పట్టణ పోలీస్ అధికారులు వివిధ కాలనీల మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడి పౌల్ రాజ్, రిపోర్టర్ గద్దం సుధాకర్ రావు, ఎమ్మార్పీఎస్ మాజీ సీనియర్ నాయకులు అలవాల రాజా, మానవ హక్కుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టా శ్రీనివాసరావు, వాల్మీకి, యువత తదితరులు పాల్గొన్నారు.

# ఫారెస్ట్ అధికారులపై గ్రామస్తులు దాడి



**చందంపేట, నవంబర్ 12 (జనం సాక్షి) :** చందంపేట మండలం గువ్వల గుట్ట గ్రామంలో ఫారెస్ట్ అధికారులు పై గువ్వలగుట్ట గ్రామస్తులు దాడికి పాల్పడిన సంఘటన చోటుచేసుకుంది . గువ్వల గుట్ట గ్రామం రైతులు పోడు భూములకు సాగు చేసేందుకు చదును చేస్తుండగా. సమాచారం తెలుసుకున్న ఫారెస్ట్ అధికారులు గ్రామానికి వెళ్లి ఫారెస్ట్ భూములను మీరు ఎలా ఫారెస్ట్ పరిధిలో వచ్చే భూములను వ్యవసాయం ఎలా చేస్తారు అని అడగగా గ్రామస్తులు మాకు ఉన్న కొద్దిపాటి పోడు భూములను సాగు చేస్తుంటే ప్రతిసారి వచ్చి మాకు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు . ఫారెస్ట్ అధికారులు ఈ భూములకు సంబంధించిన ఫారెస్ట్ పట్టా పాస్ పుస్తకాలు చూపెట్టి సేద్యం చేసుకోవాలని చెప్పగా అంతలోనే అక్కడ భూములకు చదును చేస్తున్న రైతుల ఫారెస్ట్ అధికారుల మధ్య వాగ్వాదానికి దారి తీసింది. అనంతరం.రైతుల ఫారెస్ట్ అధికారుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది దీంతో. ఫారెస్ట్ అధికారులకు గాయాలయ్యాయి. అనంతరం వారికి దేవరకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. దాడిలో పాల్గొన్నటువంటి రైతులపై చర్యలు తీసుకోవాలని ఫారెస్ట్ అధికారులు కోరుతున్నారు.

# విపణి

## వృద్ధుల సంరక్షణకు టీసీఎస్ ఏఐ పరిష్కారం

అనేక సమస్యలకు సాంకేతిక పరిష్కారాలను అందించే దిగ్గజ ఐటీ సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్).. మరో క్లిష్టమైన సామాజిక సమస్యకు ఐటీ పరిష్కారాన్ని అందించేందుకు ముందుకు వచ్చింది. ఇందులో భాగంగా యూరప్‌లోనే అతిపెద్ద స్వతంత్ర పరిశోధనాభివృద్ధి సంస్థ సింటెఫ్‌తో చేతులు కలిపింది. ప్రస్తుత రోజుల్లో వయసు పైబడిన పెద్దవారిని చూసుకోవడం అనేది పెద్ద సమస్యగా మారింది. పిల్లలు తమ ఉద్యోగాలు, వృత్తి రీత్యా ఎక్కడో ఉంటున్నారు. దీంతో వయసు మళ్లిన వృద్ధులు ఇంట్లో ఒంటరిగానే




జీవిస్తున్నారు. ఈ క్రమంలో తమను పట్టించుకునేవారు లేరని ఇలు పెద్దవారు, తమ వారి బాగోగులను పర్యవేక్షించే అవకాశం ఉండటం లేదని వారి పిల్లలు మథనపడుతుం టారు. ఈ సమస్యకు సులువైన పరిష్కారాన్ని అందిస్తూ.. వృ ద్ధుల సంరక్షణను సరికొత్తగా మార్చే లక్ష్యంతో కృత్రిమ మేధ స్సు (ఏఐ) పరిష్కారాలను అభివృద్ధి చేయడానికి టీసీఎస్.. యూరప్‌లోని అతిపెద్ద స్వతంత్ర పరిశోధనా సంస్థలలో ఒకటైన సింటెఫ్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రకటించింది. ఈ భాగస్వామ్యం సింటెఫ్ స్మార్ట్ ఇన్‌క్లూజివ్ లివింగ్ ఎన్విరాన్మెంట్స్ ప్రాజెక్ట్ ను ముందుకు తీసుకెళ్లడంపై దృష్టి పెడుతుంది. ఇది ఏఐ, సెన్సార్లు, డేటా అనలిటిక్స్ సాయంతో ఇళ్లలో వృద్ధుల సంరక్షణను, పర్యవేక్షించడానికి, సహకారం ఇవ్వడానికి ఏఐ, సెన్సార్లు, డేటా అనలిటిక్స్‌ను ఏకీకృతం చేస్తుంది. ఒంటరిగా ఉంటూ వృద్ధాప్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నవారు దూరంగా ఉన్న తమ కుటుంబ సభ్యులు, సంరక్షకులు, తమ ఇతర వయో వృద్ధులతో ఎప్పటికప్పుడు అనుసంధానమై ఉంటూ ఇంట్లో తమంతట తాము స్వతంత్రంగా, సురక్షితం గా జీవించేందుకు సహకారం అందించేలా స్మైల్ ప్లాట్‌ఫామ్‌ను రూపొందించారు. స్మార్ట్ టెక్నాలజీలను ఉపయోగించి, ఇది రోజువారీ కార్యకలాపాలను పర్యవేక్షిస్తుంది. రానున్న ఆరోగ్య సమస్యలను గుర్తించి సకాలంలో సంరక్షకులకు సమాచారం అందిస్తుంది.

## నియంత్రణలేని కృత్రిమ మేధ.. కట్టుతప్పితే..

**న్యూఢిల్లీ:** ఆర్టిఫిషియల్ సూపర్ ఇంటెలిజెన్స్ దిశగా ప్రపంచవ్యాప్తంగా పోటీ తీవ్రమవుతున్న నేపథ్యంలో మైక్రోసాఫ్ట్ కంపెనీ ఏఐ చీఫ్ స్తఫా సులేమాన్ కీలక హెచ్చరికలు చేశారు. ఏఐ అంచనా వేసిన దానికంటే వేగంగా పురోగమిస్తున్నప్పటికీ ఇది మానవ నియంత్రణలో ఉండటం అత్యవసరం అని నొక్కి చెప్పారు. మైక్రోసాఫ్ట్ ప్రత్యేక సూపర్ ఇంటెలిజెన్స్ బృందాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిన కొద్ది రోజులకే సులేమాన్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. 'సూపర్ ఇంటెలిజెన్స్‌ను నిర్మించే క్రమంలో మానవత్వాన్ని, మనం జీవించాలనుకునే భవిష్యత్తును కోల్పోతే ప్రమాదం. మానవులకు ఈ అంశాలపై నియంత్రణ లేకపోతే ప్రమాదం' అని చెప్పారు. సులేమాన్ పైవ్యాఖ్యలు చేస్తూనే మైక్రోసాఫ్ట్ ఏఐ అభివృద్ధిలో కొత్త దశలోకి




అడుగుపెట్టినట్లు చెప్పారు. దీన్ని 'ఏఐ సెల్ఫ్ సఫిషియన్సీ' (ఏఐ స్వయం సమృద్ధి) అని అభివర్ణించారు. కంపెనీ ఓపెన్ ఏఐతో భాగస్వామ్యంలో ఉన్న పరిమితులను అధిగమించి భారీ స్థాయిలో ఏఐ వ్యవస్థలకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. అయితే ఏఐ మోడళ్లకు విచ్చలవిడిగా శిక్షణనిచ్చే అనియంత్రిత శక్తిని లక్ష్యంగా చేసుకున్న పోటీదారుల మాదిరిగా కాకుండా మైక్రోసాఫ్ట్ 'హ్యూమనిస్ట్ సూపర్ ఇంటెలిజెన్స్' (మానవతా దృక్పథంతో కూడిన సూపర్ ఇంటెలిజెన్స్) ను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుందని సులేమాన్ వివరించారు. ఈ విధానం వల్ల ఏఐను జాగ్రత్తగా ఉపయోగించుకోవచ్చని చెప్పారు. సందర్భోచితంగా పరిమితులకు లోబడి వాడుకోవచ్చని తెలిపారు. ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్ రేసులో ప్రత్యర్థుల మాదిరి నియంత్రణ లేకుండా శిక్షణలు ఇవ్వడం లేదని చెప్పారు. మైక్రోసాఫ్ట్ మానవ అవసరాలను తీర్చే ఆచరణాత్మక వ్యవస్థలను సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకుందని స్పష్టం చేశారు. మానవాళికి సేవ చేయడానికి స్పష్టంగా రూపొందించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని నిర్మిస్తున్నామన్నారు.

## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై:** దేశీయస్టాక్మార్కెట్లుబుధవారంలాభాల్లోముగిశాయి. ఐటీ, ఆటో స్టాక్స్ లో బలమైన లాభాల కారణంగా భారత బెంచ్ మార్క్ సూచీలు సెన్సెక్స్, నిఫ్టీఎగిశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 595.19 పాయింట్లు లేదా 0.71 శాతం పెరిగి 84,466.51 వద్ద, నిఫ్టీ 50 సూచీ 180.85 పాయింట్లు లేదా 0.7 శాతం పెరిగి 25,875.80 వద్ద ముగిసింది. బీఎస్ఈలో ఏషియన్ పెయింట్స్, టెక్ మహీంద్రా, బజాజ్ ఫిన్సర్వ్ టాప్ గెయినర్స్గాఉండగా, టాటా స్టీల్, టాటా మోటార్స్ పీవీ, బీఈఎల్ ప్రధాన వెనుకబడివా టిలో ఉన్నాయి. ఇకఎన్ఎస్ఈవిషయానికివస్తేఏషియన్‌పెయింట్స్, అదానీ ఎంట్, టెక్ మహీంద్రా టాప్ గెయినర్స్గాటాటా మోటార్స్ పీవీ, టాటా మోటార్స్ సీవీ, టాటా స్టీల్ టాప్ లూజర్స్గా నిలిచాయి. బెంచ్మార్క్తోపాటువిస్తృత సూచీలు కూడా లాభపడ్డాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ 100 ఇండెక్స్ 0.79 శాతం లాభపడగా, స్మాల్ క్యాప్ 0.82 శాతం లాభపడింది. రంగాలవారీగా2.04 శాతం లాభంతోనిఫ్టీ ఐటీ టాప్గెయినర్గాఉంది. ఇకనిఫ్టీఆటో 1.24 శాతం, ఫార్మా 1 శాతం లాభపడ్డాయి.



## స్మార్ట్‌ఫోన్ మార్కెట్లో వీవోదే హవా



**న్యూఢిల్లీ:** భాతర స్మార్ట్‌ఫోన్ మార్కెట్లో చైనా బ్రాండ్ వివో తన ఆధిపత్యాన్ని చాటుకుంటోంది. జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో మొత్తం స్మార్ట్‌ఫోన్ షిప్‌మెంట్లలో (రవాణా) 18.3 శాతం వాటాతో వివో మొదటి స్థానాన్ని కాపాడుకుంది. ఒప్పో 13.9 శాతం, శామ్‌సంగ్ 12.6 శాతం, యాపిల్ 10.4 శాతం, రియల్‌మీ 9.8 శాతం, షావోమీ 9.2 శాతం చొప్పున మార్కెట్ వాటా కలిగి ఉన్నాయి. వన్‌ప్లస్ షిప్‌మెంట్‌లు ఇదే కాలంలో 30.5 శాతం తగ్గాయి. మోటరోలా 52 శాతం వృద్ధిని నమోదు చేసింది. మార్కెట్ పరిశోధనా సంస్థ ఐడీసీ డేటా ప్రకారం.. సెప్టెంబర్ త్రైమాసికంలో భారత స్మార్ట్‌ఫోన్ మార్కెట్ 4.8 శాతం వృద్ధితో 4.8 కోట్ల యూనిట్లకు చేరుకుంది. యాపిల్ సంస్థ 50 లక్షల ఐఫోన్లను రవాణా చేసింది. ప్రీమియం స్మార్ట్‌ఫోన్ల మార్కెట్‌లో 43.3 శాతం వృద్ధి నమోదైంది. ప్రీమియం స్మార్ట్‌ఫోన్ల వాటా మొత్తం ఫోన్లలో 4 శాతం నుంచి 6 శాతానికి పెరిగింది. ఇందులో 70 శాతం ఐఫోన్ 16, 15, 17 మోడళ్లున్నాయి. ప్రీమియం స్మార్ట్‌ఫోన్లలో 66 శాతం మార్కెట్ వాటాతో యాపిల్ టాప్‌లో ఉంది. శామ్‌సంగ్ 31 శాతం వాటాతో తర్వాతి స్థానంలో నిలిచింది.

## తులం ఎంతంటే..

**ఇటీవల కాలంలో స్థిర ఆదాయం సమకూర్చే కమోడిటీ మార్కెట్లపైపు పెట్టుబడిదారులు మొగ్గు చూపుతున్నారు. అందులో భాగంగా బంగారం ధరల్లో మార్పులు వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. గత కొన్ని రోజులుగా బంగారం ధరలు తీవ్ర ఒడిదొడుకులకు లోనవుతున్నాయి. నిన్న తులంపై సుమారు రూ.2,250 పెరిగిన బంగారం ధరలు బుధవారం కొంతవరకు తగ్గాయి. దేశంలోని ప్రధాన నగరాల్లో ఈరోజు బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో కింద తెలుసుకుందాం.**



### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
| --- | --- |
| ₹ 5.92 | ₹ 5.97 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,15,050 | ₹ 1,25,510 |
| --- | --- |
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 1,73,000

## పదేళ్లలో ఇండియాలో ఇంధన డిమాండ్ పీక్..

**న్యూఢిల్లీ:** ప్రపంచంలోనే 2035 నాటికి భారతదేశంలో అత్యధికంగా ఇంధన డిమాండ్ నెలకొంటుందని ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ విడుదల చేసిన 'వరల్డ్ ఎనర్జీ అవుట్‌లుక్ 2025' నివేదిక వెల్లడించింది. ఆర్థిక కార్యకలాపాలు ఊపందుకోవడం, వేగవంతమైన పట్టణీకరణ, మధ్యతరగతి జనాభా పెరుగుదల కారణంగా దేశ ఇంధన డిమాండ్‌లో గణనీయమైన పెరుగుదల నమోదవుతుందని నివేదిక పేర్కొంది. గత దశాబ్ద కాలంలో చమురు డిమాండ్ వృద్ధిలో చైనా 75%



వాటాను కలిగి ఉండగా, ఈ పరిస్థితి మారుతోందని ఐఈఏ తెలిపింది. రాబోయే దశాబ్దంలో ప్రపంచ చమురు డిమాండ్ వృద్ధికి భారత్ నాయకత్వం వహిస్తుంది. ఇండియా చమురు వినియోగం 2024లో రోజుకు సగటున 5.5 డాలర్లుగా ఉండేది. 2035 నాటికి ఇది 8 డాలర్లకు పెరుగుతుందని అంచనా. కార్ల కొనుగోలు వేగంగా పెరగడం, ప్లాస్టిక్స్, రసాయనాలు, విమానయానానికి పెరుగుతున్న డిమాండ్ ఇందుకు కారణం. 2035 నాటికి భారతదేశంలో జీడీపీ సగటున 6.1% చొప్పున పెరుగుతుంది. ఇది ఇతర ప్రధాన దేశాల కంటే ఎక్కువ. 2035 నాటికి భారతదేశ తలసరి జీడీపీ ప్రస్తుత గణాంకాల కంటే 75% అధికంగా ఉంటుంది. గృహాల్లో ఎయిర్ కండీషనర్లు, ఎలక్ట్రానిక్ ఉపకరణాల వాడకం పెరుగుతున్న కారణంగా విద్యుత్ డిమాండ్ 80% అధికమవుతుంది.

## పేలుడు ఘటనల్లో అత్యంతకీలకం ఫోరెన్సిక్ రిపోర్ట్



**న్యూఢిల్లీ:** ఈ పేలుడు ఘటనతో న్యూఢిల్లీలోని అధికార యంత్రాంగం ఒక్కసారిగా అలర్ట్ అయింది. ఈ విషాదానికి కారణాలు తెలుసుకునేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో ఫోరెన్సిక్ ఎక్స్‌పర్ట్‌లు కొన్ని అనుమానిత ఆధారాలను పరిశీలిస్తున్నారు. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో నిజాన్ని వెలికితీసేందుకు ఎక్స్‌పర్ట్‌లు అనుసరించే అత్యాధునిక పద్ధతుల గురించి తెలుసుకుందాం. ఈ ఘటన జరిగిన అరగంటలోపే ఢిల్లీ ఫోరెన్సిక్ లాబొరేటరీ పేలుడు పదార్థాల విభాగానికి చెందిన నిపుణులు పోలీసు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రాథమికంగా సంఘటన స్థలం నుంచి అనుమానిక సాక్ష్యాలను పరిశీలించి వాటిని విశ్లేషిస్తారు. సాంప్రదాయ నేరాల మాదిరిగా కాకుండా పేలుళ్లు ప్రత్యేకమైన సవాళ్లను కలిగి ఉంటాయి. తీవ్రమైన ఒత్తిడి, వేడి కారణంగా వస్తువులు బూడిదవుతాయి. దాంతో ఆధారాలు సేకరించడం కష్టమవుతుంది. ఫోరెన్సిక్ సైన్స్‌లో 'లోకార్డ్ మార్పిడి సూత్రం' అని ఉంటుంది. ఇది ప్రతి నేరస్థుడు సంఘటనా స్థలంలో ఏదో ఆధారం వదిలివేసి లేదా ఏదో తీసుకెళ్లే అవకాశం ఉంటుందని చెబుతుంది. పేలుడు గందరగోళంలో ఒత్తిడికి గురికాకుండా నిపుణులు అనుమానితులను సంఘటన స్థలానికి అనుసంధానించే కోణంలో పరిశోధనలు చేస్తారు. వారు ఉపయోగించిన పేలుడు పదార్థాలు ఏ రకమైనవో, వాటి తీవ్రత ఎలా ఉంటుందో విశ్లేషిస్తారు. అగ్ని ప్రమాదం జరిగిన ప్రదేశంలో నిపుణులు ముఖ్యంగా పేలుడు పదార్థాల అవశేషాలు, అగ్ని ప్రమాదానికి కారణమైన పదార్థాల జాడలు, వేడి ప్రభావంతో మారిన వస్తువుల భౌతిక ఆధారాల కోసం వెతుకుతారు. కాలిన శిథిలాల నుంచి చిన్న చిన్న అవశేషాలను చాలా జాగ్రత్తగా కలుషితం కాకుండా ఉండేలా సేకరిస్తారు. సాధారణంగా మండే స్వభావం ఉన్న ద్రవాలు నేలలోకి లేదా ఇతర శోషక పదార్థాలలోకి ఇంకిపోతాయి. కాబట్టి కార్బన్ అవశేషాలు కాలిన భాగాల అంచులు, మట్టి నమూనాలను సేకరిస్తారు. సేకరించిన నమూనాలను తక్షణమే గాలి చొరబడని ప్రత్యేక డబ్బాల్లో ప్యాక్ చేస్తారు. ప్లాస్టిక్ సంచులను నివారిస్తారు. ఎందుకంటే అవి మండే ద్రవాల ఆవిరులను పీల్చుకోవచ్చు లేదా కలుషితం చేయవచ్చు. సంఘటన స్థలాన్ని చాలా కోణాల నుంచి ఫోటోలు తీస్తారు. లేజర్ ఆధారిత మ్యాపింగ్ ద్వారా 3డీ స్కెచ్‌లు వేయిస్తారు. ఇది అగ్ని వ్యాప్తి చెందిన విధానాన్ని పేలుడు కేంద్ర బిందువును అర్థం చేసుకోవడానికి సహాయపడుతుంది. అగ్ని ఎంత వేగంగా, ఏ దిశలో వ్యాపించింది అనే నమూనా, అత్యంత ఎక్కువ నష్టం జరిగిన ప్రదేశం ఆధారంగా పేలుడు/అగ్ని ప్రారంభ స్థానాన్ని గుర్తిస్తారు. కాలిపోయిన లోహపు శకలాల నమూనా, వాటి కదలికను బట్టి అది ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదమా లేదా పేలుడు పదార్థాలను ఉపయోగించిన దాడినా అని నిర్ధారిస్తారు. ఇది అత్యంత ముఖ్యమైన సాంకేతికత. నమూనాలోని మండే ద్రవాల ఆవిరులను (పెట్రోల్, కిరోసిన్ వంటివి) గుర్తించడానికి ఉపయోగిస్తారు. పేలుడు అవశేషాల రసాయన మిశ్రమాలను కూడా వేరు చేసి ఇందులో గుర్తిస్తారు. కాలిన అవశేషాలు కాంతితో ఎలా చర్య చెందుతాయో విశ్లేషించి అందులోని రసాయన బంధాలను గుర్తిస్తుంది. ఇది పేలుడు పదార్థాల రసాయన కూర్పును తెలుసుకోవడానికి సహాయపడుతుంది. పేలుడు శకలాల ఉపరితల స్వరూప శాస్త్రాన్ని పరిశీలిస్తుంది. ముఖ్యంగా పేలుడు తర్వాత మిగిలిపోయిన మూలకాల జాడలను (ఉదా: సల్ఫర్, నైట్రోజన్, లెడ్) గుర్తించడానికి ఉపయోగపడుతుంది. ఇది పేలుడు పదార్థం రకాన్ని నిర్ధారిస్తుంది. దోషులను గుర్తించడానికి ఫోరెన్సిక్ అధికారులు కేవలం రసాయన ఆధారాలపైనే కాకుండా చాలా పద్ధతులను అనుసరిస్తారు. ప్రయోగశాలలో ఏదైనా ప్రత్యేకమైన లేదా వాణిజ్యపరమైన పేలుడు పదార్థాలను గుర్తిస్తే ఆ పదార్థాన్ని కొనుగోలు చేసిన, తయారు చేసిన లేదా నిల్వ చేసిన వ్యక్తులపై దర్యాప్తు చేస్తారు. వాహనం పేలుడు ఘటనకు కేంద్ర బిందువు అయితే ట్యాంపరింగ్‌కు గురైన ఇంజిన్ లేదా ఛాసిస్ నంబర్‌లను థర్మోకెమికల్ ఎచింగ్ ద్వారా తెలుసుకుంటారు. దీని ద్వారా వాహనం యజమాని వివరాలు తెలుస్తుంది. సంఘటన స్థలం చుట్టూ ఉన్న సీసీటీవీ ఫుటేజీని సేకరించి సంఘటనకు ముందు అనుమానాస్పద కదలికలను ట్రాక్ చేస్తారు. అనుమానితుల డిజిటల్ పరికరాలలో (ఫోన్లు, కంప్యూటర్లు) పేలుడు తయారీకి సంబంధించిన సమాచారాన్ని పరిశీలిస్తారు.



**ఎర్రకోట కాంప్లెక్స్ సమీపంలో నవంబర్ 10న భారీ పేలుడు సంభవించింది. సిగ్నల్ వద్ద నిలిపిన ఐ20 కారు అకస్మాత్తుగా పేలింది. ఈ విస్ఫోటనంతో చుట్టుపక్కల ప్రజలు మరణించడంతోపాటు సమీపంలోని వాహనాలు ధ్వంసం అయ్యాయి. ఇటువంటి సంఘటనల్లో అత్యాధునిక ఫోరెన్సిక్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి విచ్ఛిన్నమైన సాక్ష్యాలను సేకరించి, వాటిని ఏకం చేయాలి. ఒక సంఘటన ప్రమాదవశాత్తు లేదా ఉద్దేశపూర్వకంగా జరిగిందో నిర్ణయించడమే కాకుండా కోర్టులో ఫలితాలు నిలబడేలా చూడాలి. వీటన్నింటికీ ఫోరెన్సిక్ రిపోర్టే అత్యంత కీలకం..**

## చావు చులకనగా మారడం అంటే ఇదేనేమో..

- ఇరాన్‌లో సామూహిక మరణశిక్షల అమలు
- అనంతరం ఆనకట్టలో పడేసిన వైనం



టెహ్రాన్: చావు చులకనగా మారడం అంటే ఇదేనేమో. మనిషి జీవిత విలువను తక్కువగా చూడటం, మరణాన్ని సాధారణ సంఘటనగా భావిస్తే అది మానవతా ప్రశ్నలను రేకెత్తిస్తుంది. సమాజం వ్యక్తి జీవితాన్ని గౌరవించకపోతే, చావు ఒక సాధారణ శిక్షగా మారుతుంది. ఇది మానవ హక్కుల ఉల్లంఘనకు దారితీస్తుంది. అన్యాయపు శిక్షలు: వేగంగా, విచారణ లేకుండా అమలు చేసే ఉరిశిక్షలు చావును చులకనగా మార్చే ఉదాహరణలు. ప్రజలలో భయాన్ని చాటేందుకు చావును సాధారణంగా చూస్తుంది నేటి అధికార వ్యవస్థ. నేటి అధికార వ్యవస్థలకు చావు అనేది వ్యూహంగా మారుతుందంటే అతిశయోక్తి కాదేమో. తాజాగా ఒక భయంకరమైన వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఇరాన్‌లో ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 74 మృతదేహాలను అతి దారుణంగా ఓ ఆనకట్టలో పడేశారనేది ఆ వార్త సారాంశం. ఆ ఆనకట్ట వర్షాలు లేక ఎండిపోవడంతో ఆ మృతదేహాలు బయటపడ్డాయట. వారిందరికీ చేతులు, కాళ్లు కట్టేసి ఉన్నాయి. వారిని దుప్పట్లో చుట్టేసి మరీ పడేశారనేది సమాచారం. అంటే వారికి ఉరి శిక్షను అమలు చేసి, ఇలా ఆనకట్టలో పడేశారనేది తాజా పరిస్థితిని బట్టి అర్థమవుతుంది. ఇరాన్‌లో ఉరిశిక్షలు చాలా వేగంగా అమలు చేస్తారు. అందులోనూ రాజ(దేశ) ద్రోహం కింద అయితే మరో అడుగు ముందుకేసి మరీ ఉరిని అమలు చేస్తారు. వారు దేశ ద్రోహానికి పాల్పడ్డారో లేదో మనకు తెలీదు కానీ, ఉరిశిక్షను చాలా వేగవంతంగా అమలు చేసినట్లు మృతదేహాల పరిస్థితి ని బట్టి తెలుస్తోంది. వారిని దేశ ద్రోహులుగా నిర్ధారించిన ప్రభుత్వం.. ఇలా పడేసినా ఎవరూ గుర్తించరని భావించి ఇలా చేసే ఉంటారనే సోషల్ మీడియా ద్వారా మనకు తెలుస్తున్న వైనం. అయితే ఈ వార్త ప్రచురించిన ఇరాన్ ప్రభుత్వ మద్దతు మీడియా తర్వాత దానిని తొలగించడం కూడా చకచకా జరిగిపోయిందనే వార్త కూడా మరొకటి వచ్చింది. అసలు ఏం జరిగిందనేది కొన్ని రోజుల వ్యవధిలో తెలిసే అవకాశం ఉంది.

## బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలి

ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం బంగ్లాలో అధికారంలో ఉన్న యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం తీవ్రవాద శక్తులకు అధికారం ఇస్తూ.. భారత్‌తో ఆ దేశ సంబంధాలను ప్రమాదంలో పడేస్తోందని హసీనా ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో భారత్‌తో బలమైన సంబంధాలు కొనసాగించామని.. యూనస్ తన మూరత్వంతో వాటిని బలహీనపరుస్తున్నారన్నారు. కష్ట సమయంలో ఆశ్రయం కల్పించినందుకు మోదీ ప్రభుత్వానికి, భారత ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. తాను అధికారంలో ఉన్న సమయంలో విద్యార్థులు చేపట్టిన ఆందోళనలను పరిష్కరించడంలో తమ ప్రభుత్వం విఫలమయ్యిందని.. అటువంటి భయంకరమైన ఘటనల నుంచి పాఠాలు నేర్చుకున్నానన్నారు. కానీ ఆ సమయంలో విద్యార్థి నాయకులు కూడా బాధ్యత తీసుకొని ఉండాల్సిందని అభిప్రాయం వ్యక్తంచేశారు. తనపై నమోదైన కేసుల విషయంలో అంతర్జాతీయ క్రిమినల్ కోర్టులో విచారణకు హాజరవడానికి తాను సిద్ధంగా ఉన్నానని షేక్ హసీనా తెలిపారు. యూనస్ ప్రభుత్వం తనపై చేసిన ఆరోపణలను హసీనా ఖండించారు.



బ్రిడ్జి కూలక ముందు..



కూలిన తరువాత

## చైనాలో కలకలం.. భారీ శబ్దంతో కుప్పకూలిన బ్రిడ్జి

చైనాలో ఇంజినీరింగ్ వైఫల్యం బట్టబయలైంది. చైనా-టిబెట్‌ను కలిపెందుకూ ఇటీవలే ప్రారంభించిన హాంగ్ కీ బ్రిడ్జి అకస్మాత్తుగా కూలిపోయింది. చైనా సియాచిన్ ప్రావిన్స్ లో నిర్మించిన ఈ బ్రిడ్జి 758 మీటర్ల పొడవైంది. వంతెన కూలడానికి గల కారణాలు తెలవాల్సి ఉంది. చైనా సియాచిన్ ప్రావిన్స్ లో టిబెట్-చైనాను కలుపుతూ నిర్మించిన హాంగ్ కీ బ్రిడ్జిని కొద్దిరోజుల కిందటే ప్రారంభించారు. కాగా మంగళవారం ఉదయం సమయంలో బ్రిడ్జి ప్రారంభంలోని భాగం కుప్పకూలింది. ప్రమాద సమయంలో వంతెనపైనుంచి వాహనాలు ఏమి వెళ్లకపోవడం, అక్కడ ప్రజలెవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అయితే వంతెన కూలడానికి గల కారణాలపై అధికారులు విచారణ చేపట్టారు. 758 మీటర్ల పొడవైన ఈ వంతెన సెంట్రల్ చైనాను టిబెట్ తో కలుపుతుంది. వంతెన కూలిన సమయంలో భారీగా శిథిలాలు నదిలో పడిపోయి పెద్ద ఎత్తున వ్యర్థాలు పైకి లేచాయి. ఈ చిత్రాలు సామాజిక మాధ్యమాలలో ప్రస్తుతం వైరల్ గా మారాయి. ఇండస్ట్రీయల్ సెక్టర్ లో తామెప్పుడూ ముందుంటాం అనే చెప్పుకునే డ్రాగన్ దేశంలో ఇంత పెద్ద వంతెన నిర్మించిన కొద్ది రోజుల్లోనే కూలిపోవడం ఏంటని నెటిజన్స్ చర్చించుకుంటున్నారు.

## ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లలో 'ఆరిజిన్ కంట్రీ' ఫిల్టర్ తప్పనిసరి

**న్యూఢిల్లీ:** ఈ-కామర్స్ ప్లాట్‌ఫాంలలో పారదర్శకతను పెంచే దిశగా వినియోగదారుల వ్యవహారాల శాఖ చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ప్యాకేజ్డ్ కమోడిటీలకు సంబంధించి అవి ఏ దేశం నుంచి వచ్చాయో తెలుసుకునేందుకు, వాటిని ఎంచుకునేందుకు వీలుగా సెర్చ్, సోర్టింగ్ ఫిల్టర్లలో 'కంట్రీ ఆఫ్ ఆరిజిన్' ఆప్షన్‌ను తప్పనిసరిగా పొందుపర్చాలని ప్రతిపాదించింది. విస్తృతమైన జాబితా నుంచి తమకు కావాల్సిన ప్రోడక్టును సత్వరం కనుగొనడానికి యూజర్లకు, అలాగే ఆయా ప్రోడక్టుల పర్యవేక్షణలో అధికారులకు ఇది ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొంది.

# దళారుల చేతుల్లో మోసపోవద్దు

- పత్తి రైతులకు ఎమ్మెల్యే కవ్వంపల్లి పిలుపు
- పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మానకొండూరు ఎమ్మెల్యే డా.కె.సత్యనారాయణ



కరీంనగర్ జిల్లా బ్యూరో, నవంబర్ 12 (జనంసాక్షి): దళారుల చేతుల్లో రైతులు మోసపోవద్దని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పిలుపునిచ్చారు. బుధవారం బెజ్జంకి మండలం ముత్తన్నపేట గ్రామంలో సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి మాట్లాడుతూ... పత్తి రైతులు దళారుల బారినపడకుండా ప్రభుత్వపరంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే పంట ఉత్పత్తులు విక్రయించాలని కోరారు. గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం వర్షాల కారణంగా పత్తి దిగుబడి తగ్గిందని, ఈ క్రమంలో ప్రైవేటు వ్యాపారులు, దళారులకు పత్తి విక్రయించుకోకూడదన్నారు. ప్రభుత్వం గత సంవత్సరం కన్నా ఈ ఏడాది పత్తికి మద్దతు ధర పెంచినందుకు ఈ అవకాశాన్ని పత్తి రైతులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. అయితే నాణ్యమైన పత్తికే ధర పలుకుతుందనే విషయాన్ని రైతులు గమనించాలన్నారు. పత్తి కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం కొన్ని మార్పులు చేసిందని, పత్తి రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు పడాల్సిన అవసరం రాకుండా ఉండేందుకు స్లాట్ బుకింగ్ విధానాన్ని ప్రవేశపెట్టిందని ఆయన చెప్పారు. సాంకేతిక విధానంలో వివరాలు నమోదు చేసుకోవాలని, ఈ వివరాలను ప్రత్యేక యాప్ లోని విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ద్వారా నమోదు చేయించాలని, తర్వాతనే యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు. పత్తి సేకరణ, చెల్లింపులన్నీ డిజిటల్ ట్రాకింగ్ ద్వారా పర్యవేక్షించడానికి ఈ యాప్ ఉపకరిస్తుందన్నారు. కొనుగోలు కేంద్రాలకు పత్తి తెచ్చే రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించినట్లు ఆయన తెలిపారు. అనంతరం గన్నేరువరం మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ముస్కు ఉపేందర్ రెడ్డి పెళ్లి రిసెప్షన్ కు బుధవారం రోజు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులతో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మచ్చ కుమార్, బోనాల రాజేశం, పులి సంతోష్, బైర సంతోష్, గూడెల్లి శ్రీకాంత్, చెప్యాల శ్రీనివాస్ గౌడ్, పర్శ సంతోష్, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆశీర్వాదంతో కాంగ్రెస్

- పార్టీ విజయపరంపర కొనసాగుతోంది
- 'ఇక్కడ అర్బన్ బ్యాంక్ ఎన్నికలు , అక్కడ జూబ్లీ హిల్స్ ఎన్నికలలో విజయం'
- రాబోయే రోజుల్లో అన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇదే విజయం కొనసాగుతది
- సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



కరీంనగర్ జిల్లా బ్యూరో, నవంబర్ 12 (జనంసాక్షి):

ముందే తెలిపినట్టు అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో బ్యాంక్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులను గెలిపించారని చైర్మన్ ఎన్నికతో అర్బన్ బ్యాంక్ కాంగ్రెస్ ఖాతాలోకి వచ్చిందని అర్బన్ బ్యాంక్ కాంగ్రెస్ దే అని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. ఆర్ అండ్ బి గెస్ట్ హౌజ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... జూబ్లీ హిల్స్ ఎన్నికలలో కూడా భారీ మెజారిటీతో కాంగ్రెస్ గెలుస్తుందని రాబోయే రోజుల్లో అన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇదే విజయ పరంపర కొనసాగుతుందని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఇక్కడి నుండి వెళ్లి జూబ్లీ హిల్స్ ఎన్నికలలో పనిచేసిన ప్రతి నాయకునికి కార్యకర్తకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాలతో పాటు నగర ప్రజలు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల సంతృప్తితో ఉన్నారని రాబోయే రోజుల్లో మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, లక్ష్మణ్ కుమార్, శాసన సభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం ల సహకారంతో కాంగ్రెస్ పార్టీ నాయకులం, కార్యకర్తలం మరింత రెట్టింపు ఉత్సాహంతో పని చేస్తామని నరేందర్ రెడ్డి అన్నారు. సుడా నిధులతో పలు అభివృద్ధి, సుందరీకరణ పనులు చేపట్టామని రాజీవ్ చౌక్ సుందరీకరణతో పాటు రాజీవ్ గాంధీ కాంస్య విగ్రహం ఏర్పాటు చేస్తున్నామని, వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ముందు కూడలి సుందరీకరణ చేస్తున్నామని, ప్రధాన రహదార్లలోని డ్రైనేజీలపై వర్టికల్ గార్డెన్లు ఏర్పాటు చేస్తామని, అల్గునూర్ బ్రిడ్జి పై గార్డెన్ ఏర్పాటు చేస్తామని వీటితో పాటుగా అవసరమైన ప్రాంతాలలో అభివృద్ధి పనులు చేపట్టి అన్ని స్థానిక సంస్థల ఎన్నికలలో విజయ పరంపర కొనసాగిస్తామని నరేందర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎండి తాజ్, కొరివి అరుణ్ కుమార్, కుర్ర పోచయ్య, ఎండి చాంద్, అస్థపురం రమేష్, అనిల్ కుమార్, మిరాజ్, బషీర్, భారీ, ఆంజనేయులు, అష్రఫ్, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల పరిసరాలను పరిశుభ్రం చేయాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



**మంథని, (జనంసాక్షి) :** గురుకుల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మంథని లోని గురుకులం పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ.. హాస్టల్ లో అందించే భోజనం నాణ్యత పెంచాలని , విద్యార్థులకు రుచికరంగా వంటలు చేయించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. హాస్టల్ ప్రాంగణంలో ఉన్న పిచ్చి మొక్కలను వెంటనే తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు. రాబోయే 10వ తరగతి పరీక్షలలో ప్రతి ఒక్క విద్యార్థి ఉత్తీర్ణత సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రతిరోజు స్టడీ అవర్స్ నిర్వహించాలని ముఖ్యమైన పాఠ్యాంశాలను రివిజన్ చేయించాలని కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ఘనంగా ఖేల్ ఉత్సవ్

**అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి. నరేందర్ రెడ్డి**



**కరీంనగర్, నవంబర్ 12 (జనంసాక్షి) :** విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించాలని వాటిలో పాల్గొనేందుకు ప్రోత్సాహం అందించాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి. నరేందర్ రెడ్డి కొత్తపల్లి లోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో నిర్వహించినటువంటి "ఖేల్ ఉత్సవ్" కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులకు ఇష్టమైన క్రీడలలో శిక్షణ ఇప్పించాలని, నైపుణ్యం సాధించే విధంగా ప్రోత్సాహం అందించాలని వారు తెలిపారు. ప్రాథమిక శిక్షణలో ఇచ్చినటువంటి ప్రోత్సాహాన్ని కొనసాగిస్తూ విద్యార్థుల్లో దాగిన ప్రతిభను వెలికి తీస్తున్నామని చెప్పారు. ప్రాథమికంగా పాఠశాల స్థాయిలో నిర్వహించి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని వారు చెప్పారు. వార్షిక ప్రణాళికలో భాగంగా విద్యార్థులకు వివిధ రకాల క్రీడల పోటీలను నిర్వహించడం జరిగిందని, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బాలల దినోత్సవాన్ని బహుమతి ప్రధానం చేయడం జరుగుతుందని వారు చెప్పారు. ఉత్సవాలలో భాగంగా ఫుట్బాల్, బాస్కెట్ బాల్, త్రో బాల్, నెట్బాల్, ఖోఖో, కబడ్డి, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, చెస్ తదితర క్రీడలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

# ప్రజాసమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం






- హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి
- బొమ్మనపల్లిలో మట్టి రోడ్డు మరమ్మతుల కోసం పనులు ప్రారంభం

**చిగురుమామిడి నవంబర్12( జనంసాక్షి) :** ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పని చేస్తుందని హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి తెలిపారు. బుధవారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి గ్రామం నుండి చిగురుమామిడి మండల కేంద్రానికి వెళ్లే మట్టి రోడ్డు మరమ్మతు పనులకు మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి కొబ్బరికాయలు కొట్టి పనులను ప్రారంభించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పలుచోట్ల కోతలకు గురై, పెద్ద పెద్ద గుంతలై అధ్వానంగామారింది. దీంతో రాకపోకలకు రైతులకు, ప్రజలకు, ప్రయాణికులకు చాలా ఇబ్బందికరంగా మారింది. వెంటనే కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లడంతో మంత్రి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ పమేల సత్పతి లక్ష 90వేల రూపాయలను మట్టి రోడ్డు మరమ్మత్తుల కోసం మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ రోడ్డు గుండా నిత్యం ప్రజలతోపాటు రైతులు పెద్ద ఎత్తున వ్యవసాయ పొలాలకు, తోటల్లోకి వెళ్లేందుకు రాకపోకలు సాగిస్తారు. ఈ రోడ్డు గుండా ప్రయాణం చేసేందుకు వాహనదారులు, రైతులు పడుతున్న ఇబ్బందులను మంత్రికి వివరించారు. తమ సమస్య పరిష్కారానికి వెంటనే స్పందించి నిధులు మంజూరు చేయించిన మంత్రి పొన్నం ప్రభాకర్ కు బొమ్మనపల్లి గ్రామ ప్రజలు రైతులు ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఐరెడ్డి సత్యనారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఠాకూర్ నరేందర్ సింగ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి వేముల నాగరాజు, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు మాచమల్ల రమణయ్య, ప్రధాన కార్యదర్శి మడమ డకల రాజిరెడ్డి, గ్రామ శాఖల అధ్యక్షులు పూదరి వేణుగోపాల్, ఎనగందుల లక్ష్మన్, బడుకోలు దేవేందర్ రెడ్డి, గుజ్జుల తిరుమల్ రెడ్డి, గాజుల అంజిరెడ్డి, చింతనిప్పుల వెంకన్న, కానుగంటి సత్యం రెడ్డి, మాచమల్ల కిషోర్, మామిడి చంద్రమౌళి, మల్లిఖార్జున్ రెడ్డి, కత్తుల దేవేందర్ యాదవ్, గాజుల ఆనందరెడ్డి, కరివేద ఈశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సన్నాహాలు పూర్తి

- జ్ఞాన దీపాలు వెలిగించే ఏడు రోజుల మహోత్సవం
- పుస్తక ప్రదర్శనలు, కవిసమ్మేళనాలు, క్విజ్‌లతో సాంస్కృతిక వైభవం
- చైర్మన్ మల్లేష్ పిలుపు



**కరీంనగర్, నవంబర్ 12 (జనంసాక్షి) :** జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్ ఆధ్వర్యంలో, కార్యదర్శి సరిత సమన్వయంతో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సమీక్ష సమావేశం జరిగింది. నవంబర్ 14 నుంచి 20 వరకు ఏడు రోజులపాటు వైభవంగా, ప్రజా భాగస్వామ్యంతో నిర్వహించే ఈ వారోత్సవాల కార్యక్రమాలపై విశద చర్చ జరిగింది. 14న ప్రారంభోత్సవ వేడుకలు, 15న పుస్తక ప్రదర్శన, 16న ప్రసిద్ధ వ్యక్తుల ప్రసంగాలు మరియు పుస్తక విరాళాల సేకరణ, 17న కవిసమ్మేళనం, 18న వ్యాసరచన, ఉపన్యాసాలు, క్విజ్ పోటీలు, 19న మహిళలు, పిల్లలు, దివ్యాంగుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు, రంగోలి, మెహెంది పోటీలు, 20న సాక్షరతా దినోత్సవం ముగింపు కార్యక్రమంతో వారోత్సవాలు ఘనంగా ముగుస్తాయి. చైర్మన్ సత్తు మల్లేష్ మాట్లాడుతూ గ్రంథాలయాలు కేవలం పుస్తకాల భద్రపరిచే ప్రదేశాలు మాత్రమే కాదు, జ్ఞానం, ఆలోచన, చైతన్యం పంచే ఆలయాలని, పుస్తకం ప్రతి మనిషి జీవితాన్ని మారుస్తుందని అన్నారు. ఈ వారోత్సవాల ద్వారా పుస్తకాల పట్ల ఆసక్తిని పెంపొందించి, చదువుతో సమాజాన్ని చైతన్యవంతం చేయడమే లక్ష్యమని స్పష్టం చేశారు. యువత, విద్యార్థులు, మహిళలు, ప్రతి పౌరుడు ఈ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని పఠన సంస్కృతిని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.



# ఆర్జీ-2 ఏరియాలో 'సైబర్ జాగ్రిత్ భారత్'

**యైటింక్లయిన్ కాలనీ (జనంసాక్షి) :** సింగరేణి ఆర్జీ-2 జీఎం కార్యాలయంలో జాతీయ సైబర్ సెక్యూరిటీ అవేర్నెస్ మంత్, అక్టోబర్-2025 శీర్షికలో భాగంగా 'సైబర్ జాగ్రిత్ భారత్' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేట్ ఆఫీస్ నుండి డీజీఎం (ఐటీ) ఎం. శ్రీనివాస రావు, ఐటీ మేనేజర్ నాన ఫార్నవీస్ హాజరై సైబర్ నేరాలపై పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్య మాట్లాడుతూ ఉద్యోగులు సైబర్ నేరల పట్ల అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఉద్యోగులు ఎవరూ సైబర్ నేరగాళ్ల భారీన పడి మోస పోవొద్దని ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు తరుచు జరుగుతూ ఉంటే ఉద్యోగుల్లో అవగాహన కలుగుతుందని తెలిపారు. ఆనంతరం ఉద్యోగులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ఎల్. ప్రకాష్, ఎస్ఓటుజీఎం మాలోత్ రాముడు, ఏరియా అధికార ప్రతినిధి (పర్సనల్) పీ..అరవింద్ రావు, ఏరియా ఇంజనీర్ సుజన్ మెహెర్, ఏరియా రక్షణాధికారి సంతోష్‌కుమార్, డీజీఎం (ఇఅండ్ఎం) వెంకటరాంరెడ్డి, ఐటీ మేనేజర్ అశ్విని, డీవైపీఎంలు నలివెల్లి వేణుగోపాల్, నందికొండ వంశీధర్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ఎస్. సాధన్, ఇతర అధికారులు, జీఎం కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# జాతీయ ఆర్చరీ పోటీలకు ఎంపికైన హరిణి రెడ్డి

- కాంస్య పతకంతో రాష్ట్ర ఛాంపియన్‌షిప్‌లో మెరిసిన గ్రామీణ బాలిక
- పారమిత పాఠశాల విద్యార్థినిని కలెక్టర్ పమేలా సత్పతి అభినందాలు



**కరీంనగర్, నవంబర్ 12 (జనంసాక్షి) :** తెల్లాపూర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ అండర్-18 బాల బాలికల ఆర్చరీ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాల 10వ తరగతి విద్యార్థిని తాడూరి హరిణి రెడ్డి అత్యుత్తమ ప్రదర్శన పొంది కాంస్య పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. తెలంగాణ ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఈ పోటీల్లో హరిణి రెడ్డి చూపిన నైపుణ్యం అందరినీ ఆకట్టుకుందని పాఠశాల డైరెక్టర్ హన్మంత రావు తెలిపారు. ఈ నెల 25 నుంచి 30 వరకు అరుణాచల్ ప్రదేశ్‌లోని ఈటానగర్‌లో జరగబోయే 24వ జాతీయస్థాయి సబ్‌జూనియర్ ఆర్చరీ బాలబాలికల అండర్-18 ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో హరిణి రెడ్డిని ప్రత్యేకంగా కలిసి అభినందించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చి ఇట్లం మెరిసిన బాలికలు దేశవ్యాప్తంగా స్పోర్ట్స్ రంగంలో మార్గదర్శకులుగా నిలుస్తా రని, హరిణి రెడ్డి వంటి యువతకు ప్రభుత్వం ఎలాంటి పరిమితులు విధించకుండా ప్రోత్సాహం ఇస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు. పాఠశాల చైర్మన్ డాక్టర్ ఇ. ప్రసాద్ రావు, డైరెక్టర్లు ప్రసూన్, అనూకర్ రావు, రశ్మిత, వి.యు.యం. ప్రసాద్, వినోద్ రావు, హన్మంత రావు, ప్రధానోపాధ్యాయుడు గోపికృష్ణ, సమన్వయకర్త రబీంద్ర పాత్రో, వ్యాయామ ఉపాధ్యాయులు యస్. రాజు, రాజబాపు, శ్రీనాథ్, గోలి సుధాకర్‌లు కలిసి హరిణి రెడ్డిని అభినందించి, జాతీయ పోటీల్లో మరింత మెరిసి పతకాలు సాధించాలని ఆశిస్సు తెలిపారు. ఈ విజయం పారమిత పాఠశాలలోని విద్యార్థులను మరింత ఉత్సాహపరిచి, స్పోర్ట్స్ రంగంలో ఆసక్తి పెంచుతోందని డైరెక్టర్ హన్మంత రావు పేర్కొన్నారు.

# రాత్రికి రాత్రి ఆలయాని ఎందుకు మూసివేశారు

- ఆలయం ముందు పోలీసుల బందోబస్తు
- మాట్లాడుతున్న బిజెపి నాయకులు



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి నవంబర్ 12 (జనంసాక్షి) :** వేములవాడ రాజన్న ఆలయాన్ని రాత్రికి రాత్రి పోలీస్ బందోబస్తు పెట్టి ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా బుధవారం దర్శనాలు నిలిపివేయడాన్ని బీజేపీ నాయకులు ఆలయ అధికారుల తీరుపై బుధవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర నాయకుడు ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ పనుల్లో దేవాలయ అధికారులు గానీ, ప్రజా ప్రతినిధులు గాని సరైన క్లారిటీ ఇవ్వకుండా, రాత్రికి రాత్రి ఆలయ అధికారులు పోలీస్ బందోబస్తుతో రాజన్న ఆలయాన్ని మూసివేయడం ఏంటని అయన ప్రశ్నించారు. ఏడాదికాలంగా దేవాలయ విస్తరణపై ఎపిసోడ్ నిర్వహిస్తున్నారని, అర్ధరాత్రి పోలీస్ బందోబస్తు పెట్టి రాజన్న ఆలయాన్ని మూసివేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. హిందువులు ఉగ్రవాదులు, తీవ్రవాదులు కాదన్నారు. సమ్మక్కకు వచ్చే భక్తులకు ఎలాంటి ఆటంకాలు కలిగించకుండా దర్శనాలు కల్పించాలని, విస్తరణ పనుల్లో దర్గాను తొలగిస్తారా లేదా అని, దేవాలయం లోపల జరిగే విస్తరణ పనులు భక్తులకు ఎల్ఈడి స్క్రీన్ ద్వారా తెలియజేయాలని డిమాండ్ చేశారు. అభివృద్ధికి బిజెపి పార్టీ వ్యతిరేకం కాదని, ఆలయం మూసివేస్తే ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా కానీ అనేక కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. ముందుగా ఆలయంలోని దర్గాను తొలగించిన తర్వాతే దేవత మూర్తుల విగ్రహాలను ముట్టుకోవాలన్నారు. దర్శనాల నేపథ్యంలో భక్తులకు ప్రజలకు స్పష్టమైన ప్రకటన ఇవ్వాల్సిన బాధ్యత ఆలయ అధికారులకు లేదా అంటూ ప్రశ్నించారు. అనంతరం బిజెపి పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ మాట్లాడుతూ రాజన్న ఆలయాన్ని హుటాహుటిన దర్శనాలు నిలిపివేయడమేంటని ఆలయ అధికారుల తీరుపై మండిపడ్డరు. ఆలయము లోపలికి వెళ్లకుండా రేకులను అమర్చి అష్టదిగ్బంధం చేశారన్నారు. ఆలయ అభివృద్ధిలో దర్గాను తొలిగించాకా కోటిలింగాలను తొలగించాలన్నారు. దర్గాను తొలగించకుండా మా హిందూ దేవత మూర్తులను తొలగిస్తే జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాజపా నాయకులు రేగుల రాజకుమార్, మెరుగు లక్ష్మణ్, అన్నం నరసయ్య, పిన్నింటి హనుమాన్లు, నామాల శేఖర్, రఘుపతి, నేరెళ్ల సాయి, గుడిసె మనోజ్, లాల శేఖర్, సగ్గు రాహుల్, గుంటి కనకయ్య, జవాజీ శేఖర్ పాల్గొన్నారు.

# మత్తు పదార్థాల నిర్మూలనే లక్ష్యంగా కృషి చేద్దాం

**గోడలకు పోస్టర్లను అంటించి వీపీవోల అవగాహన**



**చిగురుమామిడి నవంబర్ 12 (జనంసాక్షి):** మత్తు పదార్థాల నిర్మూలనే లక్ష్యంగా సమిష్టి కృషితో ముందుకు వెళ్దామని విలేజ్ పోలీస్ ఆఫీసర్స్ అనసూయ, రూప దేవిలు పిలుపునిచ్చారు. పోలీస్ అధికారుల ఆదేశాల మేరకు మండలంలోని సుందరగిరి గ్రామంలో ఆ గ్రామ విలేజ్ పోలీస్ ఆఫీసర్ లు అనసూయ, రూప దేవిలు మత్తు పదార్థాల నిర్మూలనకు సంబంధించి మన ఊరు, మన బాధ్యత అనే పోస్టర్లను గోడలకు అతికిస్తూ ప్రజలకు, ప్రయాణికులకు, యువతకు అవగాహన కల్పించారు. గంజాయి లాంటి మత్తు పదార్థాలను సేవించిన, విక్రయించిన, రవాణా చేసిన సాగుచేసిన, ఆన్లైన్ బెట్టింగులు ఆడిన, ఆడించిన చట్టరీత్యా నేరమని ప్రజలకు వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి వీటి నుండి కాపాడుకోవాలని కోరారు. యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా, క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని వారు తెలిపారు. మత్తు పదార్థాలకు లోను కాకుండా ఉండే అందుకే ముందస్తుగా ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు తమ కర్తవ్యాన్ని నిర్వర్తించాలని కోరారు.

# రేడియేషన్ అపోహ మాత్రమే

- కొత్త సబ్‌స్టేషన్ వల్ల ఎలాంటి ప్రమాదం లేదు
- అధికారుల స్పష్టీకరణతో ప్రజల ఆందోళనలు తొలగినట్టే
- భద్రతా ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణం
- స్థిరమైన విద్యుత్ సరఫరాతో ప్రాంతం అభివృద్ధి



కథలాపూర్, నవంబర్ 12 : మండల శివారులో నూతనంగా నిర్మాణంలో ఉన్న టీజీ ట్రాన్స్‌కో 220/132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులపై కొందరు వ్యక్తులు వ్యక్తం చేసిన ఆందోళనలు, పత్రికల్లో ప్రచురితమైన వార్తల నేపథ్యంలో తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీజీఎన్‌పీడీసీఎల్) అధికారులు వెంటనే స్పందించారు. జగిత్యాల జిల్లాకు చెందిన టీజీఎన్‌పీడీసీఎల్ డివిజనల్ ఇంజినీర్ (టెక్నికల్) గంగారం, డివిజనల్ ఇంజినీర్ (ఆపరేషన్) మెట్‌పల్లి మధుసూదన్ సైట్‌ను పరిశీలించి, ప్రజలు, పత్రికా ప్రతినిధులతో కలిసి పరిస్థితిని వివరించారు. విద్యుత్ సబ్‌స్టేషన్లలో ఉపయోగించే ట్రాన్స్‌ఫార్మర్లు, ఐసోలేటర్లు, సర్క్యూట్ బ్రేకర్లు వంటి పరికరాలు హై వోల్టేజ్‌లో పనిచేసినా, ఇవి ఉత్పత్తి చేసే మాగ్నెటిక్ ఫీల్డ్ స్థాయిలు చాలా తక్కువగా ఉంటాయని, అంతర్జాతీయ ప్రమాణాలకు పూర్తిగా లోబడి ఉంటాయని అధికారులు పేర్కొన్నారు. ఇవి రేడియేషన్ ఉత్పత్తి చేసే పరికరాలు కావని, ఎలక్ట్రోమాగ్నెటిక్ ఫీల్డ్ (ఈఎమ్ఎఫ్) అనే సహజ విద్యుత్ క్షేత్రం మాత్రమే ఉంటుందని, అది మన శరీరానికి ఎలాంటి హానీ కలిగించదని వివరించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ), ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ నాన్-అయనైజింగ్ రేడియేషన్ ప్రొటెక్షన్ (ఐసీఎన్ఐఆర్‌పీ), సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సీఈఏ) వంటి సంస్థలు సబ్‌స్టేషన్ల వల్ల రేడియేషన్ ప్రమాదం లేదని స్పష్టంగా పేర్కొన్నాయని తెలిపారు. ఈ 220/132 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయిన తర్వాత రుద్రంగి, కథలాపూర్, మేడిపల్లి, బీమారం, కోరుట్ల మండలాల పరిధిలోని గ్రామాలు, పట్టణాలు, వ్యవసాయ మోటార్లకు స్థిరమైన విద్యుత్ సరఫరా లభిస్తుందని వివరించారు. ప్రస్తుతం ఉన్న సబ్‌స్టేషన్లపై అధిక లోడ్ ఉండటంతో వోల్టేజ్ ఫ్లక్చుయేషన్లు ఎక్కువగా జరుగుతున్నాయని, ఈ కొత్త సబ్‌స్టేషన్ ప్రారంభమైతే ఆ సమస్య పూర్తిగా తీరిపోతుందని పేర్కొన్నారు. అదనంగా, వోల్టేజ్ తేడాల వల్ల కాలిపోయే నియంత్రకలు, విద్యుత్ మోటార్లు, గృహోపకరణాలు భద్రంగా పనిచేస్తాయని తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తిగా భద్రతా ప్రమాణాలకు లోబడి, ఆధునిక సాంకేతిక పద్ధతుల్లో జరుగుతోందని, టీజీ ట్రాన్స్‌కో మరియు టీజీఎన్‌పీడీసీఎల్ సంయుక్త పర్యవేక్షణలో ప్రతీ దశలో నాణ్యతా నియంత్రణ జరుగుతోందని అధికారులు తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ వల్ల ప్రజలకు ఎలాంటి హానీ లేదని, భద్రతా దృష్ట్యా టీజీ ట్రాన్స్‌కో మరియు టీజీఎన్‌పీడీసీఎల్ ఎప్పటికప్పుడు ప్రమాణాలు పాటిస్తూ పని చేస్తోందని, రేడియేషన్ అనేది కేవలం అపోహ మాత్రమేనని, ప్రజలు ఈ విషయంలో నిర్భయంగా ఉండాలని పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా జరిగిన పత్రికా సమావేశంలో టీజీఎన్‌పీడీసీఎల్ డివిజనల్ ఇంజినీర్ (టెక్నికల్) గంగారం, డివిజనల్ ఇంజినీర్ (ఆపరేషన్) మధుసూదన్, ఏడీఈ కమర్షియల్ జీటీ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ ఇంజినీర్ కథలాపూర్ దివాకర్, అసిస్టెంట్ ఇంజినీర్ అంబరిపేట భూమేశ్వర్, టీజీ ట్రాన్స్‌కో ఏఈ (సివిల్/ఓఎంసీ) కరీంనగర్ రాజ్ భారత్, సబ్ ఇంజినీర్ కథలాపూర్ నవీన్, సబ్‌స్టేషన్ కాంట్రాక్టర్ మరియు పత్రికా సోదరులు పాల్గొన్నారు.

# ఆర్థిక మద్దతు పథకాల లక్ష్య సాధనకు బ్యాంకర్లు సహకరించాలి

- ఆర్బీఐ నిబంధనలు కచ్చితంగా పాటించాలి
- ఈ ఆర్థిక సం.లో ఏప్రిల్ 2025 నుండి సెప్టెంబర్ వరకు రూ.7821.19 కోట్ల రుణాలు మంజూరు
- కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్ జిల్లా బ్యూరో, నవంబర్ 12 (జనంసాక్షి):** ఆర్థిక మద్దతు పథకాల లక్ష్య సాధనకు బ్యాంకర్లు సహకరించాలనీ, కచ్చితంగా ఆర్బిఐ నిబంధనలు పాటించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో బ్యాంకర్లు , జిల్లా అధికారులతో రైతులకు రుణాల పంపిణీ, స్వయం సహాయక సంఘాల రుణాలు, రికవరీ, పీఎం జి.పి.వై. రుణాలు, ఎస్సీ, బిసి, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖల పథకాలకు సంబంధించి రుణ లక్ష్య పురోగతిపై డి.సి.సి, డి.ఎల్.ఆర్.సి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో వివిధ ఆర్థిక మద్దతు పథకాల లక్ష్య సాధనకు రుణాలు అందించడంలో బ్యాంకర్లు పూర్తిస్థాయిలో సహకరించాలని సూచించారు. వివిధ ఆర్థిక మద్దతు పథకాలకు సంబంధించి వంద శాతం లక్ష్యసాధనకు బ్యాంకర్లు, ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రైతులు తమ రుణాలను రెన్యూవల్ చేసుకునే అంశం పై వారికి అవగాహన కల్పించాలని, జిల్లాలో వ్యవసాయ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ బ్యాంకర్లు ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 2025 నుండి సెప్టెంబర్ 2025 నెల వరకు రూ. 7821.19 కోట్ల రుణాలను మంజూరు చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా వ్యవసాయ అనుబంధ రంగాలకు గాను రూ. 3239.73 కోట్లు, ఎంఎస్ఎంఈ రంగంలో రూ. 1761.41 కోట్లు, విద్యా రుణాలకు రూ. 9.70 కోట్లు, హౌసింగ్ లోన్స్ రూ. 99.89 కోట్లు మహిళా సంఘాలకు రూ.614.36 కోట్లు, ఇతర రంగాలకు సంబంధించి రూ.2096. 10 కోట్లు రుణాలను మంజూరు చేసినట్లు తెలిపారు. అర్హులైన రైతులు అందరికీ రుణాలు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఉన్న లక్ష్యాల్లో 2025 సెప్టెంబర్ 30 వరకు 58.22 శాతం పూర్తయిందని, పెండింగ్ లో ఉన్న రుణాల ప్రతిపాదనలు సైతం బ్యాంకర్లు అందించి త్వరగా మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వివిధ పథకాలలో రుణాలు మంజూరి అయిన లబ్ధిదారులు, స్వయం సహాయక సంఘాలు తిరిగి సకాలంలో బ్యాంకులకు చెల్లించేలా ఆయా శాఖల అధికారులు జిల్లాలో రుణాల రికవరీ పై శ్రద్ధ వహించాలని ఆదేశించారు. యువతకు ఉపాధి అందించే విషయంలో అధికారులు చొరవ చూపాలని బ్యాంకర్లకు సూచించారు. జిల్లాలో ప్రధానమంత్రి స్వానిది కింద మొదటి, రెండవ, మూడవసారి రుణం దరఖాస్తు చేసుకున్న వారి పెండింగ్ దరఖాస్తులను, పీఎంఈజీపి పీఎం విశ్వకర్మ యోజన పథకాలకు సంబంధించి దరఖాస్తులను సత్వరం క్లియర్ చేసి పరిష్కరించాలని బ్యాంకర్లకి సూచించారు. భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖలోని ఆర్థిక సేవల విభాగం ఆదేశాలకు అనుగుణంగా 2025 అక్టోబర్ 01 నుండి డిసెంబర్ 31 వరకు "మీ డబ్బు మీ హక్కు" అనే శీర్షికతో ఆర్థిక రంగంలో క్లైమ్ చేయని ఆస్తుల పరిష్కారం కోసం జిల్లా స్థాయి ప్రచారం జరుగుతున్నదని తెలియచేసారు.

పౌరులు తమ క్లైమ్ చేయని బ్యాంకు డిపాజిట్లు, డివిడెంట్లు మ్యూచువల్ ఫండ్లు, బీమా ఆదాయాలు మొదలైన వాటిని క్లైమ్ చేసుకోవడానికి వీలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... క్లైమ్ చేయని ఆర్థిక ఆస్తులకు హక్కుదారులు అవసరమైన పత్రాలతో తమ బ్యాంకులను లేదా ఇతర సంస్థలను సంప్రదించి నిధులను తిరిగి పొందాలని, ఈ ప్రచారాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ఎల్డిఎం ఆంజనేయులు జెడ్పి సీఈవో శ్రీనివాస్, డిఆర్డిఓ శ్రీధర్, ఆర్.బి.ఐ అధికారి శ్రీనివాస్, నాబార్డ్ డిడిఎం జయే ప్రకాష్, ఎస్బిఐ ఏజీఎం వెంకటేష్, టీజీబీ ఆర్ ఎం బాల నాగు, కెడీసీసీబీ సీఈవో, అన్ని బ్యాంకుల కంట్రోలర్స్, కరీంనగర్ లోకల్ బ్రాంచ్ మేనేజర్స్, డిఎఓ, జిల్లా పరిశ్రమల కేంద్రం జిఎమ్, డిడబ్ల్యూఓ సరస్వతి పిడి మెప్మా సునీత, తదితరులు పాల్గొన్నారు.



# రాజన్న ఆలయ అభివృద్ధికి సహకరించండి

- రూ. 150 కోట్లతో రాజరాజేశ్వర స్వామి ఆలయంతో పాటు పట్టణ అభివృద్ధి
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

**వేములవాడ, నవంబర్ 12 (జనంసాక్షి):** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రాజన్న ఆలయంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. రూ.150 కోట్లతో వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంతో పాటు పట్టణ అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా కొనసాగుతున్నాయని ఆయన వెల్లడించారు. ఆలయ అభివృద్ధి పనులను అకస్మాత్తుగా తనిఖీ చేసిన విప్, అధికారుల నుంచి పురోగతి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలయాభివృద్ధిపై ప్రత్యేక చొరవ తీసుకుని అవసరమైన నిధులను మంజూరు చేశారని చెప్పారు. శృంగేరి జగద్గురు విధిశేఖర భారతి స్వామివారి సూచనల మేరకు ఆలయ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. ఇటీవల స్వామివారు స్వయంగా వచ్చి ఆలయ పరిశీలన చేసి పలు సలహాలు ఇచ్చారని గుర్తుచేశారు. ఆలయ నిర్మాణ పనుల కారణంగా భక్తులకు ఇబ్బంది కలగకుండా భీమేశ్వర ఆలయంలో ఆర్జిత సేవల కోసం తగిన ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. స్వామివారి కళ్యాణం, కోడే మొక్కుకుంకుమ పూజ, సత్యనారాయణ వ్రతం వంటి అన్ని సేవలు అక్కడ నిర్వహించేలా ఏర్పాట్లు చేసినట్టు వివరించారు. రాజన్న ఆలయం ఎదుట ఉన్న రావిచెట్టు వద్ద భక్తులకు దర్శన సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ప్రజలు, భక్తుల మనోభావాలకు అనుగుణంగా ఆలయాభివృద్ధి జరుగుతోందని, అందరి సలహాలు, సూచనలను పరిగణలోకి తీసుకుంటున్నామని ఆది శ్రీనివాస్ అన్నారు. రాజన్న భక్తులు, వేములవాడ ప్రజలు, తెలంగాణ వ్యాప్తంగా ఉన్న భక్తులు ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

# రాజన్న ఆలయంలో దర్శనాలు బంద్

## ఎల్ఈడి స్క్రీన్‌లపై రాజన్న దర్శనం



**వేములవాడ, (జనం సాక్షి) :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం బుధవారం అర్ధరాత్రి నుండి దర్శనాలు బంద్ చేశారు. ఆలయంలో భక్తులు దర్శనాలకు వెళ్లకుండా ఆలయ అభివృద్ధిలో భాగంగా ఆలయ ప్రధాన గేటుకు ఇనుప రేకులు అమర్చారు. భక్తుల దర్శనాల నిమిత్తం ఆలయం ముందు స్వామివారి ప్రచార రథంపై ఎల్ఈడి స్క్రీన్లు ఏర్పాటు చేసారు. భీమేశ్వరా లయంలో ఇప్పటికే రాజన్న కోడెమొక్కులు, దర్శనాలు కల్పించారు. ఆలయ అభివృద్ధిలో పనులు భాగంగా గత నెల రోజుల నుండి ఆలయం ఇరువైపులా కూల్చివేతలు పనులు చురుగ్గా సాగుతున్నా యి. ఈ నేపథ్యంలో రాజన్న ఆలయం ప్రధాన గేటుకు ఇనుప రేకులు బుధవారం తెల్లవారుజామున అమర్చడంతో భక్తులు రాజన్న దర్శనానికి వీలు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి

- పేద విద్యార్థులకు మెరుగైన విద్య అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**వేములవాడ, నవంబర్ 12 (జనంసాక్షి) :** పేద విద్యార్థులకు మెరుగైన విద్య, అందించడమే ప్రజా ప్రభుత్వ ప్రాధాన్యతా లక్ష్యంగా పని చేస్తున్నామని, విద్యార్థుల ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.బుధవారం వేములవాడ మండలం లోని మహాత్మ జ్యోతిబాపూలే గర్ల్స్ స్కూల్లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల హక్కుల గురించి, విద్య యొక్క ప్రాముఖ్యత, బాల్య వివాహాల పై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమనీకి రాష్ట్ర ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై తెలంగా ణ రాష్ట్ర బాలలహక్కుల పరిరక్షణ కమిషన్ మెంబర్ శ్రీమతి మర్రిపల్లి చందనతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు ముఖ్యంగా ఆడపిల్లలను కచ్చితంగా చదివిపించాలన్నారు. ఎవరిని కూడా పనులకు పంపించకూడదు అని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి సహాయ సహకారాలయినా అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అలాగే అధికారులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారు అని తెలిపారు. విద్య పట్ల ప్రభుత్వానికి ఉన్న ప్రాముఖ్యత, పేదలు చదువుకునే పాఠశాలలు, కళాశాలలు, రెసిడెన్షియల్ విద్యా సంస్థల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు ప్రభుత్వ విప్ పేర్కొన్నారు. రెసిడెన్షియల్ విద్యార్థులు చదువుకునే పేద పిల్లల కోసం ప్రజా ప్రభుత్వం 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్ చార్జీల పెంచామని అన్నారు. పేద పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని లక్ష్యంతో కామన్ డైట్ మేన్యూ ప్రవేశ పెట్టామని అన్నారు. నూతనంగా 11 వేల టీచర్ పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేసి ప్రభుత్వ పాఠశాలలో నియమించామని అన్నారు.ఉపాధ్యాయులకు సంబంధించిన బదిలీలు పదోన్నతులు పారదర్శకంగా చేశామని అన్నారు. విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకుని వస్తున్నామని, ఐటిఐ కళాశాలను రతన్ టాటా కంపెనీతో అనుసంధానం చేసుకొని అడ్వాన్స్ ట్రేడ్ సెంటర్లుగా మారుస్తున్నామని అన్నారు. 200 కోట్ల రూపాయలను ఖర్చు చేసి 20 నుంచి 25 ఎకరాల స్థలంలో యంగ్ ఇండియా సమీకృత గురుకుల నిర్మాణ పనులు ప్రభుత్వం చేపట్టిందని అన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, జిల్లా విద్యాధికారి వినోద్ కుమార్, ఏసిడిపిఓ సుచరిత, కేజీబీవీ కోఆర్డినేటర్ పద్మజ, సూపర్వైజర్ శంకరమ్మ, ఎల్సిపిఓ అంజయ్య, కేజీబీవీ ప్రిన్సిపల్ పాఠశాల సిబ్బంది , ఐసిపిఎస్ చైల్డ్ లైన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో రైస్ మిల్ పనితీరును పరిశీలించిన జిల్లా కలెక్టర్

**కామారెడ్డి జిల్లా ప్రతిది (జనం సాక్షి) :** బుధవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మినీ రైస్ మిల్ పనితీరును పరిశీలించారు. మినీ రైస్‌మిల్ యొక్క కార్యకలాపాలను పరిశీలించిన అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామ స్థాయిలో ఇటువంటి యూనిట్లు ఏర్పాటు చేయడం ద్వారా రైతులు, స్థానిక మహిళా సంఘాలకు ఆర్థిక లాభం కలుగుతుందని, దీనిని ఒక ఎంటర్‌ప్రైజ్ గా అభివృద్ధి చేయాలని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.మినీ రైస్ మిల్ గంటకు సుమారు 250 కిలోల వడ్లను ప్రాసెసింగ్ చేసి బియ్యంగా మారుస్తుందని, దీనికి సింగిల్ ఫేస్ కరెంట్ సరిపోతుందని, అలాగే పాలిష్ స్థాయిని అవసరానికి అనుగుణంగా నియంత్రించే సదుపాయం ఉన్నదని వివరించారు.జిల్లా కలెక్టర్ ఈ సాంకేతిక పరిజ్ఞానం గ్రామీణ స్థాయిలో ఉపాధి అవకాశాలు సృష్టించగలదని, రైతు ఆదాయాన్ని పెంచడంలో దోహదం చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ సురేందర్, అడిషనల్ డిఆర్‌డిఓ విజయలక్ష్మి, డిసిఓ, డీఎస్‌సిఓ, డిపిఎం, అన్ని మండలాల ఏపీఎం లు పాల్గొన్నారు.

## బొంపల్లి గ్రంధాలయాన్ని తిరిగి తెరిపించండి

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 12 (జనం సాక్షి)**

కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం బొంపల్లి గ్రామ గ్రంథాలయాన్ని తిరిగి తెరిపించాలని గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డిన్ ని కలిసిన మాజీ జెడ్పిటిసి రాజేశ్వరరావు కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం బొంపల్లి గ్రామంలో గ్రామీణ గ్రంథాలయాన్ని ఇటీవల మూసివేయడం తో తిరిగి తెరిపించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి మాజీ జెడ్పిటిసి తో పాటు పలువురు కలిసి వినతి పత్రం అందజేశారు. ఎన్నో ఏళ్లుగా గ్రామీణ గ్రంథాలయం ఉండగా గత ఆరేళ్ల క్రితం గ్రంధ పాలకుడు మృతి చెందడంతో మూసివేసారని తెలిపారు మళ్లీ గత చైర్మన్ పున్న రాజేశ్వర్ హాయంలో పునరుద్ధరించారని ఇటీవల దాన్ని మూసివేశారన్నారు. అందుకు చైర్మన్ స్పందిస్తూ గ్రామపంచాయతీ నుంచి లెటర్ తీసుకొచ్చి తిరిగితేర్పిస్తామని నిరుద్యోగులకు విద్యార్థులకు ఎలాంటి నష్టం జరగకుండా చూస్తామన్నారు గ్రంధాలయం తెరిపించే బాధ్యత తీసుకుంటానని గ్రామ పెద్దలు యువత పెడదారిని పట్టకుండా గ్రంథాలయానికి తీసుకొచ్చే బాధ్యత తీసుకోవాలని సూచించారు.

త్వరలోనే గ్రామానికి వచ్చి గ్రామ పెద్దలు యువకులతో మాట్లాడి పునరుద్ధరించడానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. చైర్మన్ కలిసిన వారిలో మాజీ జెడ్పిటిసి పడిగెల రాజేశ్వరరావు పద్మాజివాడి సింగిల్ విండో చైర్మన్ గంగాధర్, దేవాలయ చైర్మన్ రాజిరెడ్డి, విఠల్రావు, బాలచంద్రన్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డి జిల్లా మహిళా సమైక్య ఉత్పత్తుల

# లోగోను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 12 (జనంసాక్షి) :** బుధవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తన ఛాంబర్ లో కామారెడ్డి జిల్లా మహిళా సమైక్య ఉత్పత్తుల లోగో ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య ద్వారా ఆయుర్వేద ఉత్పత్తుల మార్కెటింగ్ కామారెడ్డి జిల్లాలో మహిళా సమాఖ్య సంఘాల ద్వారా ఒక కొత్త శకానికి నాంది పలికారని అన్నారు.ఆరోగ్యం, ఆదాయం ఆనందం అనే నినాదంతో కామారెడ్డి మహిళా శక్తి అనే బ్రాండ్ తో ఆయుర్వేద ఉత్పత్తులు మార్కెటింగ్ చేయుటకు కామరెడ్డి జిల్లా సమైఖ్య మండల సమాఖ్యలు ముందుకు రావడం జరిగిందన్నారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మహిళా సమాఖ్యలు మహిళా సంఘాలు ద్వారా ఉత్పత్తి కాబడిన అన్ని రకాలైన వస్తువులను కామారెడ్డి మహిళా శక్తి బ్రాండ్ తో మార్కెటింగ్ చేయడం జరుగుతుందని తద్వారా మహిళలని మార్కెటింగ్ ఆర్థిక అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. కామారెడ్డి మహిళా శక్తి బ్రాండ్ ద్వారా మొట్టమొదటిగా గ్రామీణ మహిళలకు ఉపయోగపడే నిత్యవసర వస్తువులను ఎటువంటి కెమికల్స్ లేనటువంటి విధంగా ఆయుర్వేద పద్ధతులతో తయారైన 8 రకాలైన వస్తువులను ఒక కిట్టు ను తయారుచేసి మహిళా సంఘ సభ్యులకు మార్కెటింగ్ చేయుటకు నిర్ణయించారని ఇందులో మొత్తం 8 రకాల వస్తువులను కేవలం 300 రూపాయలకే అందించడానికి ప్రణాళికలు రూపొందించింది ముందుకు వచ్చి ఈ కార్యక్రమం చేస్తుందులకు జిల్లా కలెక్టర్ వారిని అభినందించారు రాబోయే రోజుల్లో చాలా రకాలైన ఉత్పత్తులతో మహిళలు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ కోరారు.ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఒ సురేందర్, అదనపు డిఆర్‌డిఒ కెపి విజయలక్ష్మీ, జిల్లా సమాఖ్య ఒబి సభ్యులు రాజమణి, లక్ష్మి ఇసి సభ్యులు, డిపిఎంలు, ఎపిఎంలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్య కళాశాలలో వైట్ కోట్ సెరిమని, కడవెరిక్ ఓత్ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు

**కామారెడ్డి, నవంబర్ 12 (జనంసాక్షి) :** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం 100 మంది విద్యార్థుల కోసం వైట్ కోట్ సెరిమనీ, కడవెరిక్ ఓత్ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి, నూతన విద్యార్థులకు వైట్ కోట్లు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య వృత్తిలో నైతిక విలువలు, క్రమశిక్షణ, సేవాభావంతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినందుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. వాల్య ఎమ్మెస్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. యం. వి. కుమారి, హీరమాన్ అసిస్టెంట్ డైరెక్టర్ అడ్మినిస్ట్రేషన్, అధ్యాపకులు, సిబ్బంది, పాల్గొన్నారు.

# ధాన్య కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- రైతుల ఖాతాల్లో వెంటనే డబ్బులు జమ చేయాలి
- రైతు సంఘం జిల్లా నాయకుడు మోహన్ పటేల్ డిమాండ్
- సదాశివనగర్ మండల కమిటీ నూతన ఎన్నికలు
- రైతుల ఆందోళనలు పెద్ద ఎత్తున చేపడతామని హెచ్చరిక



**కామారెడ్డి, నవంబర్ 12 (జనంసాక్షి) :** ఐకేపీ కేంద్రాల్లో 30 రోజులకు పైగా వరి ధాన్యం తెచ్చిన రైతులు కొనుగోళ్ల కోసం ఆత్మీయంగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి, అమ్మిన రైతుల ఖాతాల్లో వెంటనే డబ్బులు జమ చేయాలని రైతు సంఘం జిల్లా నాయకుడు దొడ్లే మోహన్ పటేల్ డిమాండ్ చేశారు. సదాశివనగర్ మండల కేంద్రంలో జరిగిన మండల స్థాయి రైతుల సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన మోహన్ పటేల్ మాట్లాడుతూ, ఆరుగాలం కష్టపడి వేలాది రూపాయల అప్పులు చేసి పంట పండించిన రైతులు అధిక వర్షాలతో దెబ్బతిన్నప్పటికీ కష్టపడి సేకరించిన కాస్త వరి ధాన్యాన్ని మార్కెట్లకు తీసుకొచ్చారని, అయినా కొనేవారే లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం తెచ్చిన రైతులు మార్కెట్లో ఎదురుచూస్తున్నారని, నిల్వ కోసం సరైన వసతులు లేక ధాన్యం తడిసి ఇబ్బందులు పడ్డారని, ఒక్కొక్క రైతు 10 నుంచి 15 వేల రూపాయలు ఖర్చు చేసి కూలీలకు డబ్బు ఇచ్చి ఆరబెట్టారని, అంతా చేసినా కొనుగోళ్లు జరగకపోవడం తీవ్ర నిర్లక్ష్యమని ఆరోపించారు. ప్రభుత్వం, అధికారులు తీవ్రమైన నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారని, ఇప్పటికైనా తెచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కృష్ణ, కృష్ణరాజు, గంగాధర్ స్వామి, దశరథ్, రాములు, శ్రావణ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలోనే రైతు సంఘం సదాశివనగర్ మండల నూతన కమిటీని ఏర్పాటు చేశారు. మండల అధ్యక్షుడిగా గడ్డం శ్రావణ్ రెడ్డి, కార్యదర్శిగా పబ్బా దశరథ్ పటేల్, ఉపాధ్యక్షులుగా సంజీవ్ పటేల్, నరేష్, సహాయక కార్యదర్శులుగా రజనీకాంత్, రాములు, కోశాధికారిగా భాస్కర్ రెడ్డి, మరియు 16 మంది సభ్యులతో కమిటీ ఏర్పడింది.



బిచ్కుందలో రైతుల ధర్నా

# రోజుకో నిభందనతో రైతు పరేషాన్

**బిచ్కుంద నవంబర్ 12 (జనంసాక్షి) :** సోయ కొనుగోలుపై రోజుకో నిబంధన పెట్టి రైతులకు ఇబ్బంది గురిచేస్తున్న ప్రభుత్వం అకాల వర్షం కారణంగా సోయలో డ్యామేజ్ అండ్ మట్టి రేణువులు రావడం వల్ల మార్కెడ్ సిబ్బంది రోజుకో మాటలు మాట్లాడి రైతులకు ఇబ్బంది గురి చేస్తున్నారని రైతులు వాపోయారు. గత ప్రభుత్వం ఎకరానికి సోయ 10 క్వింటాళ్లు కొనుగోలు చేసేది ఇప్పుడు ఎకరానికి 7 క్వింటాళ్లు 50 కిలోలు మాత్రమే కొనుగోలు చేస్తుంది. బిచ్కుంద రైతు వ్యవసాయ కేంద్రంలో పంటను ఆరబెట్టి తేమ శాతం వచ్చిన తర్వాత సంబంధిత అధికారులు చూసి తూకం వేసిన తర్వాత తూకం వేసిన బస్తాలని కొనుగోలు కేంద్రంలో నిలిపి (రిజెక్ట్ ) చేస్తున్నారు అని బుధవారం రైతులు అందరూ ఆగ్రహించి రోడ్డు మీదికి వచ్చి సోయా కొనుగోలుపై నిరసన వ్యక్తం చేయడం జరిగింది. దీంతో సోయా కొనుగోలు విషయంలో ప్రభుత్వ అధికారుల తీరు పట్ల రోడ్డుపై సోయలను వేసి వేసి నిప్పంటించారు. సంఘటన స్థలానికి బిచ్కుంద ఎస్ఐ మోహన్ రెడ్డి చేరుకొని రైతులతో, వ్యవసాయ అధికారులతో మాట్లాడారు. గురువారం రోజున మొత్తం కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని అధికారులు సమాధానం తెలుపడంతో నిరసన ఆపివేశారు.

# కాంగ్రెస్ అంటేనే రైతు ప్రభుత్వం

## ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు



**మంథని, (జనంసాక్షి) :** కాంగ్రెస్ అంటేనే రైతు ప్రభుత్వమని... రైతులంటేనే కాంగ్రెస్ అని... రైతుకు మేలు చేసేందుకు తమ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అద్వర్యంలో బుధవారం రాత్రి మంథని మున్సిపల్ పరిధిలోని అంగులూరులో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, జిల్లా సహకార అధికారి శ్రీమాల, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, ఏఎంసి చైర్మన్ కుడుదుల వెంకన్నలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మాట్లాడుతూ... పెద్ద ఎత్తున వరి ధాన్యం సేకరణ చేపడుతున్నందున రైతుకు జవాబు దారి తనంగా ఉండి పనిచేయాలని అన్నారు. ధ్యాన్యం అమ్ముకోవడం లో రైతు పడుతున్న కష్టాన్ని గుర్తించి ఆనాడు తాను పౌర సరఫరాల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ప్రతీ గ్రామానికి ధ్యానం కొనుగోలు కేంద్రాలను తీసుకువచ్చామని అన్నారు. సన్న వడ్లను పండించే రైతును ప్రోత్సహించేందుకు మద్దతు ధరతో పాటు క్వింటాల్ కు రూ.500 బోనసు చెల్లిస్తున్నామని అన్నారు. ధాన్యం విక్రయించిన రైతులకు వెంటనే తమ బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని అన్నారు. అలాగే మంథని వ్యవసాయ మార్కెట్ యార్డులో మరిన్ని సౌకర్యాలు కల్పించి మరింత మెరుగు పరుస్తామని అన్నారు. అంతే గాకుండా రాబోయే రోజుల్లో అభివృద్ధి విషయంలో మంథనిలో మరింత మార్పు చూస్తారని అన్నారు. సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల రైతులు కొంత ఇబ్బందికి గురయ్యారని, తడిసిన ప్రతీ ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని, రైతులు ఏ మాత్రం అధైర్య పడవద్దని అన్నారు. ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, రైతులు మంత్రి శ్రీధర్ బాబును గజ మాలతో సత్కరించి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమం లో సంఘ డైరెక్టర్లు ఆకుల రాజబాబు, పెద్దిరాజు ప్రభాకర్, రావికంటి సతీష్ కుమార్, సిరిముర్తి ఓదెలు, లెక్కల కిషన్ రెడ్డి, కొత్త శ్రీనివాస్, ఉడుత మాధవి- పర్వతాల్ యాదవ్, దాసరి లక్ష్మి-మొండయ్య, టీజీఈఆర్సి సలహాదారు శశిభూషణ్ కాచే, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు అయిలి ప్రసాద్, సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్టార్ అనిల్ కుమార్, సంఘ కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్రు రమ, మాజీ ఎంపిపి కొండ శంకర్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముస్కుల సురేందర్ రెడ్డి, నాయకులు తోట్ల తిరుపతి, పెరవేన లింగయ్య, జనగామ నర్సింగ రావు, మూల పురుషోత్తం రెడ్డి, శ్రీరాంబట్ల శ్రీనివాస్, అజీంఖాన్, లైశెట్టి రాజు, పెంటరి రాజు, పెరుగు తేజ పటేల్, కొట్టే పద్మ, ఆరెల్లి కిరణ్ గౌడ్, గుండా పాపారావు, వేల్పుల రాజు, పోలు శివ, నాంపల్లి సతీష్, చంద్రు రాజమల్లు, నక్క నాగేంద్ర, పలువురు జిల్లా, మండల అధికారులు, రైతులు, కాంగ్రెస్ నాయకులూ, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి ఉత్తమ్‌తో రైతు కమిషన్ భేటీ

- ధాన్యం కొనుగోళ్ల సమయంలో రైతులు పడ్తున్న ఇబ్బందులను మంత్రి దృష్టికి తీసుకెళ్లిన కమిషన్




హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్ర సచివాలయంలో పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో రైతు కమిషన్ బృందం సమావేశమయ్యింది. ప్రధానంగా ధాన్యం కొనుగోళ్ల సమయంలో రైతులు పడ్తున్న ఇబ్బందులను కమిషన్ చైర్మన్ కొదండరెడ్డి, సభ్యులు గోపాల్ రెడ్డి, భవానీ రెడ్డి.. మంత్రి ఉత్తమ్ దృష్టికి తీసుకెళ్లారు. కొనుగోలు సెంటర్ల వద్ద రైతులకు పక్కా రసీదులు ఇవ్వకుండా అధికారులు ఇబ్బంది పెడ్తున్నట్లు వివరించారు. ఇక తూకం వేసిన ధాన్యాన్ని లారీల ద్వారా రైస్ మిల్లులకు పంపిస్తున్నారు. అయితే రైస్ మిల్లుల్లో ధాన్యం దించే వరకు రైతులను బాధ్యులుగా చేయడం సరైంది కాదన్నారు. చాలా ప్రాంతాల నుండి రైతులు ఈ విషయంపై రైతు కమిషన్ కు ఫిర్యాదులు చేసినట్లుగా మంత్రి ద్రుష్టికి తీసుకెళ్లడంతో.. వెంటనే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సివిల్ సప్లయ్ కమిషనర్ స్టీఫెన రవీంద్రకు ఫోన్ చేసి ఇలాంటివి మరో సారి జరగకుండా చూసుకోవాలని ఆదేశాలిచ్చారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కూడా రైతులకు కనీస వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు.

# హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై పోలీస్ కేసు

హైదరాబాద్, నవంబర్ 12 (జనంసాక్షి) : హైదరాబాద్ మధురానగర్ పీఎస్‌లో పాడి కౌశిక్ రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం ఎన్నికల సందర్భంగా యూసఫ్ గూడ వద్ద కౌశిక్ రెడ్డి హల్చల్ చేశారు. తన అనుచరులతో కలిసి మహమ్మద్ ఫంక్షన్ హాల్లోకి కౌశిక్ రెడ్డి దూసుకెళ్లారు. పోలీసులు వద్దని చెప్పినా వినకుండా కౌశిక్ రెడ్డి లోపలికి నెట్టుకెళ్లారు. దీంతో ఉద్రిక్తతలు రెచ్చగొట్టే ప్రయత్నం చేశారంటూ కౌశిక్ పై కేసు నమోదయింది. ట్రేస్ పాస్‌తో పాటు న్యూసెన్స్ కేసును కూడా మధురానగర్ పోలీసులు నమోదు చేశారు.

# మా సోదరుడు అమాయకుడు

- ఎవరో అతడిని ఉగ్రకుట్రలో ఇరికించారు
- డాక్టర్ సయ్యద్ అహ్మద్ మొహియుద్దీన్ సోదరుడి వెల్లడి




హైదరాబాద్, నవంబర్12 (జనంసాక్షి) : దేశంలో పెను విధ్వంసం సృష్టించేందుకు కుట్ర పన్నారనే ఆరోపణలపై హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ సయ్యద్ అహ్మద్ మొహియుద్దీన్‌ను గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ ఏటీఎస్ పోలీసులు ఆదివారం గుజరాత్‌లోని బనస్కాంత జిల్లాలో అరెస్టు చేసారు. మొహియుద్దీన్ అరెస్టుపై కుటుంబ సభ్యులు స్పందించారు. మొహియుద్దీన్ సోదరుడు ఒమర్ ఫారూఖీ మాట్లాడుతూ.. తన సోదరుడు మంచోడని, ఎవరో కావాలనే కుట్రలో ఇరికించారని ఆవేదన వ్యక్తం చేశాడు. తన సోదరుడికి ఉగ్రవాద కార్యకలాపాలతో లింక్స్ ఉన్నట్లు తెలియదని చెప్పాడు. ఒకవేళ తమ సోదరుడు తప్పు చేస్తే కఠినంగా శిక్షించండని ఒమర్ ఫారూఖీ అన్నాడు. చార్మినార్‌లోని రెహమానియా మదర్సాలో మౌలనాగా పనిచేస్తున్న ఒమర్ ఫారూఖీ మాట్లాడుతూ 'మా సోదరుడు మొహియుద్దీన్ ఎవరో ట్రాప్ చేసి ఈ కుట్రలో ఇరికించారు. మా బ్రదర్‌కు ఉగ్రవాద కార్యకలాపాలతో లింక్స్ ఉన్నట్లు మాకు తెలియదు. నవంబర్ 5న బిజినెస్ డీల్ ఉందని చెప్పి ఇంట్లో నుంచి గుజరాత్ బయల్దేరాడు. 9వ తేదీన ఏటీఎస్ వారు నాకు ఫోన్ చేసి మీ సోదరుడికి ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నాయని, అరెస్ట్ చేశాం అని చెప్పారు. మొహియుద్దీన్ నివాసాన్ని ముట్టొద్దు, 2 రోజుల్లో వచ్చి ఆయన రూమ్‌లో ఉన్న సామగ్రి స్వాధీనం చేసుకుంటాం అని ఏటీఎస్ పోలీస్ చెప్పారు. ఇంటికి ఏటీఎస్ పోలీసులు వచ్చారు, సామాన్లు సీజ్ చేసి తీసుకువెళ్లారు. ఏటీఎస్ అరెస్టు చేసినవారిలో మరో ఇద్దరు ఆజాద్ సులేమాన్ షేక్, మొహమ్మద్ సుహైల్ వారితో మాకు ఎలాంటి లింక్స్ లేవు' అని అన్నాడు. మొహియుద్దీన్ ఆముదం గింజల నుంచి రెసిన్ విషం తయారు చేసినట్లు నిఘా వర్గాల అనుమానించాయి. అందులో వాస్తవం ఏంటో మాకు తెలియదు. ఈ విషాన్ని మంచినీటి వ్యవస్థ, దేవాలయ ప్రసాద నీటిలో కలపాలని కుట్ర జరిగిందని ఆరోపణలు ఉన్నాయి. పాకిస్తాన్ హ్యాండ్లర్ అబూ ఖదీజా నుంచి టెలిగ్రాంలో ఆదేశాలు అందినట్లు ఏటీఎస్ వారు కనుగొన్నట్లుగా తెలుస్తుంది. మొహియుద్దీన్ ఫోన్లో లొకేషన్ ఆఫ్ చేసి, చాటింగ్ టెలిగ్రామ్ ద్వారా మాత్రమే ఇదంతా చేశాడా అన్నది మాకు తెలియదు. ఇంట్లోనే రెసిన్ తయారీ ల్యాబ్ ఏర్పాటు చేసినట్లు ఏటీఎస్ పోలీస్ తెలిపారు. సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా మొయినుద్దీన్ తిరిగిన మార్గాలపై పోలీస్ ఫోకస్ పెట్టారేమో. కేంద్ర ప్రభుత్వం పూర్తి విచారణ జరపాలన్నాడు. మొహియుద్దీన్ 2007-2013 మధ్య చైనాలో మెడిసిన్ చదివాడు. 2021లో వివాహం అయింది. కొంతకాలం అమెరికాలో ఉద్యోగం చేశాడు. రాజేంద్రనగర్ అసద్ మంజిల్, పోర్ట్‌వ్యూ కాలనీలో నివాసం ఉంటున్నాం. వీరి స్వస్థలం ఖమ్మం. 20 ఏళ్లుగా కుటుంబం హైదరాబాద్‌లో నివాసం ఉంటోంది.



# అటవీ అధికారులపై గ్రామస్తుల దాడి

నల్లగొండ, నవంబర్12 (జనంసాక్షి) : నల్గొండ జిల్లా చందంపేట మండలం గువ్వలగుట్ట వద్ద ఫారెస్ట్ అధికారులపై గ్రామస్థులు దాడి చేశారు. అటవీభూములు దున్నుతున్నారనే సమాచారంతో వెళ్లిన వారిపై గ్రామస్థులు దాడికి తెగించారు. గువ్వలగుట్ట వద్ద అటవీశాఖకు చెందిన భూములను గ్రామస్థులు దున్నుకుంటున్నారనే సమాచారంతో అధికారులు బుధవారం సాయంత్రం అక్కడికి వెళ్లారు. పట్టా కాగితాలు చూపించి దున్నుకోవాలని స్పష్టం చేశారు. దీంతో ఆగ్రహించిన గ్రామస్థులు.. అటవీ అధికారులు, సిబ్బందిపై రాళ్లు, కర్రలతో దాడికి పాల్పడ్డారు. గ్రామస్థుల దాడిలో ఆరుగురు అటవీ సిబ్బందికి తీవ్ర గాయాలు కావడంతో దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

# వరుస దాడులతో ఉక్కిరి బిక్కిరి

- ఒత్తిడి తట్టుకోలేకే ఎర్రకోట వద్ద పేలుళ్లు
- విచారణలో ఆసక్తికర విషయాలు వెల్లడి



న్యూఢిల్లీ, నవంబర్12 (జనంసాక్షి) : ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడు ఘటనపై ప్రాథమిక దర్యాప్తులో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఢిల్లీ-ఎన్సీఆర్, జమ్మూకశ్మీర్ పుల్వామాలోని పలు ప్రాంతాలలో భద్రతా సంస్థలు ఇటీవల దాడులు జరిపి భారీఎత్తున పేలుడు పదార్థాలను పట్టుకున్నాయి. దీంతో ఉగ్రవాదుల్లో ఒత్తిడి మరింత అధికమైంది. ఈ ఒత్తిడిని ఎదుర్కోలేకనే అనుమానితుడు తొందరపడి బ్లాస్టర్ చేశారని అధికారులు వెల్లడించారు. హరియాణాలోని ఫరీదాబాద్‌లో ఈ నెల 9, 10 తేదీల్లో అధికారులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఈ సోదాల్లో దాదాపు 3000 కిలోల పేలుడు పదార్థాలు, డిటోనేటర్లు, టైమర్లు సహా పలు బాంబు తయారీ సామగ్రినీ స్వాధీనం చేసుకున్నారు అధికారులు. భద్రతా సంస్థలు వాటిని పట్టుకోవడానికి జరిపిన దాడుల కారణంగా భయాందోళన, నిరాశ కారణంగా పేలుడు సంభవించిందని నిఘా వర్గాలు ప్రాథమికంగా అంచనా వేశాయి. ఈ నేపథ్యంలో బాంబును పూర్తిగా తయారు చేయకుండానే పేలుడుకు పాల్పడినట్టు నిర్ధారణ అవుతోంది. అయితే.. ఈ ఘటనలో పేలుడులో వినియోగించిన పదార్థాలేవో ఇంకా గుర్తించలేదని పోలీసులు తెలిపారు. అనుమానిత మాడ్యూళ్లపై నిఘా వర్గాలు దృష్టి సారించి అరెస్ట్ చేయడం వల్ల ఓ పెద్ద పెను ప్రమాదం తప్పిందంటూ అంచనా వేశారు.

# రవాణా శాఖలో ప్లాన్ ఆఫ్ యాక్షన్ కఠినతరం

- ఎన్ఫోర్స్ మెంట్ కోసం జిల్లా స్థాయిలో 33 బృందాలు
- రాష్ట్ర స్థాయిలో 3 ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్స్ ఏర్పాటు
- రవాణా శాఖ సమీక్షా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్ (జనంసాక్షి) : రోడ్డు ప్రమాదాలు తగ్గించడానికి రోడ్డు నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనాల పై కఠినచర్యలు తీసుకొనేందుకు రవాణా శాఖ లో నిరంతరం ఎన్ఫోర్స్మెంట్ ఉండేలా ప్రభుత్వం ప్లాన్ ఆఫ్ యాక్షన్ ను రూపొందించింది. ఎన్ఫోర్స్మెంట్ కఠినతరం చేయడానికి సచివాలయంలో రవాణా శాఖ ముఖ్య అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్ఫోర్స్మెంట్ కోసం రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా స్థాయిలో 33 బృందాలు ,రాష్ట్ర స్థాయిలో మూడు ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. ప్రతి రోజు విధిగా ఆకస్మిక తనిఖీలు చేపట్టేలా ఆ రోజు చేయాల్సిన ఎన్ఫోర్స్మెంట్ ప్రాంతాలపై ఆయా బృందాలకు ఉదయం ఆరు గంటలకు రవాణా శాఖ ఉన్నతాధికారుల నుండి సమాచారం తెలపనున్నారు. ముఖ్యంగా ఓవర్ లోడింగ్ లారీలు , బస్సులు మినరల్ ట్రాన్స్ఫోర్ట్ లో సాండ్ ,ఫ్లైయాష్ , స్టోన్, బిల్డింగ్ మెటీరియల్స్ ,వాహనాల ఫిట్నెస్ , పొల్యూషన్ , చలానాలు పై ఈ ఎన్ఫోర్స్మెంట్ బృందాలు తనిఖీలు చేయనున్నాయి. వాటికి అదనపు పెనాల్టీ తో పాటు వాహనాల సీజ్ చేసేలా చర్యలు తీసుకోనున్నారు. ఒక్కో బృందంలో డిటిసి ఎంవీఐ , ఏఎంవీఐ ఇతర సిబ్బంది ఉండనున్నారు. గత నెలల్లో రద్దు చెస్ పోస్ట్‌లో పని చేసిన సిబ్బందిని కూడా ఎన్ఫోర్స్మెంట్ లో చేసేలా ఆదేశాలు జారీ చేశారు. ఎన్ఫోర్స్మెంట్ బృందాలు ప్రయాణికులతో వెళ్తున్న ఆటోలు , వ్యవసాయ సంబంధిత ట్రాక్టర్ లపై వేధింపులకు గురి చేయరాదని ఆదేశాలు జారీ చేశారు.

ఎన్ఫోర్స్మెంట్ మార్గదర్శకాల్లో ప్రధానంగా జెటిసి (ఎన్‌ఫోర్స్‌మెంట్) రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేయడానికి జిల్లాల నుండి ఎంవీఐ, ఏఎంవీఐలను నెలవారీ రొటేషన్ రాష్ట్రవ్యాప్తంగా ఆకస్మిక తనిఖీ చేయడానికి ఈ స్క్వాడ్‌ను ఉపయోగిస్తారు. జెటిసి-హైదరాబాద్, డిటిసిలు ప్రభుత్వ సెలవు దినాలతో సహా అన్ని సమయాల్లో కనీసం ఒక ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం రోడ్డుపై ఉండే విధంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను మోహరించేలా చూసుకోవాలి. హైదరాబాద్‌లోని జెటిసి ,రంగారెడ్డి, నల్గొండ, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, సంగారెడ్డి డీటీసీలు ప్రతి వారం కనీసం రెండుసార్లు అంతర్రాష్ట్ర కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సులపై తనిఖీలు నిర్వహించేలా యాక్షన్ ప్లాన్ రూపొందించాలి.

# చరిత్రకారులు సయ్యద్ నశీర్ అహమ్మద్‌కు అందజేత

- అందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



విజయవాడ (జనంసాక్షి) : ప్రముఖ చరిత్రకారులు, బహగ్రంథ రచయిత సయ్యద్ నశీర్ అహమ్మద్ కు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా రాష్ట్ర ఉర్దూ అకాడమీ ప్రకటించిన జీవిత సాఫల్య పురస్కారాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం రాత్రి విజయవాడలో అందజేశారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ 138వ జయంతి సందర్భంగా ఏర్పాటైన "అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమ దినోత్సవ" సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు పురస్కారం అవార్డు గ్రహీతులకు అందజేశారు. స్థానిక తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంగళవారం రాత్రి పురస్కారాల పదానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నశీర్ అహమ్మద్ ను 25,000 నగదు, జ్ఞాపికతో ముఖ్య మంత్రి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా 2014 లో నశీర్ వెలువరించిన "చరితార్థులు" ఆల్బం ను ముఖ్యమంత్రికి అందేశారు. ఈ గ్రంథంలో 155 మంది ముస్లిం స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాలు, వారి వివరాలను ఆంగ్లం తెలుగు భాషల్లో పొందుపర్చిన వైనాన్ని ముఖ్యమంత్రికి వివరించారు. ఈ గ్రంథం పట్ల ఆసక్తి చూపిన ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు నశీర్ నుండి మరిన్ని వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈమేరకు 2016 లో ఉగాది పురస్కారం, 2025 ఉగాది పండుగ సందర్భంగా "కళారత్న" పురస్కారం ముఖ్యమంత్రి నారా నుండి అందుకున్న నశీర్ అహమ్మద్ ప్రస్తుత జీవన సాఫల్య పురస్కారంతో మూడు సార్లు చంద్ర బాబు నుంచి పురస్కారాలు అందుకున్నట్టయింది. సయ్యద్ నశీర్ అహమ్మద్ గత మూడు దశాబ్దాలుగా భారత స్వాతంత్ర్యోద్యమంలో ముస్లిం జనసముదాయాలు నిర్వహించిన పాత్రను పేర్కొంటూ విశేష కృషి చేస్తున్నారు. నశీర్ ఇప్పటివరకు 25 పరిశోధనాత్మక చరిత్ర గ్రంథాలను వెలువరించారు. ఈ గ్రంథాలు తెలుగు భాషతోపాటుగా ఉర్దూ, హిందీ, తమిళం, కన్నడం, గుజరాతి భాషలలో వెలువడ్డాయి. నశీర్ అహమ్మద్ కేవలం చరిత్ర గ్రంథ రచన, ప్రచురణతో సరిపెట్టుకోకుండా స్వాతంత్ర్య సమర యోధుల త్యాగమయ, సాహసోపేత పోరాటాలను, స్వాతంత్ర్య సాధనలో వారి పాత్రను ప్రజలకు, ముఖ్యంగా యువత, విద్యార్థులకు తెలియపర్చుతూ పలు ప్రచార కార్యక్రమాలను దేశంలోనే కాకుండా విదేశాలలో కూడా అవిశ్రాంతంగా నిర్వహిస్తున్నారు. చరిత్ర గ్రంథాల రచన, ప్రచురణను వ్యాపార దృష్టితో కాకుండా సేవా దృష్టితో నిర్వహిస్తున్న నశీర్ అహమ్మద్ తన కుటుంబం, తన సన్మిత్రుల ఆర్థిక సహకారంతో ప్రచురించిన గ్రంథాలను ఎంపిక చేసిన వందలాది గ్రంథాలయాలను, చరిత్రకారులకు, జర్నలిస్టులకు తమ వదాన్యుల చిరుగానుకగా అందిస్తున్నారు. ఈ విధంగా నశీర్ అహమ్మద్ సాగిస్తున్న అవిశ్రాంత శ్రమను గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం 'జీవన సాఫల్య పురస్కారం' అందజేసింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ శాఖామాత్యులు ఎన్ఎండీ ఫరూక్ , శాసన సభ్యులు ఎండీ నసీర్ , బోండా ఉమామహేశ్వర రావు, సయ్యద్ షాజహాన్ బాషా, రాష్ట్ర నూర్భాషా ఆర్థిక సహాయక సంస్థ అధ్యక్షుడు షేక్ నాగూల్ మీరా, రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీ వ్యవహారాల సలహాదారులు అహమ్మద్ షరీఫ్, మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఎండి ఫరూక్ షుబ్లి, తెలుగు దేశం అధికార ప్రతినిధి సయ్యద్ రఫీ, ఎస్.పి సాహెబ్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# అన్నదాతలకు అన్ని విధాలుగా అండగా ఉంటాం

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి) : అన్నదాతలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.బుధవారం గరిడేపల్లి మండలం గడ్డిపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేసి ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. స్వాతంత్ర్య భారతదేశ చరిత్రలో ఒక్క సీజన్ లోనే 150 లక్షల మెట్రిక్ టన్నుల పంట పండించిన రాష్ట్రం తెలంగాణ అని అన్నారు.ప్రభుత్వమే 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 25 వేల కోట్ల రూపాయలతో సేకరించటం చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు.ఎఫ్సీఐ నిబంధనల మేరకు తేమ శాతం 17 రాగానే ధాన్యం కొనుగోలు చేసి 48 నుంచి 72 గంటల్లో రైతుల అకౌంట్ లలో మద్దతు ధరతో కలిపి బోనస్ డబ్బులు చెల్లించడం జరుగుతుందని తెలిపారు.మొంథా తుఫాన్ వల్ల రాష్ట్రంలో అధిక వర్షాలు కురవవడంతో ధాన్యం తడిచిందని,తడిచిన ధాన్యాన్ని రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని స్పష్టం చేసారు.ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా తేమ కొలిచే మిషన్లు,ప్యాడి డ్రైయర్స్, ప్యాడి క్లీనర్స్,టార్పాలిన్లు లాంటి అన్ని మౌలిక వసతులు కల్పించటం జరిగిందని అన్నారు.రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో దాన్యం విక్రయించి మద్దతు ధరతో పాటు 500 రూపాయల బోనస్ పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్,ఎస్పీ కె.నరసింహ,ఆర్డీవో శ్రీనివాసులు,డిఎస్ఓ మోహన్ బాబు, డిఎం రాము, తహసిల్దార్ కవిత, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గురుకులాల బకాయిలు, మధ్యాహ్న భోజనం బకాయిలు
# 163 కోట్లు వెంటనే విడుదల చేయండి

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఆదేశం



హైదరాబాద్ (జనంసాక్షి) : ఎస్సీ, మైనారిటీ గురుకులాల డైట్, అద్దె బకాయిలు, మధ్యాహ్నం భోజనానికి సంబంధించిన బకాయిలు మొత్తం సుమారు 163 కోట్లు వెంటనే విడుదల చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం ఆయన ప్రజా భవన్ లో, ఆర్థిక శాఖ అధికారులు, గురుకులాల అధికారుల తో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని ఎస్సీ గురుకులాలు, హాస్టల్లు, ఇతర సంస్థలకు సంబంధించిన డైట్, అద్దె, కాస్మోటిక్స్ బకాయిలకు సంబంధించిన 51.36 కోట్లు విడుదల చేయాలని డిప్యూటీ సీఎం ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. వీటితోపాటు రాష్ట్రంలోని అన్ని మైనారిటీ గురుకులాలు మైనార్టీ విద్యాసంస్థలకు సంబంధించిన డైట్, అద్దె బకాయిలు 47.61 కోట్లు విడుదల చేయాలని ఆదేశించారు. అదేవిధంగా రాష్ట్రంలో మధ్యాహ్న భోజనానికి సంబంధించి పెండింగ్ లో ఉన్న 63.92 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన, పోషక విలువలతో , వైవిధ్యంతో కూడిన ఆహారాన్ని అందించాలన్న సదుద్దేశంతో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే గురుకులాలు, వసతి గృహ విద్యార్థుల డైట్ చార్జీలు 40%, కాస్మోటిక్ ఛార్జీలు 200 పెంచిన విషయాన్ని గుర్తు చేశారు. నిర్వహకులు నాణ్యతలో ఎక్కడ రాజీ పడవద్దని, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ పూర్తిస్థాయిలో పాటించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను సమీక్షించేందుకు అధికారులు నిర్దేశిత క్యాలెండర్ ప్రకారం సందర్శించాలని సూచించారు.

# చెరువులకు అందాలు అద్దడం అభివృద్ధి కాదు

- పూర్తి స్థాయి పునరుద్ధరణ జరగాలన్న హైడ్రా కమిషనర్




హైదరాబాద్, నవంబర్ 12 (జనంసాక్షి) : చెరువుల అభివృద్ధి అంటే అందాలు అద్దడం ఒక్కటే కాదని.. దాని అవసరాలు నెరవేరే విధంగా వాటిని తీర్చిదిద్దాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. సకల జీవకోటికీ ప్రాణాధారంగా వాటిని రూపొందించాలని అన్నారు. చెరువుల్లో ఆక్రమణలను, పోసిన మట్టితో పాటు.. కొన్నేళ్లుగా పేరుకుపోయిన పూడికను, దుర్గంధాన్ని తొలగించిన తర్వాత మిగతా ఆకర్షణలపై దృష్టి పెట్టాలని సూచించారు. సీఎస్ ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ)కింద చెరువులను అభివృద్ధి చేస్తున్నవారు ఈ విషయాలపై దృష్టి పెట్టాలన్నారు. శిల్పకళావేదికలో తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం బుధవారం నిర్వహించిన సౌత్ ఇండియా సీఎస్ఆర్ సమ్మిట్‌లో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రసంగించారు. సీఎస్ ఆర్ నిధులు పూర్తి స్థాయిలో సద్వినియోగం అయ్యేలా ఆయా సంస్థలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా చెరువుల పునరుద్ధరణను హైడ్రా ఎలా చేపట్టిందనేది పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అంబర్‌పేటలోని బతుకమ్మ కుంటతో పాటు.. నగరంలో మొదటి విడతగా చేపట్టిన 6 చెరువుల పునరుద్ధరణ గురించి వివరంగా తెలిపారు. చెరువుల్లో వరద నీరు నిలిచేలా లోతు పెంచాల్సినవసరం ఉందని.. అలాగే ఇన్‌లెట్లు, ఔట్‌లెట్లు సరిగా ఉండేలా చూడాలన్నారు. చెరువుల్లోకి మురుగు నీరు చేరకుండా హైడ్రా చర్యలను కూడా వివరించారు.

## చెరువులతో పాటు నాలాల అభివృద్ధి

గొలుసుకట్టు చెరువులకు ప్రాణాధారమైన నాలాలను కూడా పరిరక్షించుకోవాల్సినవసరం ఉందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. అప్పుడే నగరంలో వరదలను నివారించగలమని చెప్పారు. చెరువుల ఆవశ్యకతను వివరిస్తూ.. ఒక ఎకరం పరిధిలో మీటరు లోతులో 4 మిలియన్ లీటర్ల నీటిని ఆపగలమన్నారు. ఈ లెక్కన వరదలను నివారించడానికి చెరువులు ఎంత అవసరమో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదన్నారు. ప్రభుత్వ భూములు, చెరువుల, నాలాలు, పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను పరిరక్షించడంతో పాటు.. ప్రకృతి వైపరీత్యాలను సమర్థవంతంగా ఎదుర్కోడానికి హైడ్రాను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ప్రకృతిని మనం కాపాడితే.. ప్రకృతి వైపరీత్యాల నుంచి చాలా వరకు బయటపడగలమన్నారు. నగరంలో చెరువులు దాదాపు 61 శాతం కనుమరుగయ్యాయయన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370